
اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 3 సంచిక 1 ఆగష్టు, 2011 రూ. 17/-



అల్లాహ్ అనుగ్రహంతో

3 వ సంవత్సరంలో అడుగుపెట్టిన
తొలి తెలుగు పరిశోధనాత్మక
ఇస్లామీయ మాసపత్రిక

## దు'ఆ ప్రత్యేక వ్యాసం

ఇస్లామీయ రాజ్యంలో
పాలించే నాయకుని ఇంటి తలుపులు
ప్రజల కొరకు తెరిచే ఉండాలి, ఏ ద్వారపాలకుడు లేకుండా

మక్కాలోని కాబా మస్జిద్ నుండి ఆకాశాలవైపు
(బైతుల్ మ'మూర్ కు) వెళుతున్న రేడియేషన్!

ఇంటర్‌నెట్‌లో ఇస్లామ్ కబుర్లు ...

قُلِ اللّٰھُمَّ مٰلِکَ الْمُلْکِ تُؤْتِی الْمُلْکَ مَنْ تَشَآءُ وَتَنْزِعُ الْمُلْکَ مِمَّنْ تَشَآءُ وَ تُعِزُّ
مَنْ تَشَآءُ وَ تُذِلُّ مَنْ تَشَآءُ بِیَدِکَ الْخَیْرُ اِنَّکَ عَلٰی کُلِّ شَیْءٍ قَدِیْرٌ

ఇలా అను: “ఓ అల్లాహ్, విశ్వ సామ్రాజ్యాధిపతి! నీవు ఇష్టపడినవారికి రాజ్యాధికారాన్ని ప్రసాదిస్తావు మరియు నీవు కోరిన వారిని రాజ్యాధికారం నుండి తొలగిస్తావు మరియు నీవు ఇష్టపడిన వారికి **గౌరవాన్ని ప్రసాదిస్తావు** మరియు నీవు కోరిన వారిని **పరాభవం పాలు చేస్తావు**. నీ చేతిలోనే మేలున్నది. నిశ్చయంగా, నీవు ప్రతిదీ చేయగల సమర్ధుడవు. (ఖుర్'ఆన్ 3:26)

పరాభవం చేసేవాడు

# المُذِلّ

**THE GIVER OF DISHONOUR**

గౌరవం ఇచ్చేవాడు

# المُعِزّ

**THE GIVER OF HONOUR**

# అల్లాహ్

**Say, “O Allah, Owner of Sovereignty, You give sovereignty to whom You will and You take sovereignty away from whom You will. You honor whom You will and You humiliate whom You will. In Your hand is [all] good. Indeed, You are over all things competent. (Qur’an 3:26)**

ఆగస్టు 2011
రమదాన్ 1432

**శాంతిబాట**

మాసపత్రిక రూ. 17/-

సంపుటి 3 సంచిక 1 ఆగస్టు 2011

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Email:velugubaata@gmail.com

Cell : 9491103017

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**4** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** నేటి స్త్రీలకు ఆదర్శం - ఖదీజా(రజి) ...

**8** **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర**

**13** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం - సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) ...

**21** **దు'ఆ :** వేడుకోలు యొక్క ప్రాముఖ్యతను వివరించే ప్రత్యేక వ్యాసం ...

**24** **ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు :** కాబా మస్‌జిద్ నుండి ప్రసరించబడుతున్న రేడియేషన్ ...

**26** **జకాత్ :** పేదల, బంధువుల, బాటసారుల ... హక్కు - అభ్యంతరకర వ్యాఖ్యలతో కొందరి తిరస్కారం

**శాంతిబాట పాఠకులకు**

# ఈద్ ముబారక్

**సంవత్సర చందా:**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440

**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఇతర వివరాలకై సంప్రదించండి
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# అవినీతిపై పోరాటం

అవినీతిపై తప్పక పోరాడాలి. అయితే మనం ఏ అవినీతిపై పోరాడుతున్నామో దానిపై అవగాహన ఉండాలి. దేనికైనా సంకల్పమనేది ముఖ్యం. ఒక మంచి పనిని మంచి సంకల్పంతో చేస్తే దాని వలన ప్రయోజనం ఉంటుంది. అదే మంచి పనిని ఓ స్వార్థ సంకల్పంతో చేస్తే, ఆ మంచిపనే కొందరికి నష్టం కలిగించవచ్చు. ప్రస్తుత మీడియా ప్రజలను ఆలోచించనివ్వకుండా వార్తలను వండి వారుస్తున్న నేపథ్యంలో, మనం కొంచెం అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను విశ్లేషిస్తూ కొన్ని విషయాలను పాఠకులతో పంచుకోవాలను కుంటున్నాము.

'అన్నా హజారే వెనుక దేశం ఉంది'. ఇది మీడియా స్లోగన్. ఆయనకు బేడీలు వేస్తే దేశానికే బేడీలు వేసినట్లు అర్థమిచ్చే కార్టూన్లు న్యూస్ పేపర్లలో దర్శనమిస్తున్నాయి. ఇది మరీ టూమచ్. ఆయన పోరాటానికి మద్దతు ఇవ్వవచ్చుగాని ఇంత అతి అవసరమా? నిజంగా దేశమంతా అవినీతికి వ్యతిరేకమైతే, అవినీతికి మనదేశంలో చోటు లేనట్లే! **'అవినీతి (కరప్షన్) అంటే ఏమిటి?'**. ప్రశ్న చాలా సులభంగానే అనిపిస్తుంది. కాని ఈ రోజుల్లో ఏ పదానికైనా అర్థం, ఆ పదాన్ని ఎక్కువుగా ఉపయోగించే వారిని అడిగి తెలుసుకోవలసిన దుస్థితి ఏర్పడింది. ఇది హాస్యాస్పదంగా అనిపించవచ్చు. కాని సమకాలీన అర్థాలు అసలు అర్థాలను పక్కకు నెట్టేస్తున్నాయి.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారేగారికి మద్దతుగా నిరసన ప్రదర్శన చేశారు. ఆ విషయమై బిజెపి నాయకుడు కిషన్‌రెడ్డిగారి స్పందన : "అవినీతి అంతానికి దీక్ష చేపట్టిన అన్నా హజారేకు మద్దతుగా జాతీయ జెండాను చేతబూని ఊరేగడం చూసి **అవినీతి నవ్వింది, నీతి ఏడ్చింది**" వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడుగారు అవినీతి గురించి మాట్లాడటం పెద్ద జోక్ అని పగలబడి నవ్విన వారున్నారు. అంటే ఆయన దృష్టిలోని అవినీతి మరియు వీరి దృష్టిలోని అవినీతి ఒకటి కాదా? తనకు నష్టం కలిగిస్తూ, ఎదుటి వారికి మేలు కలిగించేదే రాజకీయ నాయకుల దృష్టిలో అవినీతి.

మీడియా అన్నా హజారే గారిని గాంధేయవాది అన్నారు. గాంధీ గారి మునిమనవడు తుషార్ గాంధీ ఇలా వ్యాఖ్యానించారు : "నిరాహార దీక్షను నిరసన ఆయుధంగా వాడుకోవడంలో ఇద్దరి (గాంధీ మరియు హజారే) మధ్య తేడా ఉందని అన్నారు. అంతేకాకుండా అవినీతికి వ్యతిరేకంగా హజారే నడుపుతున్న ఉద్యమంలో **జనాకర్షణ పాళ్లే** ఎక్కువని కూడా అన్నారు. మహాత్ముడి నిరసన ఉద్దేశ్యం విరోధిని సంస్కరించి స్నేహితుడిగా మార్చడం. హజారే నిరసన శత్రువుకు వ్యతిరేకం. **ఇది నువ్వా నేనా అనే ధోరణి**"

**ప్రజలను ఆకర్షించే దీక్షా?** అవును. ప్రజలను ఆకర్షించే విధంగా దీక్ష లేకపోతే మీడియా దగ్గరికి రాదు. నిగమానంద స్వామి గారికి పాపం ఈ విషయం తెలియక 110 రోజులు దీక్ష చేసి చనిపోయారు. ఆయన వలన శాంతిభద్రతల సమస్య తలెత్తలేదు. పోలీసులకు గాని, ప్రజలకు గాని, ప్రభుత్వానికి గాని ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. మీడియా దరిదాపులకు పోలేదు. రామ్‌దేవ్ బాబాగారిని ఉంచిన హాస్పటిల్‌లోనే ఈ స్వామిగారిని కూడా జాయిన్ చేశారు. ఆయన గురించి ఏ ఒక్కరూ ప్రాధాన్యత నివ్వలేదు. ఆ స్వామిగారికి మరియు ఈ అన్నా హజారేగారికి తేడా ఏమిటి? **ఇద్దరూ మంచి కోసమే దీక్షలు మొదలు పెట్టారు.** అన్నా హజారేగారి ఉద్యమం ఎవరిపై? నిజమైన అవినీతిపైనా? లేక పాలకపక్షం పాల్పడే అవినీతి పైనా? లేక ప్రతిపక్షాల అవినీతి పైనా? ఎన్నో సందేహాలు!

**మరో స్వాతంత్ర్య పోరాటమా!** ఇటువంటి స్టేట్‌మెంట్స్ దేశప్రతిష్టను దిగజార్చుతాయి. మంచి కోసం పోరాడవచ్చుగాని, మాటలు కూడా ఆ విధంగా ఉంటే చక్కగా ఉంటుంది. దురాక్రమణ చేసిన బ్రిటిష్‌వారు మనకు స్వేచ్ఛ లేకుండా చేశారు. ఈనాడు హజారేగారికి దీక్ష చేయడానికి స్వేచ్ఛ ఉంది, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా. నిగమానంద స్వామి గారు 110 రోజులు దీక్షచేయడానికి ప్రభుత్వం స్వేచ్ఛ కల్పించింది.

అన్నా హజారే గారి చిత్రపటాలు వేల సంఖ్యలో ముద్రితమయ్యాయి. ప్రదర్శనలు జరుగుచున్నాయి. పోలీసులకు పని చెప్పారు. ప్రభుత్వ పరంగా గాని, ప్రైవేట్‌పరంగా గాని ఖర్చు ఎంతవుతుంది? ఈ డబ్బు ఎక్కడిది? రాజకీయ పార్టీలు చేసే ఖర్చు వారి పార్టీ ఫండ్ నుండే! ఆ ఫండ్ ఎక్కడి నుండి వస్తుంది? బ్రిటిష్ వారి పాలనలో పాలకులెప్పుడూ బ్రిటిష్‌వారే! కాని ఈ ప్రజాస్వామ్య దేశంలో 5 సంవత్సరాల కొకసారి పాలకులను అతి సులభంగా, ఎటువంటి హింసకు తావులేకుండా, అనుమానం రాకుండా దింపేయవచ్చు. **అంత స్వేచ్ఛ మనకు భారత రాజ్యాంగం కల్పించింది.** మరో స్వాతంత్ర్య పోరాటం అనడం సమంజసం కాదు. మెజారిటీ ప్రజలు నీతినే కోరుకుంటే, అవినీతి ప్రభుత్వాలు అందలం ఎలా ఎక్కగలుగుతాయి.

అసలు అవినీతి మూలాలు ఎక్కడున్నాయి? 1000 రూ॥ల అవినీతి జరిగితే వదిలేసి 1000 కోట్ల అవినీతి గురించే మాట్లాడుతూ ఉంటే 'అవినీతి' నిర్మూలన సాధ్యం కాదు. ఒక పక్క దానిని తొలగిస్తుంటే, మరో ప్రక్కనుండి అవినీతి చిగురిస్తూనే ఉంటుంది.

ఎక్కడో చిన్నగా, ఓ పూరి గుడిశ తగలబడుతుంది. తగలబడుతున్నది ఓ గుడిశే కదా, పెద్ద నగరమేమీ తగలబడటం లేదు కదా అని, ఆ పెద్ద నగరానికే ప్రాధాన్యత ఇచ్చినప్పుడు, ఈ గుడిశ నుండి మరో గుడిశకు నిప్పు అంటుకుని చివరికి నగరాలే కాలి బూడిద అయిపోవచ్చు. అవినీతి నిర్మూలన అనేది క్రింది స్థాయి నుండి పకడ్బందీగా జరగాలి. పాలకులను తయారుచేసేది ప్రజలే! ఆ ప్రజలు నీతిని గెలిపిస్తే, అవినీతి ఉండదు.

లోక్‌పాల్ బిల్ అని, అరెస్టులు, నిరసనలు అంటూ న్యూస్‌పేపర్లలో చాలా పేజీలు కేటాయిస్తున్నారు గాని, వీరు ఏయే విషయాలు ఆ బిల్లులో ప్రతిపాదించారు? వాటి వలన ఉపయోగమేమిటి? ప్రభుత్వం వేటిని అంగీకరించింది? ప్రభుత్వం ఎందుకు తిరస్కరిస్తుంది? ఈ విషయాలపై సరియైన సమాచారం మాత్రం సామాన్యుల కొరకు ఇవ్వడం లేదు. సామాన్యుడుని భాగస్వామిగా చేసుకోకపోతే ఉద్యమాలు విజయవంతం కావు. అన్నా హజారేగారికి మద్దతు తెలుపుతూ నిరసన తెలిపేవారిలో ఎంతమందికి ఈ విషయాలపై అవగాహన ఉంది?

సామాన్య ప్రజలకు 'అవినీతి' అంటే ఏమి తెలుసు? అవినీతి నిరోధక శాఖ అనేది ఒకటుందని, ఆ శాఖ లంచం తీసుకునే వారిని పట్టుకుంటారని మాత్రం తెలుసు. కాబట్టి లంచం తీసుకోవడం అవినీతి. మరి లంచం ఇవ్వడమో!

"**లంచం ఇచ్చిన వాడిని మరియు దానిని తీసుకున్నవాడిని ముహమ్మద్(స)వారు శపించారు**". (అబూదావూద్, హసన్, 3580)

"ఏమి చేస్తామండి? లంచం ఇవ్వకపోతే పనిచేయనంటున్నాడు? అందుకే అప్పుచేసి అతనికి లంచం ఇచ్చాము". అటువంటి వ్యక్తికి తోటి ప్రజలు తోడుగా ఉండి, ఆ అధికారిపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేసి బాధితుడికి అండగా నిలిస్తే, లంచం తీసుకోవడానికి అధికారి భయపడతాడు. ప్రజలలో మార్పు రావాలి. ఒక అవినీతి పని చేయాలంటే భయం కలగాలి. ఇటువంటి మార్పు 'దైవభీతి' వల్లనే సాధ్యమౌతుంది.

మున్సిపల్ కార్పోరేషన్‌లో ఓ విభాగం వాళ్ళు ఒక షాపు ఓనర్‌ని లంచం అడిగారు. అంత మొత్తంలో లంచం ఇచ్చుకోలేనన్నాడు. ఆ తరువాత రోజే పెద్ద డస్ట్‌బిన్‌ను తీసుకువచ్చి ఆ షాపు ముందు ఉంచారు. ఈగలతో, దోమలతో, దుర్వాసనతో ఓ డస్ట్‌బిన్ షాపు ముందు ఉంటే, దానిని దాటుకుని ఆ షాపులోకి ఎంతమంది వెళతారు? మన జనాభాలో కేవలం 10 కోట్లమంది 1000 రు॥లు చొప్పున లంచం తీసుకుంటే అవినీతి సంపాదన 10,000 కోట్లు అవుతుంది. క్రింది స్థాయిలో జరిగే అవినీతి చాలా ఎక్కువ. వాటిపై ఎవరూ దృష్టి పెట్టరు. కారణం దాని వలన గుర్తింపు రాదు.

ఓ నాయకుని పేరు చెబితే అవినీతిపట్ల సింహం అనేవారు. ఓ చిట్‌ఫండ్ కంపెనీ లోని అవినీతిని ఓ ....గారు బయటపెట్టారు. దానికి స్పందించిన ఈ నాయకుడు 'అవి చూసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉంది కదా! ఈయనకెందుకు?' అని వ్యాఖ్యానించారు. మరి అవినీతిని చూసుకోవడానికి సిబిఐ ఉంది మరియు యాంటీ కరెప్షన్ బ్యూరో ఉంది కదా! మీరి మీరెందుకు అవినీతి గురించి మాట్లాడుతున్నారని ఎవరైనా ప్రశ్నించారో లేదో? ఆయన చిత్తశుద్ధిపై ప్రజలకు అనుమానం వచ్చింది. కాబట్టి అవినీతిపై పోరాటం అనేది అందరిపైనా జరుగుతుందా లేక వారు ఎంచుకున్న కొందరి పైనేనా?

పాలక పక్షంలో ఉన్న నేతలందరూ అవినీతిపరులే అనుకుందాం! ప్రతిపక్షాలన్నీ కలిసి 'అన్నా హజారే' వర్గం ఏది చెబితే దానిని గుడ్డిగా అనుసరిస్తామని ఒప్పందం చేసుకోవచ్చు. పాలకపక్షంలో ఏ రాజకీయ పార్టీ కూర్చున్నా చేసేది ఒకటే! అంతేకాకుండా చర్చలు లేకుండా గుడ్డిగా అనుసరిస్తే, దేశానికి ప్రమాదం. ప్రజలకు నష్టం. నిజంగా అవినీతిని నిర్మూలించాలని అనుకుంటే, ముందుగా అవినీతి అంటే ఏమిటి? అది ఏ విధంగా జరుగుతుందో ప్రజలకు వివరించి, ఆయా రంగాలలోని మేధావులతో చర్చించి, దానిని ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రజామోదం పొందాలి. ఆ తరువాత ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు సరియైన అవగాహన కల్పించకుండా, అన్నా హజారే వర్గం మరియు ప్రభుత్వం ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ దేశప్రతిష్టను దిగజార్చుతూ ఉంటే సామాన్య ప్రజానీకం ఏం చేస్తుంది? ఏ పాలకుడైనా ప్రజల నుండే రావాలి.

ఎన్ని చట్టాలు ఏర్పాటు చేసినా, చివరికి తేలేది కోర్టులలోనే! ఓ న్యూస్‌పేపర్ అధినేత మోసం చేశాడంటూ భూమిని లీజుకిచ్చిన వ్యక్తి కోర్టుకెళ్ళాడు. న్యాయం భూమిని లీజుకిచ్చిన వ్యక్తి వైపే ఉందని సామాన్యుడికి కూడా తెలుసు. కాని ఎన్నో సంవత్సరాలుగా కేసు నడుస్తుంది. ఇది జరిగేది ఓ జిల్లా కోర్టులో. ఒకవేళ ఇక్కడ మరో 10 సంవత్సరాలకైనా సరే న్యాయం గెలిస్తే (ఒకవేళ న్యాయం గెలిచింది అనుకుందాం). తరువాత హైకోర్టులో కేసు వేస్తారు. తరువాత సుప్రీమ్ కోర్టుకు వెళతారు. అప్పటికి భూమి ఓనర్‌గారి జీవితకాలం అయిపోతుంది. కొన్ని గంటలలో తేలిపోయే కేసులు కూడా కొన్ని దశాబ్దాలు గడిస్తే అవినీతిపై పోరాటం చేసేవారి గతి ఏమిటి?

దీక్ష భగ్నం చేస్తే జరగబోయే పరిణామాలకు నేను బాధ్యుణ్ణి కాదు. ఇది నేటి నాయకుల గాంధేయవాద (అ)హింసాత్మక హెచ్చరిక. ఈ రోజున మత, కుల, ప్రాంతీయ, రాజకీయ మరియు ఇతరత్రా ఏ దీక్షలు మరియు ఆందోళనలు, నిరసనలు జరిగినా, నేతలు అనే మాట ఒక్కటే - "ఏదైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండం అయిపోతుంది". అంటే రాష్ట్రాన్ని తగులబెడతారా?

వీడియోలు చూస్తున్నాం, ఆఫీసు పర్నిచర్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టడం. తగులబెట్టేవాడు సామాన్యుడే! అటువంటి ఫర్నిచర్ తన ఇంటికోసం ఏర్పాటు చేసుకోవాలంటే, ఎన్నాళ్లో కష్టపడి పనిచేస్తేగాని అతడికి సాధ్యం కాదు. ఎదుటి వారిది తగలబెడుతున్నాడు. అదొక పైశాచిక ఆనందం. అతను చూస్తుండగా అతడి ఇల్లు ఎవరైనా తగులబెట్టినప్పుడు ఇటువంటి పైశాచిక ఆనందం కలుగుతుందా? అవినీతిని ఎదిరించడం అనేది క్రింది స్థాయి నుండి జరగాలి. క్రింది స్థాయిలో జరిగితే ఫలితం కనిపిస్తుంది. కాని సెలబ్రిటీ స్టేటస్ రాదు.

ఒక వర్గం హింసను ప్రేరేపించి, అధికారాన్ని చేజిక్కించుకోవాలని భావిస్తుంది. అధికారంలోకి వచ్చాక ఎటువంటి హింస ఉండదను కుంటుంది. ఎందుకంటే హింసకు పాల్పడేది తామే కదా అనుకుంటుంది. కాని వీరి అడుగుజాడలలో మరో వర్గం అదే హింసామార్గాన్ని అనుసరించి వీరిని అధికారం నుండి దింపేస్తుంది. తప్పుడు మార్గాల ద్వారా వెళితే, తరువాత కాలంలో పశ్చాత్తాప పడవలసి వస్తుంది.

నేడు గవర్నమెంట్‌ని హెచ్చరించి అనుకున్నది సాధించామనుకుంటే, రేపు మరొకరు దీక్ష పేరుతో ప్రభుత్వాన్ని శాసిస్తారు. ఈ విధంగా శాసిస్తూ ఉంటే ఇక శాసనసభలు ఎందుకు? వ్యవస్థ పాడైతే, ప్రజలను జాగృతపరచి, వ్యవస్థను తిరిగి బాగుచేసుకోవాలి. ప్రజలలో అనుమానాలు కలుగకూడదు. ప్రజలకు తెలిసిన ఒక అవినీతిపరునితో స్నేహంగా ఉంటూ, అతడి ఎదురుగా మరొక అవినీతిపరుడిని నిందిస్తే ప్రజలలో అనుమానాలు కలుగుతాయి. "మన రాష్ట్రంలోని ఒక యువకుడు తక్కువ కాలంలో వందల కోట్లు వ్యాపారం ద్వారా ఎలా సంపాదించాడు? ఇదంతా అవినీతి సంపాదన" అని నిందించేవారు, ముఖేష్ అంబానీ తక్కువ కాలంలో ప్రపంచ కుబేరుల్లో మొదటి 10 మందిలో స్థానం ఎలా సంపాదించగలిగారు అని అనగలరా? వారిపై దర్యాప్తు చేయించగలరా? ఒకరిపై చేయకపోతే ఇంకెవరిపై చేయకూడదని మా ఉద్దేశ్యం కాదు. పారిశ్రామిక వేత్తలే ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని అంటున్నారు. నిజం అల్లాహ్‌కే తెలుసు. అందరికీ ఒకే న్యాయం ఉండాలి. అలా జరిగినప్పుడే ఏ ఉద్యమాలు చేసినా ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారు.

**- శాంతిబాట టీమ్**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**10**

(గత సంచిక తరువాయి ...)

### నేటి స్త్రీలకు ఆదర్శం - ఖదీజా(రజి)

క్రిందటి సంచికలో ఖదీజా(రజి)వారి గురించి కొంత చెప్పుకున్నాం. ప్రవక్త(స)వారికి తొలి వహీ అందే సమయానికి ఆయన వయస్సు దాదాపు 40 సంవత్సరాలు మరియు ఖదీజా(రజి)వారి వయస్సు దాదాపు 55 సంవత్సరాలు. ఆయన(స)కు ఆమె తప్ప మరొక భార్య లేరు. ఆ రోజుల్లో అరబ్బు సమాజంలో పురుషుడు ఎన్ని పెళ్ళిళ్ళు అయినా చేసుకోవచ్చు. భార్యల సంఖ్య విషయంలో ఎటువంటి పరిమితి లేదు. ఆ సమాజంలో అది తప్పు కూడా కాదు. అది సర్వసాధారణం. అటువంటి సమాజంలో పుట్టి పెరిగిన ముహమ్మద్(స)వారు 25 సం॥ల వయస్సులో 40 సంవత్సరాల వయస్సున్న విధవరాలైన ఓ మహిళను వివాహం చేసుకున్నారు.

ప్రవక్త(స)వారు మరో వివాహం చేసుకున్నా ఎవరూ అడ్డు చెప్పరు. భార్య వయస్సు ఎక్కువ కాబట్టి, తన వయస్సున్న మరో స్త్రీని ఆయన కావాలనుకుంటే వివాహం చేసుకోవచ్చు. కాని తొలి సందేశం అందే సమయానికే 15 సం॥ల పాటు భార్యతో అన్యోన్యమైన కాపురం చేశారు. ప్రవక్త(స)వారి ఉత్తమ నడవడిక గురించి అరేబియా అంతా తెలుసు. అటువంటి మహనీయునికి భార్యయైన ఖదీజా(రజి)వారికి భర్త అంటే ఎనలేని ప్రేమ మరియు గౌరవమున్నాయి. అటువంటి ఉత్తమ లక్షణాలను ఆమె మరొకరిలో చూడలేదు. అల్లాహ్ యొక్క చిట్ట చివరి ప్రవక్త మరియు సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన వ్యక్తి ఆమెకు భర్త కావడాన్ని బట్టి అల్లాహ్ అనుగ్రహం ఆమె(రజి)పై ఏ స్థాయిలో ఉందో అర్థమౌతుంది.

అటువంటి భర్త చిన్నగా బాధపడినా ఆమె చూడగలరా! తట్టుకోలేరు. కంగారుపడి కన్నీళ్ళు పెట్టుకుంటారు. కాని ప్రవక్త(స)వారు విపరీతమైన టెన్షన్‌తో అల్లాహ్ పంపిన తొలి సందేశాన్ని స్వీకరించి ఇంటికి వచ్చినప్పుడు, ఆమె కంగారుపడకుండా ఎంత ఉత్తమంగా ఓదార్చారో క్రిందటి సంచికలో వివరించాము.

సాధారణంగా అందరూ కలిగి ఉండేవి, తాను కలిగి ఉండకపోతే, అల్లాహ్ తనకు అన్యాయం చేసాడని సగటు మనిషి భావిస్తాడు. అల్లాహ్ ఎవరికీ అన్యాయం చేయరు. మన దగ్గర లేనివి జీవితంలో కోల్పోయినట్లు కాదని మనలో జ్ఞానం పెరిగేకొద్దీ అర్థమౌతూ ఉంటుంది.

ముహమ్మద్(స)వారు పుట్టాక, ఆ గొప్ప బిడ్డని చూసుకునే అదృష్టం లేకుండా తండ్రి గారైన అబ్దుల్లా మరణించారు. ఊహ తెలుస్తున్న సమయంలో తల్లి మరణించారు. ఆ తరువాత ప్రాణంగా చూసుకునే తాతయ్యగారు మరణించారు. అయినప్పటికీ బాబాయి ప్రాణంగా చూసుకుంటూ ముహమ్మద్(స)వారిని పెంచారు.

ఆ తరువాత ఖదీజా(రజి)వారితో వివాహం. ప్రేమగా చూసుకున్న అబూ తాలిబ్‌గారు ముహమ్మద్(స)వారికి ఓ కన్యను ఇచ్చి వివాహం చేయకుండా, విధవరాలైన స్త్రీతో వివాహం ఎందుకు జరిపించారని ఎవరికైనా అనిపించవచ్చు. ఆమెకున్న ఉత్తమ లక్షణాలను చూచి ఆయన ఆమోదించారు.

ఒక వ్యక్తికి వివాహం జరిగాక అతడు నిర్వర్తించవలసిన బాధ్యతలు ఒకటొకటిగా మొదలౌతాయి. ఆ బాధ్యతల నిర్వహణలో తన జీవిత భాగస్వామి అనుకూలంగా ఉండకుండా, కష్టసుఖాల్లో తోడుగా లేకపోతే, ఆ బాధ్యతల భారం ఆ వ్యక్తిని ఎంతగానో కృంగదీస్తుంది.

కాని భార్య ఉత్తమురాలైతే, ఆ బాధ్యతల నిర్వహణ భారం తక్కువుగా అనిపిస్తుంది. ఏ వ్యక్తికైనా అసలు జీవితం పెళ్ళి తరువాతే మొదలౌతుంది. ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రను చదివిన వారికి, ప్రపంచంలో ఏ మానవుడూ పడనన్ని కష్టాలు ఆయన పడ్డారని స్పష్టంగా తెలుస్తుంది. సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ఈ మహనీయునికి ఇన్ని కష్టాలా? అని మన కళ్ళు వర్షిస్తాయి. అదే సమయంలో ఆయన(స)పై వర్షించిన అల్లాహ్ అనుగ్రహం కూడా అసాధారణమైనదే!

ఖదీజా(రజి)వారి వంటి ఉత్తమ భార్యను కలిగి ఉండేలా చేయడం అల్లాహ్ అనుగ్రహంలో ఓ భాగమే!

ఎవరి జీవిత చరిత్రయైనా చదివేటప్పుడు ముందుగా ఆయన జననం నుండి మొదలై, ఆయన మరణం వరకూ ఒక క్రమంలో చెబితే, వినేవారికి

గాని, చదివేవారికి గాని చాలా సౌకర్యంగా ఉంటుంది. నిజమే! అయితే ముహమ్మద్(స)వారి వంటి మహనీయుని గురించి చెప్పేటప్పుడు కొన్ని చివరి విషయాలు కూడా ఒకొక్కసారి ముందుగా ప్రారంభంలో చెప్పు కోవలసి వస్తుంది. అప్పుడే పాఠకునికి ఒకొక్క విషయం స్పష్టమౌతుంది.

ముహమ్మద్(స)వారు 63 సంవత్సరాలు జీవించారు. 25 సం॥ల వయస్సులో వివాహం చేసుకుని, 25 సం॥లు ఖదీజా(రజి)తో కాపురం చేశారు. అంటే ఆ తరువాత దాదాపు 13 సంవత్సరాలు మాత్రమే జీవించారు. ఖదీజా(రజి)వారు జీవించి ఉండగా ఆ 25 సం॥ల కాలంలో మరో వివాహం చేసుకోలేదు.

ఆమె(రజి) మరణించిన తరువాత, జీవితపు ఆఖరి 13 సంవత్సరాల కాలంలోనే 10 వివాహాలు చేసుకున్నారు. ఆ వివాహాల వెనుక ఓ గొప్ప లక్ష్యముంది. ఈ విషయం పూర్తి వివరంగా 'ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం' పుస్తకంలో తెలియజేశాము. అంతేకాకుండా, వివాహాలకు సంబంధించిన ఎన్నో అపోహలను దూరం చేస్తూ ఆధారాలు కూడా అందించాము.

ఆ వివాహాలలో ఏదీ కూడా భౌతిక సుఖం కోసం కోరికతో చేసుకున్నది కాదు. ఏ పురుషుడైనా కేవలం కోరికలతో వివాహం చేసుకోవాలనుకుంటే తన యుక్త వయస్సు నుండి 50 సంవత్సరాల మధ్యకాలంలోనే చేసుకుంటాడు. కాని ఆ వయస్సులో ఆయన(స) తన కంటే వయస్సులో పెద్దవారైన ఖదీజా(రజి)వారితోనే జీవించారు. ఖదీజా(రజి)వారు మరణించే సమయానికి ఆమె వయస్సు 65 సం॥లు. ఆమె అంటే ఆయన(స)కు ప్రేమతో పాటు ఎంతో గౌరవం కూడా! దీనిని బట్టి మనకు తెలిసేది ఏమిటంటే భార్యను గౌరవించడం కూడా 'సున్నత్' (ప్రవక్త సాంప్రదాయమే!).

ఆయిషా(రజి)వారితో ఆయనకు జరిగిన వివాహం మూడవది. ఆమె ధార్మిక విషయాలలో చాలా చురుకుగా ఉండేవారు. మంచి జ్ఞానం కలిగినవారు. ప్రవక్త(స)వారికి అప్పటికి కలిగి ఉన్న భార్యలందరి కంటే ఆయిషా(రజి)వారిని ఎక్కువగా ప్రేమించేవారు. దానికి కారణం ఆమె తెలివితేటలు మరియు ఆచరణ. ఆ మాతృమూర్తి వలన ఎంతో జ్ఞానం ముస్లిమ్ సమాజానికి అందింది.

అంతగా ప్రేమిస్తున్న భార్య యైన ఆయిషా(రజి)తో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలు :

ఇంట్లో ఎప్పుడు మంచి వంటకం జరిగినా లేక ఏదయినా పశువును కోసుకున్నా మహాప్రవక్త(స) ఖదీజా స్నేహితురాళ్ళను వెదికి వెదికి మరీ మాంసం పంపేవారు. ఆ దంపతుల అన్యోన్యాన్ని గురించి హజ్రత్ ఆయిషా(రజి) ఇలా అంటున్నారు. "ఖదీజాను నేను చూడలేదు. కాని దైవప్రవక్త(స) మాటిమాటికీ ఆమెను గుర్తు చేసుకుంటూ ఉంటే ఎవరిపైనా కలుగనంతటి అసూయ నాకు ఆమెపై కలిగేది". (సహీహ్ ముస్లిమ్, 6280, అధ్యాయం 12, పుస్తకం 44, సంపుటి 5).

హజ్రత్ ఖదీజా(రజి) చనిపోయిన కొన్నాళ్ళ తరువాత ఆమె చెల్లెలయిన 'హాల' దైవప్రవక్త(స)తో మాట్లాడటానికి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి రావడానికి బయటినుండి అనుమతి నడిగారు అది వినగానే, ఖదీజా(రజి) ఎలా అనుమతి నడిగేవారో ఆయనకు జ్ఞప్తికి వచ్చి సంతోషపడ్డారు. ఆయన అన్నారు :"వల్లాహ్!, హాలా బిన్త్ ఖువైలిద్". (అంటే ఆమె కంఠ ధ్వని, హజ్రత్ ఖదీజా(రజి) కంఠ ధ్వని దాదాపు ఒకే విధంగా ఉండేవని తెలుస్తుంది). ఆ పిలుపు వినగానే దైవప్రవక్త(స)కు ఖదీజా(రజి) జ్ఞప్తికి వచ్చారు. క్షణం సేపు ఆయన తొట్రుపాటుకు గురయ్యారు. ఆ సమయంలో **హజ్రత్ ఆయిషా(రజి)** అక్కడే ఉన్నారు. నేను (ఆయిషా) అసూయపడి చెప్పాను, "అల్లాహ్ మీకు ఆమె కన్నా మంచి భార్యనివ్వగా, మీరు ఎప్పుడో చనిపోయిన ఆ వృద్ధురాలినే గుర్తు చేసుకుంటారేమిటి?" (సహీహ్ ముస్లిమ్, 6282)

ఈ ప్రశ్నకు ఆయన(స) ఇలా సమాధానమిచ్చారు :

**"లేదు. ప్రజలు నన్ను త్రోసి పుచ్చిన రోజుల్లో ఆమె నా పక్షాన నిలిచింది. ప్రజలు తిరస్కార వైఖరి నవలంభిస్తుండగా ఆమె ఇస్లాంను స్వీకరించింది. నాకు సహాయపడే వారెవరూ లేని సమయంలో ఆమె నన్ను ఆదుకున్నది".**

తనకెంతో ప్రియమైన భార్యతో, మరణించిన తన మొదటి భార్య గురించి అంత గొప్పగా, ప్రేమగా ముహమ్మద్(స) వారు చెప్పారంటే, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో! అదే విధంగా ఆయన(స) ఖదీజా(రజి)వారికి ఎంత గౌరవం ఇచ్చారో కూడా స్పష్టం అవుతుంది.

ఖదీజా(రజి)వారిపై ప్రవక్త(స)వారికి ఉన్న ప్రేమానురాగాలు మరియు గౌరవాన్ని తెలియజేయడం కోసం పైన పేర్కొన్న కొన్ని ముఖ్య విషయాలు ముందుగా చెప్పడం జరిగింది.

విశ్వాసి ఎటువంటి భార్యను ఎన్నుకోవడం అతనికి మేలు అవుతుందో తెలుపుతూ, **ముహమ్మద్(స) ఇలా బోధించారు : స్త్రీని నాలుగు (విషయాల)పై వివాహం చేసుకుంటారు. ఆమె ఐశ్వర్యం, వంశావళి, అంద చందాలు మరియు ఆమె ధర్మం. మీరు ధార్మికురాలైన స్త్రీనే ఎన్నుకోండి** (లేకపోతే) **మీరు నష్టపోయిన వారవుతారు.** (అబూహురైరా(రజి) ఉల్లేఖనం. సహీహ్ బుఖారీ హదీస్ నెం. 5090, సంపుటి 7, 67వ పుస్తకం: వివాహం, 16వ అధ్యాయం)

ఆదమ్(అ) మరియు హవ్వా(అ) సృష్టి గురించి శాంతిబాట డిశంబర్ 2010 సంచికలో తెలియజేశాము. వాటిలోని ఓ చిన్న భాగం ఇక్కడ సందర్భానికి సరిపోతుందని అందిస్తున్నాము.

## భార్యలో భర్తకు ప్రశాంతత

ఆదమ్(అ)కి ప్రతీ దాని పేరూ తెలుసు. అప్పుడప్పుడు ఫరిష్తాలతో ఆయన మాట్లాడేవారు కాని వారు అల్లాహుతాలాను ఆరాధించడంలో నిమగ్నమై ఉండేవారు. కాబట్టి ఆదమ్(అ) ఒంటరితనం ఫీలయ్యేవారు. ఒకరోజు ఆయన పడుకుని ఉన్నారు. అతనికి మెళుకువ వచ్చినప్పుడు అతని తల దగ్గర తన ముఖం వంకే అందమైన కోమలమైన కళ్ళతో చూస్తున్న ఓ స్త్రీని చూసారు. నీవెవరని ఆమెను ఆదమ్(అ) అడిగారు. ఆమె తాను ఓ 'స్త్రీ'నని సమాధానం చెప్పారు.

ఆదమ్ : **నీవెందుకు సృష్టించబడ్డావు?**

హవ్వా : **'నాలో నీకు ప్రశాంతత దొరకడానికి'**

ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేశారు :

"ఆయనే, మిమ్మల్ని ఒకే వ్యక్తి నుండి సృష్టించాడు మరియు అతని నుండియే **జీవిత సౌఖ్యం పొందటానికి అతని భార్యను పుట్టించాడు...**" (ఖుర్ఆన్ 7:189)

ధర్మపరాయణతగల స్త్రీ వలన ప్రశాంతత లభిస్తుంది. జీవితంలో ప్రశాంతత లేనప్పుడు ఎంత ఐశ్వర్యముంటే ఏమి లాభం?

ముస్లిములలో తొలి స్వర్గ శుభవార్త అందుకున్న మహిళ మరెవరో కాదు, ఉత్తమ మహిళయైన **ఖదీజా**(రజి). ఈమె అల్లాహ్ మరియు జిబ్రీల్(అ) నుండి సలాములు అందుకున్న మహిళ.

క్రిందటి సంచికలో ఇచ్చిన హదీస్‌లోని కొంత భాగం :

**"స్వర్గంలో ఖసబ్ (మణుల)తో నిర్మించబడిన భవనాన్ని కలిగి ఉంటారనే శుభవార్తను అందజేయండి, అందులో అలజడులుగాని, కష్టాలు గాని ఉండవు".**

సాధారణ భార్యలు భర్తపై అరిచేటట్లు ఆమె ఎన్నడూ ముహమ్మద్(స) వారి విషయంలో ప్రవర్తించలేదు. చికాకు పెట్టిగాని, ఫిర్యాదులతో గాని ఆమె ప్రవక్త(స)వారిని ఎన్నడూ కష్టపెట్టలేదు. అందుకనేమో 'అలజడులు, కష్టాలు లేని' మణులతో కూడిన భవనం స్వర్గంలో ఆమెకు వాగ్దానం చేయబడింది.

ముహమ్మద్(స)వారు సత్య సందేశాన్ని అందించడంలో ఎన్నో కష్టాలు అనుభవించారు. సాధారణ స్త్రీ ఎవరైనా భార్య అయివుంటే, "గత 15 సంవత్సరాలు హాయిగా బ్రతికాము కదా, అనవసరంగా ఈ కష్టాలు మనకెందుకు చెప్పండి" అంటూ రోజూ గొడవపెట్టి, మానసిక ప్రశాంతతను దూరంచేసే పరిస్థితి ఎదురై ఉండేది.

ఈ సందర్భంగా నేటి పరిస్థితులు ఇక్కడ చెప్పవలసి ఉంది. విశ్వాసులు కూడా నేడు తల్లిదండ్రుల బలవంతం పైనో లేక మరే ఇతర కారణాల వల్లనో ధర్మపరాయణతకు కాకుండా ఇతర విషయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. భర్త ఇస్లామ్ ప్రకారం నిరాడంబరంగా బ్రతుకుతూ ఉంటే, అతని భార్య "మా బంధువులంతా మంచి నగలు, మంచి బట్టలు మరియు గొప్ప భవనాలు కలిగి ఉన్నారు. మిమ్మల్ని చేసుకోవడం వల్లనే నేను ఇలా ఉన్నాను" అంటూ సూటిపోటి మాటలతో భర్తకు ఇబ్బంది కలిగించడం జరుగుతుంది. ఒకవేళ భార్యకు ధర్మం గురించి తెలిసి, మంచివారే అయినప్పటికీ కూడా ఏదో సమయంలో ఏదో ఒక వంకతో ఇబ్బంది పెట్టడం సర్వసాధారణమై పోయింది.

**మన వంటి సాధారణ వ్యక్తులకే ఇలా ఉంటే, అసాధారణమైన బరువు బాధ్యతలను మోసిన ముహమ్మద్(స)వారి జీవిత భాగస్వామి, ఎలా ఉండాలి?**

పాఠకులకు సందేహం రావచ్చు. ఇంతవరకూ ముహమ్మద్(స)వారు పడిన కష్టాల గురించి సవివరంగా చెప్పకుండా ఇలా విశ్లేషించడం సమంజసమా అని. నిజమే! కాని ఇక్కడ పై విషయాల యొక్క ఆవశ్యకత చాలా ఉంది. అల్లాహ్ యొక్క సందేశహరునిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో ప్రవక్త(స)వారి కుటుంబ పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఆయనకు సహకరించే వారి లక్షణాల గురించి తెలియాలి. అల్లాహ్ ఎటువంటి అనుగ్రహాలతో తన సందేశహరుడిని సిద్ధం చేశారో అప్పుడే మనకు స్పష్టంగా అర్థమౌతుంది.

అందుకనే ఖదీజా(రజి)వారి గుణగణాల విశిష్ఠతను సాధ్యమైనంత స్పష్టంగా తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాము.

అలీ(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెబుతుండగా (క్రింది విధంగా) నేను విన్నాను. అలీ(రజి) (ఇలా) ఉల్లేఖించారు : ప్రవక్త(స) చెప్పారు, "ప్రపంచ మహిళల్లో ఉత్తమురాలు (ఆనాడు) మర్యమ్ మరియు ప్రపంచ మహిళల్లో (ఈనాడు) **ఉత్తమురాలు ఖదీజా**". **(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 3815, సంపుటి 5, పుస్తకం 63, అధ్యా. 20)**

నేటి మహిళలు అత్యంత ఉత్తమురాలైన ఖదీజా(రజి)వారిని ఆదర్శంగా తీసుకోవాలి. భర్త ద్వారా ఐశ్వర్యం పొందే కంటే, భర్త గౌరవాన్ని, ప్రేమను పొందడమే అన్నింటిని మించిన అదృష్టం అని తెలుసుకోవాలి.

ముహమ్మద్(స)వారు తొలి వహీ స్వీకరించారు. ప్రవక్త(స)వారికి అల్లాహ్ నుండి జిబ్రీల్(అ)వారి ద్వారా ఎల్లప్పుడూ ఈ విధంగానే ఎప్పుడు దైవ సందేశం అందేదా? లేక వేరే రూపంలో కూడా వహీ ఆయనకు అందుతుండేదా?

ముహమ్మద్(స)వారికి వహీ 6 రకాలుగా అందేదని హదీస్‌ల ద్వారా తెలుస్తుంది. ఇబ్నె-అల్ ఖయ్యిమ్ ఆరుగా లెక్కబెట్టారు. అవి :

1. యధార్థ స్వప్నం రూపంలోనే ప్రవక్త(స)వారి వద్దకు మొట్టమొదట వహీ రావడం మొదలైంది.
2. దైవదూత కనబడకుండానే, ప్రవక్త(స)గారి మనస్సులో విషయాన్ని నాటడం. ఉదాహరణకు దైవప్రవక్త(స)గారి ప్రవచనం ఇలా ఉంది:

   "ఏ ప్రాణి అయినా, తన వంతు ఆహారం పొందకుండా చనిపోదని, అల్లాహ్‌కు భయపడుతూ దాన్ని పొందడానికి సన్మార్గాన్నే అవలంబించాలని, ఆ రోజు వారి ఆహారం లభ్యం కావడంలో కొంత ఆలస్యమైతే దాన్ని అపమార్గాల ద్వారా పొందకూడదని, అల్లాహ్ వద్ద ఉన్నది ఆయన ఆదేశాలను శిరసావహించకుండా పొందలేమన్న విషయాన్ని **రూహుల్ ఖుదుస్ (జిబ్రయీల్ - అ.స.) నా మనస్సులో నాటుకునేటట్లు చేశారు.**"

3. ప్రవక్త(స) సమక్షంలో దైవదూత మానవ రూపంలోనే వచ్చి ఆయనతో సంభాషించేవారు. ఆయన(అ) చెప్పినదంతా ప్రవక్త(స)వారు గుర్తుంచుకునేవారు. దైవదూత మానవ రూపంలో వచ్చినప్పుడు సహాబా కూడా ఆయన్ను చూడడం అప్పుడప్పుడు సంభవించేది.
4. ఒక్కొక్కసారి ఆయన(స) వద్దకు వచ్చే వహీ గంట గణగణ మ్రోగినట్లుగా వినబడేది. ఇది అత్యంత కఠినమైనది. ఇలాంటి పరిస్థితిలో దైవదూత ఆయన్ను కలిసేవారు. ఇలా అవతరించిన వహీకి తీవ్రమైన చలికాలంలోను ముహమ్మద్(స)వారి నొసటి నుండి

చెమటలు కారిపోయేవి. ఓమారు ఇలానే వహీ అవతరించినప్పుడు దైవప్రవక్త(స)గారి తొడ, ప్రక్కనే కూర్చున్న హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి)గారి తొడపై ఉంది. ఆయన తొడపై పెద్ద భారం పడి అణిగి పోయినట్లుగా జైద్(రజి) బాధ అనుభవించారు. ఓసారి ప్రవక్త(స) ఒంటెపై నున్నప్పుడు వహీ వచ్చింది. ఆ బరువును ఒంటె భరించలేక కూర్చుండి పోయింది.

5. ముహమ్మద్(స), దైవదూత జిబ్రయీల్(అస)ను ఆయన అసలు రూపంలో కూడా చూడడం జరిగింది. ఆ రూపంలోనే ఆయన అల్లాహ్ ఆదేశాన్ని (వహీని) ప్రవక్త(స)పై అవతరింప జేసేవారు. ఈ సంఘటన ముహమ్మద్(స)వారికి రెండుసార్లు ఎదురైంది. ఈ విషయాన్ని అల్లాహ్ ఖుర్ఆన్‌లో నజ్మ్ సూరహ్‌లో ప్రస్తావించారు.

6. మేరాజ్ రాత్రి నమాజ్ విధి అయిన సందర్భంలో ఏ వహీనయితే అల్లాహ్, ముహమ్మద్(స)పై అవతరింపజేశారో, అప్పుడు ప్రవక్త(స) ఆకాశాల పైనే ఉన్నారు. దైవదూత లేకుండానే ముహమ్మద్(స) వారితో అల్లాహ్ నేరుగా మూసా(అ)తో సంభాషించినట్లుగా సంభాషించారు. (ఈ విషయం ముహమ్మద్(స) వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం పుస్తకంలో స్పష్టంగా వివరించాము. www.saanthibaata.net లో చూడండి)

తొలి దివ్య సందేశం అందుకున్న తరువాత, ఆ విషయం తెలుసుకున్న వరఖా చెప్పిన మాటలు : "**నీవు తీసుకొచ్చి నటువంటిదే ఎవరైనా తీసుకువచ్చాక వారితో శతృత్వం వహించారు, మరియు ఆ రోజు వరకూ నేను జీవించి ఉన్నట్లయితే నేను నీకు గట్టిగా మద్దతునిస్తాను**".

ఆ విధంగా వరఖా ఎందుకు చెప్పారో క్రింది ఖుర్ఆన్ ఆయత్‌లు చదివితే అర్థమౌతుంది.

**లూత్(అ) ప్రజలకు సంబంధించి, అల్లాహుతాలా ఇలా చెబుతున్నారు:**

వారు అన్నారు : "లూత్ కుటుంబాన్ని మీ పట్టణం నుండి వెళ్ళగొట్టండి. వాస్తవానికి, వారు తమను తాము చాలా పవిత్రులుగా పరిగణిస్తున్నారు." (ఖుర్ఆన్ 27:56)

**షుఐబ్(అ) ప్రజలకు సంబంధించి, అల్లాహుతాలా ఇలా చెబుతున్నారు:**

దురహంకారులైన అతని జాతి నాయకులు అన్నారు : "ఓ షుఐబ్! మేము నిన్నూ మరియు నీతోబాటు విశ్వసించిన వారినీ, మా నగరం నుండి తప్పక వెడలగొడ్తాము. లేదా మీరు తిరిగి మా ధర్మంలోకి రండి!" .... (ఖుర్ఆన్ 7:88)

**మరొక ఆయత్‌లో అల్లాహ్ ఇలా చెబుతున్నారు :**

**మరియు సత్య తిరస్కారులు తమ ప్రవక్తలతో అన్నారు** : "మీరు మా మతంలోకి తిరిగిరాకపోతే మేము తప్పకుండా మిమ్మల్ని మాదేశం నుండి వెళ్ళగొడ్తాము." .... (ఖుర్ఆన్ 14:13)

ప్రవక్తలపై వారి జాతి ప్రజలు శతృత్వం వహించడం అనేది అనాదిగా వస్తుంది.

ముహమ్మద్(స)వారు ప్రవక్త బాధ్యతలు స్వీకరించి తొలి దివ్య సందేశాన్ని అందుకున్నారు. తన జీవిత భాగస్వామికి చెప్పారు. ఆమె ఆయన(స) చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించి **తొలి నవముస్లిమ్ అయ్యారు.**

తొలి సందేశం గురించి, తొలి నవముస్లిమ్ గురించి మరియు ఆమె(రజి) శీలం గురించి చెప్పుకున్నాము.

ఖుర్ఆన్ అవతరణ దాదాపు 23 సంవత్సరాల కాలంలో పూర్తయింది. ఖుర్ఆన్ ఆయత్‌లు ఈ తొలి సందేశంతో ప్రారంభమై వివిధ సందర్భాలలో ఎలా అవతరించాయో వచ్చే సంచిక నుండి ఇన్షా అల్లాహ్ చెప్పుకుందాం.

**తొలి నవ ముస్లిమ్ - ఓ మహిళ**

- **ముహమ్మద్(స)వారికి జిబ్రీల్(అ)వారు వుజూ ఎలా చేయాలో నేర్పించారు. ముహమ్మద్(స)వారి నుండి వుజూ నేర్చుకున్న తొలి ముస్లిమ్ మరియు మహిళ - ఖదీజా(రజి).**
- **ముహమ్మద్(స)వారికి సలాత్ విధానం నేర్పి ఆయన ముందుండి జిబ్రీల్(అ) సలాత్ చదివించారు. ముహమ్మద్(స)వారి నుండి సలాత్ నేర్చుకుని ఆయన వెనక సలాత్ చేసిన తొలి ముస్లిమ్ భాగ్యశాలి - ఖదీజా(రజి).**
- **అదే విధంగా ముహమ్మద్(స)వారి నుండి తొలి దివ్య సందేశాన్ని విన్న మొట్టమొదట ముస్లిమ్ కూడా ఖదీజా(రజి) వారే!**

నేటి స్త్రీలకు ఖదీజా(రజి) ఓ రోల్ మోడల్. ఓ మంచి లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో మగవానికి ఉత్తమ భార్య తోడుగా ఉండటం అల్లాహ్ అనుగ్రహమే! (ముస్లిమ్ 1467)

**(మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...)**

**ముఖ్య గమనిక :**

శాంతిబాటలో ముహమ్మద్(స)వారి మరియు ఉమర్(రజి)వారి జీవిత చరిత్రలతో పాటు, ప్రవక్తల జీవిత చరిత్రలు మరియు ఇతర సహాబాల చరిత్రను అందిస్తున్నాము. కేవలం జీవిత చరిత్రలుగా సాధారణ రూపంలోనే అందించ వలసి వస్తే, వాటిని పత్రికలో చెప్పవలసిన అవసరం లేదు. వాటికొరకు విడిగా పుస్తకాలు లభ్యమౌతాయి. విశ్లేషించి చెప్పేవిగా పత్రికలు ఉండాలి. సందర్భాన్ని బట్టి అక్కడ మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయాన్ని విశ్లేషణ ద్వారా ప్రజలకు అందించి వారిని ఆలోచింప జేయాలి. ఈ విశ్లేషణలలో నేటి సమాజంలోని పరిస్థితులు కూడా భాగం అవుతాయి. అంతే కాకుండా ముస్లిమ్ సమాజంలో వ్యాప్తిలో ఉన్న అపోహలు మరియు వారికి తెలియకుండా జరిగే కొన్ని అధర్మ కార్యాలను కూడా ఎత్తి చూపవలసి వస్తుంది. శాంతిబాటలో ప్రతీ విషయాన్ని కథారూపం కంటే, సమగ్ర సమాచారాన్ని తెలిపే విధంగా అందించడానికే కృషి చేస్తున్నాము. ఇన్షా అల్లాహ్, ఈ విధానం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తున్నాము.

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

5

రజి అల్లాహుతాలా అన్హు

- అతి నిరాడంబరుడు
- ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు
- అవినీతి అధికారులకు సింహస్వప్నం

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(గత సంచిక తరువాయి ...)

**ఉమర్(రజి)వారి నిశితదృష్టి, జ్ఞానం అప్పటికింకా అవతరించబడని ఖుర్'ఆన్ ఆయత్‌లతో పొందికగా ఉండేది.**

ముహమ్మద్(స)వారి అనుచరులలో ఆయన(స)ముందు తన అభిప్రాయాలను నిష్కపటంగా ధైర్యంగా వ్యక్తపరిచే అనుచరుడెవరంటే, వారు ఉమర్(రజి).

ఏదైనా విషయంపై దాని శాసనంలో ఉండే వివేకంపై ఆయనకు అవగాహన కలగకపోతే తరచుగా అడుగుతుండేవారు. కొన్ని సార్లు అయితే, చాలా సాహసంతో నిష్కపటంగా, తన చట్టబద్ధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు, అప్పటికింకా ఆ విషయానికి సంబంధించి తుది ఆదేశం కూడా ముహమ్మద్(స)వారికి అందలేదు.

ఒకవేళ ఎవరైనా ఈ విధంగా చెప్పి ఉంటే, అతను ప్రవక్త(స)వారి ముందు మొరటుగా ప్రవర్తించాడని అని ఉండేవారేమో! కాని ఉమర్(రజి) వారి ప్రత్యేకత ఏమిటంటే ఇస్లామీయ శాసనం మరియు నియమాలను చాలా లోతుగా అర్థం చేసుకున్న వ్యక్తి ఆయన. అలా వ్యక్తం చేసిన కొంత వ్యవధిలోనే అల్లాహ్ ఆదేశం అవతరించబడేది అది ఉమర్(రజి) వారు చెప్పిన దానితో పొందికగా ఉండేది.

పాఠకులు ఈ విషయంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఎందుకంటే ప్రవక్త(స)వారు ఉమర్(రజి)వారి గురించి చెప్పిన విషయాన్ని (బుఖారీ 3689) ఇది వరకే తెలిపి ఉన్నాము:

**''మీ ముందర వచ్చిన జాతులలో బోధించే వారు (ముహద్దసీన్) ఉండేవారు (ముహద్దసీన్ అంటే వారు దివ్య సందేశాన్ని ప్రవక్తల వలే అందుకోరు. కాని స్ఫూర్తి పొందుతారు. వారి నాలుకలపై సత్యం జాలువారుతూ ఉంటుంది.) నా జాతి నుండి అటువంటి వ్యక్తి ఎవరైనా ఉంటే ఆయనే ఉమర్(రజి)"**

ఉమర్(రజి) వారు చెప్పారు : నేను మూడు విషయాలలో అల్లాహ్ (అవతరింపజేసిన దాని)తో పొందికగా ఉన్నాను. నేను ఒకసారి అన్నాను, ''ఓ రసూలుల్లాహ్, మకామె ఇబ్రాహీమ్‌ను ఆరాధన స్థలంగా తీసుకుంటారా'' (అల్లాహ్ తరువాత ఆ విషయంలో సందేశాన్ని అవతరింప జేశారు) మరియు నేను ఒకసారి అన్నాను, ''ఓ రసూలుల్లాహ్! పుణ్యాత్ములు మరియు పాపాత్ములు (మీ ఇంటిలోకి) ప్రవేశిస్తున్నారు. కాబట్టి మీరు విశ్వాసుల మాతృమూర్తులను పరదా పాటించమని ఆదేశించండి. అల్లాహ్ తరువాత పరదాకు సంబంధించిన ఆయత్‌ను అవతరింప జేశారు. మరియు ప్రవక్త(స)వారు తన భార్యలలో కొందరిని మందలించినట్లు నాకు తెలిసింది. కాబట్టి వారి దగ్గరకు నేను వెళ్ళి చెప్పాను. మీరు ఆయనను కష్టపెట్టడమైనా ఆపండి లేదా అల్లాహ్ ఆయన సందేశహరునికి మీకంటే ఉత్తమమైన భార్యలను ఇస్తారు''. నేను ఆయన(స) భార్యలలో ఒకరి దగ్గరకు వచ్చాను. ఆమె నాతో చెప్పారు, 'ఓ ఉమర్! అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఏ సలహా అయితే తన భార్యలకు ఇవ్వలేదో, దానిని మీరు వారికి సలహా ఇస్తారా? అప్పుడు అల్లాహ్ అవతరింప జేశారు. ''ఒకవేళ అతను (ముహమ్మద్) మీ అందరికీ విడాకులిస్తే! అల్లాహ్, మీకు బదులుగా, మీకంటే మంచి భార్యలను , అతనికి (ప్రవక్తకు) ప్రసాదించగలడు! వారు మంచి ముస్లిమ్‌లు, విశ్వాసులు, భక్తిపరులు, పశ్చాత్తాపపడే వారు, (అల్లాహ్‌ను) ఆరాధించే వారు,

వలసపోయే (ఉపవాసాలు చేసే) వారు అయిన విధవలు లేదా కన్యలు అయి ఉంటారు!'' (66:5) (సహీహ్ బుఖారీ, 4483)

**మునాఫిక్ (కపట విశ్వాసి)కి జనాజా సలాత్ చదివించే విషయంలో**

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సలూల్ మరణించినప్పుడు, అతని కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్(రజి) అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దగ్గరికి వచ్చి ఆయనను అడిగారు ఆయన(స) యొక్క చొక్కాను ఇవ్వమని. తన తండ్రి శవం ఆ వస్త్రంతో కప్పవచ్చని మరియు ఆయన(స) అతనికి ఇచ్చారు. తరువాత అతడు ఆయన(స) అడిగారు. అతని కొరకు జనాజా సలాత్ చేయించమని మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అతని కొరకు సలాత్ చేయించడానికి నిలుచున్నారు. ఉమర్(రజి) నిలుచుని రసూలుల్లాహ్(స) చొక్కా పట్టుకుని అడిగారు : ''ఓ రసూలుల్లాహ్! మీరు జనాజా సలాత్ చేయిస్తారా, అల్లాహ్ అతని కొరకు ప్రార్థించడాన్ని నిరోధించినప్పుడు?''

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : 'అల్లాహ్ ఎన్నుకునే అవకాశం నాకు ఇచ్చారు'

ఆయన(స) అన్నారు :

**"(ఓ ప్రవక్తా!) నీవు వారి (కపట విశ్వాసుల) క్షమాపణ కొరకు వేడుకున్నా, లేదా వారి క్షమాపణ కొరకు వేడుకోక పోయినా ఒక్కటే - ఇంకా నీవు డెబ్భై సార్లు వారి క్షమాపణ కొరకు వేడుకున్నా - అల్లాహ్ వారిని క్షమించడు. ఎందుకంటే వాస్తవానికి వారు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు అల్లాహ్ అవిధేయులైన ప్రజలకు సన్మార్గం చూపడు."** (ఖుర్ఆన్ 9:80)

మరియు నేను 70 సార్ల కంటే ఎక్కువ సార్లు వారి క్షమాపణ కోసం అడుగుతాను.

ఆయన(రజి) చెప్పారు : 'నిస్సందేహంగా అతడు మునాఫిక్'.

రసూలుల్లాహ్(స)వారు అతని కొరకు జనాజా సలాత్ (నమాజ్) చేయించారు. (తరువాత అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశారు.)

**"మరియు వారి (కపట విశ్వాసుల)లో ఎవరైనా మరణిస్తే, అతడి సలాతె జనాజా కూడా నీవు ఏ మాత్రం చేయకు మరియు అతని గోరీ వద్ద కూడా నిలబడకు. నిశ్చయంగా, వారు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు వారు అవిధేయులు (ఫాసిఖూన్)గా ఉన్న స్థితిలోనే మరణించారు."** (ఖుర్ఆన్ 9:84)

(సహీహ్ ముస్లిమ్, 6207, పుస్తకం 44, అధ్యా. 2, సంపుటి 6)

బద్ర్ యుద్ధంలో చిక్కిన యుద్ధ ఖైదీలను చుట్టుముట్టారు. ప్రవక్త(స)వారు తన ముఖ్య సలహాదారులైన అబూబకర్(రజి) మరియు ఉమర్(రజి)వారి వైపు తిరిగి ''వీరితో మనం ఏమి చేయాలని అనుకుంటున్నారు?'' అబూ బకర్(రజి)వారు మొదట మాట్లాడారు. ''ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా(స)! వారు మన కజిన్స్ బంధువులు మరియు మన తోటి తెగవారు. కాబట్టి వారి నుండి మీరు పరిహార ధనం తీసుకోవాలని నేను అనుకుంటున్నాను. (అంటే వారిని చంపడం కంటే వారు తమ స్వేచ్ఛను కొనుక్కునేలా) (ఆ ధనం) అవిశ్వాసులపై మనకు ప్రాబల్యాన్ని ఇస్తుంది. మరియు బహుశా అల్లాహ్ వారిని ఇస్లామ్ వైపు మార్గదర్శకత్వం చేయవచ్చు''

''మరి నీవేమి అనుకుంటున్నావు, ఓ అల్-ఖత్తాబ్ కుమారా?'' రసూలుల్లాహ్(స) ఉమర్(రజి)ని అడిగారు. ఉమర్(రజి) సమాధానం చెప్పారు, ''అల్లాహ్ సాక్షి! లేదు, ఓ రసూలుల్లాహ్! ఈ విషయంలో నేను అబూబకర్(రజి)వారితో ఏకీభవించడం లేదు. మీరు వారిపై మాకు అధికారం ఇవ్వాలి, వారి మెడలపై కొట్టగలిగేందుకు (వారిని చంపడానికి). కాబట్టి అలీ(రజి)కి అఖీల్‌పై అధికారం ఇవ్వండి. అలీ(రజి) అతడి మెడను కొట్టేందుకు. మరియు నాకు ఫలానా వారిపై అధికారం ఇవ్వండి (ఇక్కడ ఉమర్(రజి) తన బంధువులలోని ఒకరి పేరు ప్రస్తావించారు)''. లేక మరో విధంగా చెప్పాలంటే, ఉమర్(రజి) కోరింది ఏమిటంటే ప్రతీ అవిశ్వాసి, అతడి ముస్లిమ్ బంధువుచే చంపబడాలి.

(ఈ మాటలను బట్టి పాఠకులు ఉమర్(రజి)వారు కఠినులు అని భావించకండి. బద్ర్‌కు ముందరి పరిస్థితులు, ఆ తరువాత జరిగిన యుద్ధాల గురించి చదివితే, ఎవరికీ ఆయనపై అపోహలు కలుగవు)

''వాస్తవానికి ఈ (ఖైదీలు) అవిశ్వాసుల నాయకులు మరియు ముఖ్య నాయకులు''.

ఆ తరువాత ఉమర్(రజి)వారు చెప్పారు, ''రసూలుల్లాహ్(స) వారికి నేను చెప్పింది ఇష్టం కాలేదు కాని ఏదైతే అబూ బకర్(రజి) చెప్పారో (అది ఇష్టపడ్డారు).

తరువాయి రోజు నేను తిరిగి వచ్చినప్పుడు నేను రసూలుల్లాహ్(స) మరియు అబూబకర్(రజి) క్రింద కూర్చుని దు:ఖించడాన్ని నేను చూశాను.

నేను అన్నాను, ''ఓ రసూలుల్లాహ్! మీరు మరియు మీ సహచరుడు ఎందుకు దు:ఖిస్తున్నారు? దు:ఖించడం నాకు సాధ్యమైతే, నేను కూడా దు:ఖిస్తాను, కాకపోతే మీ (ఇద్దరి) దు:ఖంలో మీతో ఏకీ భవించడానికైనా నేను ఏడుపు నటిస్తాను''.

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''నేను దు:ఖించేది ఎందుకంటే నీ సహచరులు నాకు సూచించారు (యుద్ధ ఖైదీల నుండి) పరిహార ధనాన్ని తీసుకునే విషయాన్ని. వారి శిక్ష (ఆ విధంగా చేయడం వలన) నాకు చూపబడింది మరియు ఈ చెట్టుకంటే దగ్గరగా ఉంది.'' ఓ చెట్టు ప్రవక్త(స)వారికి చాలా దగ్గరగా ఉంది.

అల్లాహ్ క్రింది ఆయత్‌ను అవతరింపజేశారు :

**(శత్రువులతో తీవ్రంగా పోరాడి, వారిని) పూర్తిగా అణచనంత వరకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవటం ధరణిలో, ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక సామాగ్రి కోరుతున్నారు. కాని అల్లాహ్ (మీ కొరకు) పరలోక (సుఖాన్ని) కోరుతున్నాడు. మరియు అల్లాహ్ సర్వశక్తివంతుడు, మహా వివేచనాపరుడు.**

**ఒకవేళ అల్లాహ్ (ఫర్మానా) ముందే వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్న దాని (నిర్ణయాని)కి మీకు ఘోరశిక్ష విధించబడి ఉండేది."** (ఖుర్'ఆన్ 8:67,68)

ఆ తరువాయి సంవత్సరం ఉహద్ యుద్ధంలో 70మంది ముస్లిములు చనిపోయారు. చాలామంది సహచరులు(రజి) యుద్ధ రంగం నుండి వెళ్ళిపోయారు. ప్రవక్త(స)వారికి గాయాలయ్యాయి. ఆయన(స) ముందరి పన్ను విరిగింది. ఆయన శిరస్త్రాణం పాడయింది. మరియు ఆయన ముఖంపై రక్తం కారింది.

ఇదంతా జరిగాక అల్లాహ్ క్రింది ఆయత్‌ను అవతరింపజేశారు :

**ఏమయింది? మీకొక చిన్న ఆపదే కదా కలిగింది! వాస్తవానికి మీరు, వారికి (మీ శత్రువులకు బద్ర్‌లో) ఇంతకు రెట్టింపు ఆపద కలిగించారు కదా! అయితే ఇప్పుడు : "ఇది ఎక్కడి నుంచి వచ్చిందీ?" అని అంటున్నారా? వారితో ఇలా అను: "ఇది మీరు స్వయంగా తెచ్చుకున్నదే!" నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.**

**మరియు (ఉహద్ యుద్ధరంగంలో) రెండు సైన్యాలు ఎదుర్కొన్నప్పుడు, మీకు కలిగిన కష్టం, అల్లాహ్ అనుమతితోనే కలిగింది మరియు అది నిజమైన విశ్వాసులెవరో తెలుసుకోవడానికి.** (ఖుర్'ఆన్ 3:165,166)

ఓ ఉల్లేఖనంలో అల్లాహ్ చెప్పినదానిని ప్రస్తావించారు, ''ఇది స్వయంగా తెచ్చుకున్నదే'' అంటే అర్థం : ఇది ఎందుకంటే మీరు క్రిందటి సంవత్సరం బద్ర్‌లో పట్టుకున్న యుద్ధ ఖైదీల నుండి పరిహార ధనం తీసుకున్నందుకు.

## ప్రజలను వారి ఇండ్లలో ప్రవేశించడానికి అనుమతి నడిగే విషయం

ఒకరోజు మధ్యాహ్న సమయం - కాస్సేపు అరబ్బులు కునుకు తీసే సమయంలో - ప్రవక్త(స)వారు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దగ్గరకు ఓ అన్సార్ కుర్రవాడిని పంపారు. ఆ కుర్రవాడు ప్రవక్త(స) వారు పిలుచుకు రమ్మన్నారనే సందేశాన్ని అందజేశాడు.

ఆ కుర్రవాడు ఉమర్(రజి)వారి ఇంటిలోకి అనుమతి నడుగకుండా ప్రవేశించాడు, అది ఉమర్(రజి)వారిని రెండు కారణాలుగా చికాకు పెట్టింది.

మొదటిది, ఆయన పడుకుని ఉన్నారు మరియు రెండవది ఆయన శరీరం వస్త్రంతో సరిగ్గా కప్పబడి ఉండలేదు.

అకస్మాత్తుగా నిద్ర నుండి లేపి ఇబ్బంది పెట్టినందుకు, ఉమర్(రజి) అన్నారు, ''ఓ అల్లాహ్! మేము పడుకున్న సమయంలో మా ఇంటిలో ప్రవేశించడానికి ప్రజలకు ధర్మ సమ్మతం కాకుండా చేయండి''. ఒక ఉల్లేఖనం ప్రకారం, ఉమర్(రజి) ప్రవక్త(స)వారితో చెప్పారు, ''ఓ రసూలుల్లాహ్(స), అల్లాహ్ మమ్మల్ని ఆదేశించినా మరియు నిషేధించినా ప్రవేశానికి అనుమతి నడిగే విషయంలో నేనిష్టపడతాను.''

క్రింది ఖుర్'ఆన్ ఆయత్ అవతరించింది :

**"ఓ విశ్వాసులారా! మీ బానిసలు మరియు యుక్త వయస్సుకు చేరని మీ పిల్లలు, మూడు సమయాలలో అనుమతి తీసుకునే మీ వద్దకు రావాలి. (అవి) ఉదయపు (ఫజ్ర్) సలాత్‌కు ముందు, మధ్యాహ్నం (జుహ్ర్) తరువాత - మీరు మీ వస్త్రాలు విడిచి ఉన్నప్పుడు - మరియు రాత్రి (ఇషా) సలాత్ తరువాత. ఈ మూడు, మీ కొరకు ఏకాంత (పరదా) సమయాలు. వీటి తరువాత వారు మరియు మీరు ఒకరి వద్దకు మరొకరు వచ్చి పోతూ ఉంటే, వారిపై గానీ, మీపై గానీ ఎలాంటి దోషం లేదు. ఈ విధంగా అల్లాహ్ మీకు తన ఆజ్ఞలను విశదీకరిస్తున్నాడు. అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేక వంతుడు."** (ఖుర్ఆన్ 24:58)

మద్యపానాన్ని నిషేధించమని ఉమర్(రజి) **అల్లాహ్‌ను వేడుకున్నారు :**

**(ఓ ప్రవక్తా!) వారు, మద్యపానాన్ని మరియు జూదాన్ని గురించి నిన్ను ప్రశ్నిస్తున్నారు. నీవు ఈ విధంగా సమాధానం ఇవ్వు : "ఈ రెండింటిలోనూ ఎంతో హాని (పాపం) ఉంది. వాటిలో ప్రజలకు కొన్ని లాభాలు కూడా ఉన్నాయి. కాని వాటి హాని (పాపం) వాటి లాభాల కంటే ఎంతో అధికమైనది". మరియు వారిలా అడుగుతున్నారు : "మేము (అల్లాహ్ మార్గంలో) ఏమి ఖర్చు పెట్టాలి?" నీవు ఇలా సమాధానం ఇవ్వు : "మీ (నిత్యావసరాలకు పోగా) మిగిలేది" మీరు ఆలోచించడానికి, అల్లాహ్ ఈ విధంగా తన సూచన (ఆయత్)లను మీకు విశదీకరిస్తున్నాడు.** (ఖుర్ఆన్ 2:219)

ఈ ఆయత్ అవతరించాక కూడా ఉమర్(రజి) స్పష్టమైన మరియు చివరి ఆదేశం మద్యపానం విషయంలో ఇంకనూ అవతరించబడ వలసి ఉందని భావించారు. ఆయన అనుకున్నది నిజమే. అల్లాహ్ తన దాసులకు విషయాలను సులువు చేయడం కోసం, ఈ మద్యపాన నిషేదాన్ని ఒకే దెబ్బలో కాకుండా అంచెలంచెలుగా ఆదేశించారు.

అల్లాహ్ క్రింది ఆయత్‌ను అవతరింపజేశారు.

**"ఓ విశ్వాసులారా! మీరు మత్తులో ఉంటే, మీరు పలికేది గ్రహించనంత వరకు ...."** (ఖుర్ఆన్ 4:43)

అప్పటి నుండి, అందరూ కలిసి సలాత్ (జమాత్) ప్రారంభించ డానికి ముందు, ప్రవక్త(స)వారి తరపున పిలిచే వ్యక్తి, మత్తు స్థితిలో ఉన్న ఏ వ్యక్తి కూడా అందరూ కలిసి చేసే సలాత్‌కి రావద్దని పిలుపునిచ్చేవాడు.

ఉమర్(రజి)వారిని పిలిచి పైన చెప్పిన ఆయత్‌ను తెలిపి నప్పుడు, ఆయన(రజి) అన్నారు:

**"ఓ అల్లాహ్! మద్యపానం విషయంలో స్పష్టమైన మరియు తృప్తికరమైన వివరణను మాకు తెలియజేయండి"**

ఆఖరి మరియు సంపూర్ణ మద్యపాన నిషేధానికి సంబంధించి ఆయత్ అవతరించ బడింది.

**నిశ్చయంగా, షైతాన్ మద్యపానం మరియు జూదం ద్వారా మీ మధ్య విరోధాలు మరియు విద్వేషాలు రేకెత్తించాలని మరియు మిమ్మల్ని అల్లాహ్ ధ్యానం నుండి మరియు సలాత్ నుండి తొలగించాలని కోరుతున్నాడు. అయితే మీరిప్పుడైనా మానుకోరా?"** (ఖుర్ఆన్ 5:91)

ఈ విషయం విని ఉమర్(రజి) అన్నారు, **"మేము మాను కుంటాము, మేము మానుకుంటాము".**

అల్లాహ్ చేసిన మందలింపు ప్రశ్న రూపంలో ఉండటం వలన అది చాలా శక్తివంతమైనదని మరియు అది 'త్రాగవద్దు' అని చెప్పే మామూలు నిషేధం కాదని, చాలా స్పష్టమైన నిషేధమని అర్థం చేసుకున్నారు.

అంత స్పష్టమైన మరియు సంపూర్ణంగా ఉండబట్టే, ఉమర్(రజి)వారు ''మేము మానుకుంటాము, మేము మానుకుంటాము'' అన్నారు.

స్థలాభావం వలన **ఖుర్‌ఆన్ తఫ్సీర్,**
**ముహమ్మద్(స)వారి బోధనలు,**
**హదీస్ విజ్ఞానం, బాలబాలికలకు ప్రత్యేకం,**
**పాఠకుల అభిప్రాయాలు మొదలైన శీర్షికలను**
**అందించలేక పోయాము.**
**ఇన్షా అల్లాహ్! వచ్చే సంచిక నుండి**
**అన్ని శీర్షికలను అందించడానికి ప్రయత్నిస్తాము.**
**- శాంతిబాట టీమ్**

## తండ్రి అధికారంలో ఉన్నప్పుడు పరోక్షంగా కూడా కుమారుడు లాభపడటాన్ని సమ్మతించని ప్రజా నాయకుడు

ఉమర్(రజి)వారు ఖలీఫాగా ముస్లిమ్ సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నప్పుడు, ఆయన కుమారుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)వారు 'జలూలా' యుద్ధంలో పాల్గొన్నారు. ఆ యుద్ధం పర్షియాలో జరిగింది. విజయం ముస్లిములదే! యుద్ధానంతరం యుద్ధ ప్రాప్తిని ఒక చోట సమీకరించారు. అందులో ఆయుధాలు, ఆహార వస్తువులు, పశువులు, దుస్తులు, బంగారం మరియు ఎన్నో విలువైనవి ఉన్నాయి.

అబ్దుల్లాహ్(రజి)వారు తన స్వంత డబ్బుతో ఎటువంటి అధికారాన్ని ఉపయోగించకుండా, ఏ విధమైన ప్రభావం చూపకుండా, యుద్ధ ప్రాప్తిలోని చాలా వస్తువులను 40వేల దిర్హములకు కొనడం జరిగింది. ఆయన ఇంటికి తిరిగి వచ్చాక తండ్రి యైన ఉమర్(రజి)వారిని కలిసారు.

అప్పుడు ఉమర్(రజి)వారు ఆయనతో అన్నారు, "నీవు నరకాగ్ని ముందు ఉంచబడ్డావనుకో, మరియు నీకిలా చెప్పబడిందనుకో, 'నిన్ను నీవు నరకాగ్ని నుండి రక్షించుకోవడానికి పరిహారంగా ఐశ్వర్యాన్ని చెల్లించు' ". అబ్దుల్లాహ్ సమాధాన మిచ్చారు, "అల్లాహ్ సాక్షి! ఒకరు ఏ (చిన్న) విషయాల వలనైనా గాయపడవలసి వస్తే, అతడు స్వయంగా రక్షించుకోవడానికి పరిహారంగా ధనాన్ని చెల్లించడానికి ఇష్టపడతాడు".

ఉమర్(రజి) అప్పుడు విషయానికొచ్చారు, ''ఈ విధంగా జరుగబోతున్నట్లు నేను చూడగలుగుతున్నాను, యుద్ధ ప్రాప్తి నుండి ప్రజలు నీకు అమ్మడాన్ని". వారు చెప్పి ఉండేవారు (ఉంటారు?), అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) రసూలుల్లాహ్(స)వారి సహచరుడు, అతడు విశ్వాసుల నాయకుని (ఉమర్(రజి)) కుమారుడు మరియు ఆయనకి (తండ్రికి) బాగా ప్రియమైనవాడు. అందు వల్లనే వారు నీకు కావాలనే తక్కువ ధరకి కొనేలా చేశారు, ఎక్కువ ఖరీదుకు వస్తువులను కొనడం కంటే.

నేను నీకు లాభంగా ఓ ఖురైష్ వ్యాపారవేత్త ఇచ్చేదానికంటే ఎక్కువ ఇస్తాను. (నీవు పెట్టుబడి పెట్టిన) ప్రతీ దిర్హమ్‌కు ఓ దిర్హమ్‌ను లాభంగా ఇస్తాను. తరువాత ఉమర్(రజి)వారు నగరంలోని వ్యాపారులను పిలిచారు, అబ్దుల్లాహ్(రజి) జలూలా నుండి తనతో తీసుకువచ్చిన వాటిలో వారికి కావలిసినది కొనడానికి.

అబ్దుల్లాహ్ వారి సామాగ్రి వెంటనే 4 లక్షల దిర్హములకు అమ్ముడై పోయింది. వాగ్దానం చేసిన విధంగా ఉమర్(రజి)వారు తన కుమారుడైన అబ్దుల్లాహ్(రజి)వారికి 80వేల దిర్హములను ఆ అమ్మగా వచ్చిన సొమ్ము నుండి ఇచ్చారు. ఆ ఎనభై వేల దిర్హములలో అబ్దుల్లాహ్(రజి)వారి పెట్టుబడి 40 వేలు మరియు 40వేల దిర్హములు ఆయనకు ఉమర్(రజి) ఇచ్చిన లాభం. తరువాత 3 లక్షల 20వేల దిర్హముల మిగిలిన సొమ్మును ఆయన సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి)వారికి పంపి, ప్రజలకు దానిని పంచమని ఆదేశించారు.

ఈ నాయకత్వ లక్షణాలు చూసి మహాత్మగాంధీ గారు మాత్రమే కాకుండా, ఎందరో నాయకులు ఉమర్(రజి)వారిని ప్రశంసించి, ఆయన నుండి ప్రజాస్వామ్యంలో స్ఫూర్తిని పొందారు. ఇస్లామ్‌లో ఉన్నటువంటి గొప్ప ప్రజాస్వామ్యం ఎక్కడా లేదు.

## ఎడమ చేతితో భోజనం చేసిన సైనికునితో

కొందరు ముస్లిమ్ సైనికులు అష్-షామ్ (సిరియా మరియు పరిసర ప్రాంతాల) నుండి యమన్‌కు వెళుతూ మార్గమధ్యంలో మదీనాలో కాస్సేపు విడిది చేయాలనుకున్నారు.

ఆ కాలంలో ఉమర్(రజి)వారు ఖలీఫాగా ముస్లిమ్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్నారు. ఈ సైనికులతో పాటు మిగిలిన వారికి ఉమర్(రజి)వారు జుహ్ర్ సలాత్ (నమాజ్) చేయించారు. ఆ తరువాత చాలా పళ్ళాలలో ఆహారాన్ని క్రింద నేలపై పెట్టారు.

ఆ సైనికులలోని ఒకరు క్రింద కూర్చుని తన ఎడమ చేత్తో తినడం ప్రారంభించారు. సైనికుడు ఆ విధంగా తినడం చూసి, ఉమర్(రజి) చెప్పారు, "తిను నీ కుడిచేతితో". కాని ఆ సైనికుడు ఉమర్(రజి)వారి ఆదేశాన్ని లక్ష్య పెట్టలేదు. అప్పుడు రెండవసారి ఉమర్(రజి)వారు అన్నారు 'తిను నీ కుడిచేతితో'.

'ఓ అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకా!) నా కుడిచేయి ఖాళీగా లేదు' అని జవాబు ఇచ్చాడు ఆ సైనికుడు.

భోజనం పూర్తి అయ్యాక, ఉమర్(రజి)వారు మౌనంగా సైగచేసి తన దగ్గరకు రమ్మని ఆహ్వానించారు. అప్పుడు ఉమర్(రజి) అడిగారు, 'నీ కుడిచేతిని ఖాళీ లేకుండా ఉంచినది ఏమిటి?'

అప్పుడు ఆ వ్యక్తి తన కుడిచేతిని బయటకు తీశాడు. అది చూడగానే ఉమర్(రజి)వారు వెనక్కి జరిగారు. ఆ చేతి పైభాగం తెగిపోయి ఉంది. అది ఎలా జరిగిందని ఉమర్(రజి)వారు అడిగారు.

నా చేయి యర్మూక్ రోజున కోసివేయబడింది (ముష్రిక్ సైన్యంతో జరిగిన యుద్ధంలో).

'మరి వుజూ చేయడానికి మీకెవరు సహాయం చేస్తున్నారు?'' ఉమర్(రజి) అడిగారు.

"నేను నా ఎడమచేతిని ఉపయోగిస్తాను. మరియు నాకు సహాయం చేసేది ఆయనే, 'అల్లాహ్' " సమాధానం చెప్పాడా వ్యక్తి.

"మీరెక్కడకు వెళుతున్నారు?" ఉమర్(రజి) అడిగారు.

"యమన్‌కు, నేను నా తల్లి దగ్గరకు వెళుతున్నాను. నేను ఫలానా (కొన్ని) సంవత్సరాల నుండి ఆమెను చూడలేదు".

(అల్లాహ్ మార్గంలో ఇంతగా గాయపడిన తరువాత కూడా) నీవు (నీ మాతృమూర్తికి) కూడా విధేయుడుగా ఉన్నావా?"

ఉమర్(రజి)వారు వెంటనే ఆదేశించారు, ఆ వ్యక్తికి ఓ నౌకరును మరియు దానంగా వచ్చిన 5 ఒంటెలను ఇవ్వమని మరియు ఆ వ్యక్తి వెళ్ళకముందే, ఉమర్(రజి)వారు స్వయంగా ఆ ఒంటెలపై సరుకులను ఉంచారు.

అల్లాహ్ మార్గంలో ధర్మయుద్ధం చేసే ముజాహిద్‌లను అవహేళన చేసే విధంగా, జకాత్ తీసుకెళ్ళి తాలిబన్లకు ఇవ్వాలా అని మాట్లాడిన కొంతమంది ముస్లిము సోదరులకు కనువిప్పు కలగడం కోసం ఈ సంఘటనను ఇక్కడ అందించవలసి వచ్చింది.

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

*నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 6*

*ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ నవముస్లిమ్ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. ఇంత వరకూ బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి) ఏ విధంగా ఇస్లామ్ స్వీకరించారు, వారెటువంటి సమస్యలను ఎదుర్కొన్నారు, ఆ సమస్యలను ఏ విధంగా అధిగమించారో తెలియజేశాము. ఈ నెల సాద్ (రజి) వారి గురించి క్లుప్తంగా మీకు అందిస్తున్నాము.

# సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)

**తాను ఎంతగానో ప్రేమించే తల్లి, ఇస్లామ్‌ని వదిలేయాలని లేకుంటే ఏదీ తినను మరియు త్రాగను అని మొండిగా నిరాహారదీక్ష చేస్తే, కన్నీళ్ళతో ఆమెకు ఇలా సమాధానమిచ్చారు :**

**"అమ్మా! నా మాట విను. నీకు వంద ఆత్మలు ఉండి నా ధర్మాన్ని వదిలేయడం కొరకు నీవు వాటిని ఒకటొకటిగా వదిలేసినా నేను ఆ పని చేయను. నేను ఈ లోకంలో మరియు పరలోకంలో సంతోషాన్ని కలిగించే మార్గాన్ని కనుగొన్నాను.**

## సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)

సాద్(రజి)వారు మక్కాలోని గౌరవనీయమైన ఖురైష్ తెగకు చెందినవారు. ప్రవక్త(స)వారి మాతృమూర్తిగారి వైపు పూర్వీకులతో సాద్(రజి)వారి కుటుంబానికి రక్త సంబంధం ఉంది. అందుకనే ప్రవక్త(స)వారు సాద్(రజి)వారిని 'అమ్మి'(అంకుల్) అని తరచుగా పిలిచేవారు.

సాద్(రజి)వారిని ఆయన కుటుంబం చాలా ప్రేమగా చూసుకునేది.

మక్కాలోని తోటి యువకులతో పోలిస్తే, ఆయన అన్ని విషయాల లోనూ భిన్నమైన వ్యక్తి. ఆయనకు తన తోటివారు పూజించే విగ్రహాలపై నమ్మకం ఉండేది కాదు. ఒంటరిగా ఆలోచిస్తూ ఉండేవారు. ప్రకృతిని గమనించేవారు. విగ్రహారాధన వదిలేయమని, ఒక్కరైన అల్లాహ్‌నే ఆరాధించాలని ప్రజలకు ముహమ్మద్(స)వారు బోధిస్తున్నారని తెలిసింది. ప్రజలు ఆ పిలుపును తిరస్కరిస్తున్నారని గమనించారు.

తన ఆప్తమిత్రుడైన అబూబక్ర్(రజి)వారు ఆ కొత్త ధర్మాన్ని అనుసరిస్తున్నారని తెలుసుకుని, ఆ ధర్మం గురించి మరికాస్త వివరంగా తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

రాత్రివేళ చీకట్లో ఆయన అబూబక్ర్(రజి)వారి ఇంటికి బయలు దేరారు. ప్రవక్త(స)వారి నిజాయితీ ఆయనకు కూడా తెలుసు. ఆయన అబూ బక్ర్(రజి)వారిని కలిసి, ఆయన నుండి కొత్త ధర్మం గురించి స్పష్టంగా తెలుసుకున్నారు. తనను ప్రవక్త(స)వారి దగ్గరకు తీసుకు వెళ్ళమన్నారు. ముహమ్మద్(స)వారిని అనుసరిస్తే మక్కా నాయకులు ఎటువంటి హింసకు పాల్పడతామని హెచ్చరించారో తెలుసు కనుక అబూబక్ర్(రజి)వారితో కలిసి రాత్రివేళ చీకట్లో ప్రవక్త(స)వారిని కలవడానికి బయలుదేరారు.

ఆయన గదిలోకి ప్రవేశించగానే ముహమ్మద్(స)వారు పఠిస్తున్న 'సృష్టి గురించి తెలిపే ఆయత్‌లు' ఆయన మనస్సును సంతృప్తి పరిచాయి. సత్యం ఏమిటో స్పష్టమై పోయింది. ఆయన వెంటనే ఇస్లామ్ స్వీకరించారు.

ఈయన తన తల్లిని ఎంతగానో ప్రేమించేవారు. తన తల్లి విగ్రహారాధనను వదలడానికి ఒప్పుకోరని మరియు ముహమ్మద్(స)వారి బోధనలను అనుసరించరని బాగా తెలుసు. అందుకనే తన కుటుంబం నుండి ఒత్తిడి వస్తుందని భయపడి, సాద్(రజి) తన ఇస్లామ్ స్వీకరణ విషయాన్ని రహస్యంగా ఉంచమని తన స్నేహితుడైన అబూబక్ర్(రజి)తో చెప్పారు.

ఈ నవ ముస్లిమ్ రహస్యంగా ప్రతీరోజూ ముహమ్మద్(స)వారిని కలిసి దివ్య సందేశాన్ని వింటూ ఉన్నారు. రోజురోజుకూ ఆయన విశ్వాసం బలపడుతూ ఉంది. ఎంతో రహస్యంగా ఉంచినా సరే ఏదో రోజు తెలియక మానదు.

ఒకరోజు సాద్(రజి) ఇంటికి వచ్చేసరికి తల్లి ఎదురుచూస్తూ ఉంది. ఆమె కోపంగా అడిగింది. "నీవు ముస్లిమ్ అయిన విషయం నిజమేనా?"

ఎవరో తల్లికి తెలియజేసి ఉంటారు. ఎటువంటి మొహమాటం లేకుండా "ఔనమ్మా! నేను సత్యకాంతిని అనుసరిస్తున్నాను"

తన తల్లిని కూడా ఇస్లామ్ స్వీకరించమని ఆయన కోరారు. కాని తిరిగి తన పూర్వీకుల ధర్మాన్ని ఆయన అనుసరించేంత వరకూ ఆహారం ముట్టుకోనని, ఆమె నిరాహార దీక్ష ప్రారంభించారు.

ఆ వేధింపును ఆపమని తన తల్లిని ఎన్నో విధాలుగా బ్రతిమిలాడారు. ఎందుకంటే తల్లి అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆమె బాధపడటాన్ని ఆయన సహించలేరు. ఆమె మొండిపట్టు పట్టారు. మరణించే వరకూ తినను మరియు త్రాగనని మొండికేశారు.

నిరాహార దీక్షలో ఒకరోజు ముగిసింది. ఆమె బలహీనమయ్యారు. తన తల్లిని దీక్ష నుండి విరమింప జేయడానికి సాద్(రజి)వారికి ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఆమె చాలా పట్టుదలగా ఉన్నారు. ఏ విషయాన్ని ఒప్పుకోవడానికి ఇష్టపడటం లేదు.

రెండవ రోజు ఆ వృద్ధురాలు నీరసంతో పడిపోయే పరిస్థితికి చేరుకున్నారు. సాద్(రజి)వారు నీళ్ళు నిండిన కళ్ళతో ఆమెతో చెప్పారు:

**"అమ్మా! నా మాట విను. నీకు వంద ఆత్మలుండి నేను నా ధర్మాన్ని వదిలేయడం కొరకు వాటిని ఒకటొకటిగా వదిలేసినా నేను ఆ పనిచేయను. నేను ఈ లోకంలో మరియు పరలోకంలో సంతోషాన్ని కలిగించే మార్గాన్ని కనుగొన్నాను."**

సాద్(రజి)వారి మాటలు తల్లి హృదయాన్ని తాకాయి. తన కుమారుడు ఇస్లామ్ విషయంలో తీసుకున్న నిర్ణయం మామూలు వ్యవహారం కాదని మరియు తన కొరకు దానిని వదిలేస్తాడని అనుకోవడం పొరపాటని ఆమెకు అర్థమైంది.

ఎప్పుడైతే తన కొడుకు ఇస్లామ్ విషయంలో స్పష్టంగా ఉన్నాడని తెలుసుకున్నారో, ఆమె వెంటనే తన నిరాహార దీక్షను ఆపివేశారు.

ప్రవక్త(స)వారికి ఈ విషయం తెలిసింది. సాద్(రజి)వారి పట్టుదలను ప్రశంసించారు. ఈ సంఘటనపై దివ్యసందేశం ప్రవక్త(స)వారిపై అవతరించ బడింది.

**"మరియు ఒకవేళ వారిరువురు (తల్లిదండ్రులు) - నీవు ఎరగని దానిని - నాకు (అల్లాహ్‌కు) భాగస్వామిగా చేర్చమని, నిన్ను బలవంతం చేస్తే, వారి మాటను నీవు ఏ మాత్రం వినకు. మరియు ఇహలోక విషయాలలో ధర్మ సమ్మతమైన వాటిలో వారికి తోడుగా ఉండు. మరియు పశ్చాత్తాపంతో నా వైపుకు మరలేవాని మార్గాన్ని అనుసరించు. తరువాత మీరంతా నా వైపునకే మరలి రావలసి ఉన్నది. అప్పుడు నేను మీరు చేసే కర్మలను గురించి మీకు తెలుపుతాను."** (ఖుర్‌ఆన్ 31:15)

ఈ పరీక్ష ద్వారా సాద్(రజి) విశ్వాసం మరింత పటిష్టం అయింది. భవిష్యత్తులో ఎదుర్కొనబోయే పరీక్షలకు అల్లాహ్‌చే సిద్ధం కావించ బడుతున్నారు. అబీ తాలిబ్ లోయలో ఈ సహాబీ కూడా 3 సంవత్సరాల పాటు ముహమ్మద్(స)వారితో పాటు వెలివేయబడి ఆకలి బాధను సహించారు. ఒకొక్కసారి ఆకులు కూడా తినేవారు. ఆ స్థాయిలో మక్కా అవిశ్వాసులు ముస్లిములను హింసించేవారు.

13 సంవత్సరాలపాటు మక్కాలో హింసకు లోనై, చివరకు మక్కా పట్టణాన్ని వదిలి మదీనాకు వలస వెళ్ళవలసి వచ్చింది. ఓ చీకటి రాత్రి సాద్(రజి) మదీనాకు పయనమయ్యారు. ఊరి పొలిమేరలు చేరుకున్నాక, కన్నీరు నిండిన కళ్ళతో విచారంగా ఓసారి తన పుట్టిన ఊరును చూసుకున్నారు. తాను ప్రేమించిన ఊరు కంటే తన విశ్వాసమే తనకు ముఖ్యం. ఒంటెపై ఎడారి గుండా పదిరోజులు ప్రయాణం చేశారు. ఆయనను తమకు అతిథిగా ఉండమని ఎందరో అడిగారు. ఆయనెన్నడూ అటువంటి హృదయపూర్వక స్వాగతాన్ని ఊహించలేదు.

దానికి కారణం ఇస్లామ్. ఇస్లామ్ ప్రజల మధ్య అంత గాఢాను బంధాన్ని పెంచింది.

మక్కానుండి మదీనాకు వలసలు జరుగుతూనే ఉన్నాయి. తన ఆప్త మిత్రుడైన అబూబక్ర్(రజి)వారు మరియు ముహమ్మద్(స)వారు కూడా మదీనాకు వచ్చేశారు.

ముహమ్మద్(స)వారు సాద్(రజి)వారితో చాలా సార్లు చెప్పారు : "నీవెక్కడున్నా ఇస్లామ్‌కు సహకరిస్తావు". ఈ ఒక్కమాట చాలు సాద్(రజి) వారి గురించి మనకు అర్థం కావడానికి.

సత్య తిరస్కారులు మదీనా వచ్చి ముస్లిములపై దాడిచేసే అవకాశం ఉన్నందువలన, ప్రవక్త(స)వారు 60 మందితో కూడిన ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు ఎడారి దారులలో నిఘా ఉంచేవారు. ఒకసారి మాత్రం సాద్(రజి)వారు సత్యతిరస్కారులు ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఇరువర్గాల మధ్య పోరాటం జరుగలేదు. కాని శతృవులకు తమ బలాన్ని మరియు స్వేచ్ఛను సూచించడానికి వారివైపు ఒక బాణాన్ని వదిలారు. ఆ విధంగా ముస్లిములు మరియు సత్య తిరస్కారుల మధ్య జరిగిన పోరాటాలకు నాంది పలికిన తొలి బాణం ఆయనదే!

ఆ తరువాత బద్ర్ యుద్ధం జరిగింది. 1000 మంది సాయుధులైన మక్కా అవిశ్వాసులకు మరియు దాదాపు 300 మంది సరియైన ఆయుధాలు లేని పేద ముస్లిములకు మధ్య జరిగిన ఈ యుద్ధంలో అల్లాహ్ అనుగ్రహం వలన ముస్లిములకు విజయం లభించింది.

బద్ర్ పరాజయం భరించలేని మక్కా అవిశ్వాసులు మరో రెండు సంవత్సరాలకు ప్రతీకారంతో మరలా యుద్ధానికి సిద్ధమయ్యారు. 3000 మంది సైనిక బలంతో బయలుదేరి వచ్చారు. దాదాపు 1000 మంది ముస్లిములు సమావేశమై, ఉహద్ పర్వత దిశగా కదిలారు శత్రువులను ఢీకొనడానికి. అయితే కొందరు కపట విశ్వాసులు వెనుక మదీనాలోనే ఉండిపోయారు. దాదాపు 3వ వంతు సైన్యం వెనుకకు వెళ్ళిపోవడం జరిగింది. ముస్లిములు చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పటికీ, అల్లాహ్ నుండి సహకారం అందుతుందనే ధృడ విశ్వాసంతో ఉన్నారు.

ప్రవక్త(స)వారు 50 మంది విలుకాండ్రులను (బాణాలు వదిలేవారిని) ఓ చిన్న కొండపై యుద్ధ రంగానికి చేరువలో ఉంచారు. వెనుకవైపునుండి జరిగే దాడి నుండి రక్షణగా ఉండాలని వారిని ఆదేశించారు. యుద్ధ ఫలితం ఏదైనప్పటికీ తను పిలిచేవరకూ వారు తమ స్థానాలను వదిలి రాకూడదని కూడా ఆదేశించారు.

యుద్ధరంగం నుండి మక్కా అవిశ్వాసులు పలాయనం చిత్తగించారు. వారి వెనుక ముస్లిములు పడ్డారు. ఇది వారిపై గొప్ప దెబ్బే. తమ స్థానాల్లో కదలకుండా ఉండవలసిన విలుకాండ్రు యుద్ధరంగంలో తమ తోటి ముస్లిములు యుద్ధప్రాప్తిని సేకరించడాన్ని చూశారు. వారిలో ఎక్కువ మంది తమకు ప్రవక్త(స) ఇచ్చిన ఆదేశాన్ని మరచిపోయి తమ స్థానాలను వదిలేసి యుద్ధప్రాప్తి సేకరణలో పడిపోయారు.

కొందరు ఖురైష్ గుర్రపు రౌతులు విలుకాండ్రు స్థానాలను వదిలేయడాన్ని గమనించారు. అంతే వారు ముస్లిము సైన్యంపై వెనుక వైపు నుండి దాడి చేశారు. పారిపోతున్న ఖురైష్ సైనికులకు ఈ వెనుక వైపు నుండి జరుగుతున్న దాడి గురించి అర్థమై తిరిగి బలాన్ని పుంజుకుని ముస్లిములపై తిరగబడ్డారు. ఆ విధంగా అన్నివైపుల నుండి శతృవులు చుట్టుముట్టారు.

ముస్లిములలోని చాలామంది వీరులు మరణించారు. కొందరు యుద్ధ రంగం నుండి తప్పించుకున్నారు. వారు ముహమ్మద్(స)వారు మరణించారని భావించారు. అయితే మిగిలినవారు వారి వారి స్థానాలలో యుద్ధం చేస్తున్నారు.

సాద్(రజి)వారు ముహమ్మద్(స)వారి ముందు ఉండి బాణాలు వదులుతున్నారు. అటువంటి కష్ట సమయంలో ఆయన ప్రవక్త(స)వారి నుండి మధురమైన మాటలు విన్నారు :

"సాద్! వారిపై గురిపెట్టు, నా తండ్రి మరియు తల్లిని నీ కోసం అర్పింతుగాక!" (తండ్రి మరియు తల్లిని అర్పించడం అనేది ఒక అరబీ సామెత).

ప్రవక్త(స)వారి నోటినుండి అరుదుగా లభించే ప్రశంస ఇది.

ప్రవక్త(స)వారికి రక్షణగా తన ఛాతీని అడ్డుగా ఉంచి యుద్ధం చేశారు. ఆ విధంగా ఆయనకు చాలా దెబ్బలే తగిలాయి. అయినప్పటికీ ఎటువంటి నొప్పి అనిపించలేదు. ఎందుకంటే ఆయన ప్రవక్త(స)వారికి రక్షణగా నిలుచుని పోరాడుతున్నారు కాబట్టి.

బద్ర్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. ఒక మక్కా నాయకుడు ఈయన కరవాలంతో చంపబడ్డాడు. చనిపోయిన ఆ నాయకుని ఖడ్గాన్ని తీసుకుని ప్రవక్త(స)వారి వద్దకు వచ్చారు. కాని యుద్ధంలో లభించిన ఆ యుద్ధప్రాప్తి గురించి అప్పటికింకా ఏ దివ్యసందేశమూ అవతరించ లేదు. కాబట్టి ప్రవక్త(స)వారు ఆ కత్తిని ఎక్కడి నుండి తీసారో అక్కడే ఉంచమన్నారు. సాద్(రజి)వారు వెంటనే పాటించారు.

ఆ తరువాత యుద్ధ ప్రాప్తి గురించి ఆయత్ అవతరించింది. ఆ ఖడ్గాన్ని తీసుకోవడానికి సాద్(రజి)వారికి ప్రవక్త(స)వారు అనుమతి నిచ్చారు.

ప్రవక్త(స)వారు సాద్(రజి)వారిని ఎప్పుడు కలిసినా చక్కని మాటలు చెప్పేవారు. అవి ఆయనను ఎంతో సంతోషపరిచేవి. ఆ మాటలకు బదులుగా ప్రపంచమే ఆయనకు చాలా తక్కువ అనిపించేది.

ప్రవక్త(స)వారు ఆయనను అమ్మి అని పిలిచేవారు.

ఒకనాడు కన్నీళ్లతో, విచారంతో వదిలి వెళ్ళిన మక్కా పట్టణాన్ని,

తన మాతృభూమిని తిరిగి మక్కా విజయం సందర్భంగా చేరుకున్నారు.

మక్కా చేరుకున్నాక ఆయన జబ్బు పడ్డారు. రోజు రోజుకీ ఆరోగ్యం క్షీణిస్తుంది. జీవితం చివరి దశకు చేరినట్లు అనిపించింది. ఆయన అనారోగ్యం గురించి తెలుసుకుని ప్రవక్త(స)వారు ఒకరోజు ఆయన దగ్గరికి వచ్చారు. ఆయన చాలా బలహీనంగా ఉన్నారు మరియు జీవితంపై ఆశ వదులుకున్నారు. కాస్సేపు మాటలు అయిన తరువాత సాద్(రజి) చెప్పారు : ఓ రసూలుల్లాహ్! నేను ఐశ్వర్యవంతుడిని మరియు ఏ సంతతి లేదు కుమార్తె తప్ప. మీరు అనుమతి నిస్తే, నా సంపదలో మూడింట రెండు వంతులు పేదలకు ఇచ్చివేయాలను కుంటున్నాను.

దానికి ముహమ్మద్(స)వారు సమ్మతించలేదు. 'సగం?' అడిగారు. చివరిగా 3వ వంతు గురించి అడిగారు. ఆ సందర్భంగా ఖుర్ఆన్ ఆయత్ అవతరించింది. ముహమ్మద్(స)వారు అన్నారు: 'నీ రక్తసంబంధీకులు కూడా బావుండాలి, వారు మరొకరి సహాయం కొరకు చూడకూడదు. నువ్వు ఖర్చుపెట్టే ప్రతీ పైసాకు అల్లాహ్ నుండి ప్రతిఫలం ఉంటుంది. నీవు నీ భార్యకు ఏర్పాటు చేసే ఆహారానికి కూడా ప్రతిఫలం ఉంటుంది.''

రోజులు గడుస్తున్నాయి. కాని సాద్(రజి) ఆరోగ్యం మెరుగుపడలేదు. ఆయనకు మక్కాలో చనిపోవడానికి గాని లేదా అక్కడ సమాధి కావడం గాని ఇష్టం లేదు. మదీనాలో ఉండాలనేది ఆయన కోరిక. మరోసారి ప్రవక్త(స)వారు సాద్(రజి)వారిని చూడటానికి వచ్చారు. సాద్(రజి)వారు చాలా దు:ఖించారు. దానికి కారణాన్ని అడిగారు ప్రవక్త(స).

తాను మక్కా నగరాన్ని అల్లాహ్ కొరకు మరియు ఆయన సందేశ హరుని కొరకు వదిలేసానని, ఈ నగరంలో ఉండటం తనకు ఇష్టం లేదనే విషయాన్ని తెలియజేశారు.

ప్రవక్త(స)వారు సాద్(రజి)వారిని సహనం వహించమన్నారు, ఆయన(స) తన చేతిని ఆయన ఛాతీపై గుండె పైభాగాన ఉంచారు. మనస్ఫూర్తిగా ఆయన మూడుసార్లు పఠించారు : ''ఓ ప్రభూ! సాద్ ఆరోగ్యాన్ని పూర్వస్థితికి తెండి''.

ఆ తరువాత సాద్(రజి)వారివైపు దృష్టి సారించి ఓ విషయాన్ని తెలియజేశారు. అదేమిటంటే ఓ జాతి పతనమై మరియు మరొకటి పైకి లేచేవరకూ నీవు జీవించి ఉంటావనే విషయం.

ఆ క్షణం నుండి ఆయన ఆరోగ్యం మెరుగుపడటం ప్రారంభమైంది. మరలా సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు. ప్రవక్త(స)వారు చెప్పిన ఆ జరగబోవు విషయం (prophecy), సాద్(రజి)వారు ఖదీసియాపై సాధించిన విజయంలో నిజమైంది. ఇరాన్ సామ్రాజ్యం పతనమైంది మరియు ముస్లిముల ఘనతకు మార్గం సుగమం అయింది.

దివ్య సందేశం ముగింపుకొచ్చింది. ధర్మం పరిపూర్ణం అయింది.

ఆ తరువాత ప్రవక్త(స)వారి మరణం సంభవించింది.

అబూబక్ర్(రజి)వారు ఖలీఫా అయ్యారు. ప్రవక్త(స)వారి తరువాత తలెత్తిన చిన్న చిన్న తిరుగుబాట్లను సాద్(రజి)వారు మరియు మరికొందరు విశ్వాసులు అణగదొక్కారు.

అబూబక్ర్(రజి) మరణం తరువాత ఉమర్(రజి)వారు ఖలీఫా అయ్యారు. ఇస్లామీయ ప్రభుత్వ సరిహద్దులలో పర్షియన్ల దాడులను ఆపడానికి యుద్ధం చేయాలని ఉమర్(రజి)వారిని ముతాన బిన్ హారిసా (రజి) అడిగారు. అధికారం కోసం అంతర్గత కలహాలతో సతమతమౌతున్న పర్షియాపై దాడికి ఇదే సరియైన సమయమని కూడా ఆయన చెప్పారు.

ఉమర్(రజి) ఆ ఆలోచనను అంగీకరించి, పర్షియాపై యుద్ధానికి సైన్యానికి తానే నాయకత్వం వహించడానికి సిద్ధపడ్డారు. కాని ఆయన ఆలోచనకు ముఖ్య సహాబీలు అడ్డు చెప్పి, ఆయన ఖలీఫా కనుక, ఆయనను కాకుండా మరొక నాయకునిపై ఈ బాధ్యత నుంచితే బావుంటుందని సూచించారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారు సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) వారిని కమాండర్‌గా ప్రతిపాదించారు. సాద్(రజి) సైనిక వ్యవహారాల్లో ప్రావీణ్యులు. అందరూ అంగీకరించారు.

ఉమర్(రజి)వారు వెంటనే ''ఔను, మీరు చెప్పింది నిజం, అతను సాద్(రజి) కావాలి. అతడు గుహలోని సింహం''.

సాద్(రజి)వారిని పిలిపించి ప్రజల నిర్ణయాన్ని ఆయనకు తెలియ జేశారు. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి కమాండర్‌గా ఉండటానికి సాద్(రజి) అంగీకరించారు. సైనిక కవాతు కొరకు సమాయత్తం కావడం ప్రారంభించారు.

ఇరాఖ్‌కు వెళ్ళడానికి సైన్యం సిద్ధం కాగానే, సైన్యం ముందు ఉమర్(రజి)వారు నిలబడి సైన్యాధికారికి చివరి సలహా ఇచ్చారు :

**"సాద్! పర్షియన్లపై యుద్ధం చేయమని నిన్ను ఆదేశిస్తున్నాను. నా మాట విను మరియు నా మాటలను గట్టిగా పట్టుకో. నీవు చాలా గట్టి నిరోధాన్ని ఎదుర్కోబోతున్నావు. దానిని నీవు జయించలేవు, సత్యంతో మరియు మంచితనంతో తప్ప. నీకు తెలుసు ప్రతి యుద్ధం కోసం యుద్ధ సామాగ్రి సిద్ధం కావాలి. సహనాన్నే నీ యుద్ధ సామాగ్రి కానివ్వు. నేను ప్రవక్త(స) వారి అమ్మి (అంకుల్) అని నీకు నీవు చెప్పు కోవడం ద్వారా మోసగించబడకు. బంధుత్వం కాదు అల్లాహ్‌కు ప్రియమైనది, ఆయన బోధనలకు చూపే విధేయత మాత్రమే".**

ఖలీఫా మాటలను సాద్(రజి)వారు శ్రద్ధగా విన్నారు మరియు సాధ్యమైనంత మేర ఆయన సలహాకు కట్టుబడి ఉంటానని వాగ్దానం చేశారు. ఇరాఖ్‌లోని అల్-ఖదీసియా ప్రదేశానికి 30వేల సైనికులతో సాద్(రజి) వెళ్ళారు. రుస్తమ్ నాయకత్వంలో పర్షియన్లు తమ సైన్యాన్ని మోహరించి ఉన్నారు.

సాద్(రజి)వారు అల్-ఖదీసియాకు చేరీ చేరగానే, అక్కడ ఉన్న

పరిస్థితులను వివరిస్తూ ఉమర్(రజి)వారికి ఓ లేఖను పంపారు. మరియు యుద్ధం ప్రారంభించడానికి ఖలీఫాగారి ఆదేశాల కొరకు ఎదురు చూస్తున్నారు.

ఉమర్(రజి)వారు లేఖ పంపారు. యుద్ధానికి సంబంధించి గౌరవించదగిన నియమంగా ఇంతకు ముందెన్నడూ ఇటువంటిది మానవ చరిత్రలో గ్రంథస్థం కాలేదు.

ఉమర్(రజి)వారు లేఖలో సాద్(రజి)వారి నుద్దేశించి ఇలా వ్రాశారు.

"నేను నిన్ను మరియు నీ సైనికులను అన్ని సమయాల్లోనూ అల్లాహ్‌కు భయపడమని ఆదేశిస్తున్నాను. మీ శతృవుకు వ్యతిరేకంగా మీరు కలిగి ఉన్న ఉత్తమ ఆయుధం అల్లాహ్‌కు భయపడటమే!

నేను నిన్ను మరియు నీ సైనికులను ఆదేశిస్తున్నాను చెడు కార్యాలకు వ్యతిరేకంగా రక్షించుకోమని. మీ సైన్యానికి చెడు కార్యాలు చాలా ప్రమాదం మీ శతృవు కంటే.

మీరు జయిస్తారు ఎందుకంటే మీ శతృవు అవిశ్వాసి కాబట్టి. అల్లాహ్‌ను కోరండి మీ కోరికలను, మీరు జయించ డానికి సహాయం చేయమని, మీరు మీ శతృవును జయించడానికి ఆయనను కోరేటంత సహాయాన్ని.

ముస్లిములను బలవంత పెట్టకండి కవాతు చేయడానికి, వారు అలసిపోయినప్పుడు. మరియు వారిని పూర్తి బలంతో సిద్ధం చేయండి శతృవులతో తలపడటానికి.

వారానికి ఒక రోజు విశ్రాంతి తీసుకోండి మీ సైన్యం పూర్తిగా సిద్ధం కావడానికి.

మనతో శాంతి ఒప్పందం ద్వారా రక్షణ పొందేవారు నివశించే ఏ ఊరి దగ్గరకీ వెళ్ళకండి మరియు మీ సైనికులలో ఎవరికీ అనుమతి నివ్వకండి ఏ ఊరిలోనైనా ప్రవేశించడానికి, అతడు సరియైన విధంగా ప్రవర్తిస్తాడని మీకు నమ్మకం ఉంటే తప్ప.

శతృవు గురించి సమాచార సేకరణ చాలా ఉత్తమ విధానం నీ శతృవు బలాన్ని తెలుసుకోవడానికి.

కాబట్టి ఆ కర్తవ్యాన్ని వారిపై నుంచండి ఎవరిపై మీకు బాగా నమ్మకం ఉందో మరియు వారికి ఉత్తమ గుఱ్ఱాలను ఏర్పాటు చేయండి."

ఖలీఫాకు మరియు కమాండర్‌కు మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగుతూ ఉన్నాయి. వారు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నారు. మరియు విజయం సాధించడానికి పథకాల రూపకల్పన చేస్తున్నారు. ఒక నెల గడిచింది. సాద్(రజి) దాడి చేయడానికి నిర్ణీత గడువు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వ్యవధిలో యుద్ధరంగాన్ని అధ్యయనం చేస్తున్నారు మరియు యుద్ధనినాదం కొరకు సిద్ధమౌతున్నారు.

ఏ జాతితోనైనా వారిని ఇస్లామ్‌వైపు పిలవకుండా వారితో యుద్ధం చేయకూడదని ముస్లిములందరికీ ఇస్లామ్ నేర్పింది. కాబట్టి సాద్(రజి) పర్షియా రాజు యజ్‌దజుర్ద్ దగ్గరికి రాయబారిని పంపారు. రాజు ఇస్లామ్ స్వీకరించాలి లేదా పన్ను కట్టాలి లేదా ఒకవేళ రెండింటిని తిరస్కరిస్తే యుద్ధం చేయాలి.

మొదటి ప్రతినిధి బృందం పర్షియా చక్రవర్తిని ఇస్లామ్‌వైపు పిలిచింది. అతనికి వారు ఇస్లామీయ నియమాలను మరియు భావాన్ని వివరించారు. ఈ పిలుపును స్వీకరించడానికి బదులు, తమ భూభాగానికి వచ్చి తమ ధర్మాన్ని క్షీణింప చేయడానికి హెచ్చరిస్తున్నందుకు, ముస్లిములను రాజు నిందించడం మొదలుపెట్టాడు.

తాము ఇస్లామ్‌కి పూర్వం చేసిన కార్యాల గురించి, ఇస్లామ్ స్వీకరించిన తరువాత వారిలో వచ్చిన మార్పు గురించి కూడా చెప్పారు. చివరిగా ఆయనకి వారు చెప్పినదేమింటంటే మూడింటిలో ఏదో ఒకటి ఎన్నుకోమని, ఇస్లామ్ స్వీకరించడం లేదా పన్ను కట్టడం లేదా ఖచ్చితమైన అపజయానికి సిద్ధం కావడం. ఎన్నిక విషయంలో ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పారు.

ఆ రాజు కోపోద్రిక్తుడై వారిని ఘోరంగా అవమానించాడు. తన సైనికులతో సంచిని మట్టితో నింపి దానిని ఆ ప్రతినిధి బృందం నాయకుని తలపై ఉంచి, నగరాన్ని దాటేంతవరకూ మోయనివ్వమని ఆదేశించాడు. అంతేకాకుండా ముస్లిమ్ ప్రతినిధులతో 'మీ వారి నాయకుడిని మరియు ముస్లిమ్ సైన్యాన్ని ఖదీసియా కందకంలో వేసి కప్పివేయడానికి రుస్తమ్‌ను పంపుతానని' చెప్పాడు.

"మీకు సంతోషవార్త! ఇప్పటికే విజయం మీదయింది" అని చెప్పి ఆ మూటను సాద్(రజి) ముందు ఉంచారు.

రాజు చేసిన ఈ పని గురించి సైన్యాధిపతి రుస్తుమ్‌కి తెలిసింది. అతడు కలవర పడ్డాడు. తమ దేశపు మట్టిని ముస్లిమ్ నాయకుని దగ్గరకు పంపడంలో పరోక్షంగా ఓటమి యొక్క సూచన ఆయనకు కనిపించింది.

## శాంతియుత పరిష్కారం కొరకు సంప్రదింపులు

రాజీ కొరకు సంప్రదింపులకై మరొక ప్రతినిధిని పంపమని సాద్(రజి) వారికి రుస్తమ్ కబురుపంపారు. అల్-ముఘీరా బిన్ షు'బహ్(రజి) రుస్తమ్ దగ్గరికి పంపబడ్డారు. ఆయన వచ్చీ రాగానే రుస్తమ్ చాలా మర్యాద పూర్వకంగా సంప్రదింపులు ప్రారంభించారు. మరియు తమ భూభాగాన్ని వదిలి వెళ్ళడం మేలని సాద్(రజి)వారికి చెప్పమని ఆ వచ్చిన ప్రతినిధితో చెప్పారు. అల్-ముఘీరా(రజి) రుస్తుమ్‌కు చెప్పారు, తమ కర్తవ్యం ఇస్లామ్ కాంతిని వ్యాపింపజేయడమని. ఇస్లామ్ నియమాలను రుస్తమ్‌కు వివరించారు. ఇస్లామ్ యొక్క న్యాయమైన బోధనలకు అనుభూతి చెంది, వచ్చిన రాయబారితో తనకు కొంత సమయం కావాలని, తమ జాతి పెద్దలతో చర్చించాలని రుస్తమ్ చెప్పారు. రుస్తమ్ తన ప్రజలతో ఇస్లామ్ స్వీకరించడం వారికి మేలని చెప్పాడు. కాని వారు తిరస్కరించారు.

సాద్(రజి)వారు మూడవ రాయబారిగా రబ్‌ఇ బిన్ 'అమెర్(రజి)ను రుస్తమ్ దగ్గరకు పంపారు. పర్షియా సైనికులుండే ప్రదేశానికి ఆయన చేరకముందే, పర్షియన్లు తాము ఎంత ఐశ్వర్యవంతులో మరియు శక్తివంతులో చూపాలనుకున్నారు. మొత్తం కోటకు పూర్తిగా వెండి మరియు బంగారాన్ని అమర్చారు. రబ్‌ఇ(రజి) తన అతి సాధారణమైన దుస్తులతో గుఱ్ఱంపై లోపలికి వచ్చారు తివాసీపై అడుగుపెట్టేవరకూ.

సైనికులు గుఱ్ఱాన్ని బయటవదిలేయాలని మరియు అతని ఆయుధాలను క్రింద ఉంచాలని చెప్పారు. ఆయన తిరస్కరించి ముందుకే అడుగువేసి, తన ఈటెను తివాచీపై గుచ్చారు. ఆయన గుఱ్ఱంపై నుండి క్రిందికి దూకి రుస్తమ్ పక్కన కూర్చున్నారు. వారు చూపాలనుకున్న ఆడంబర ప్రదర్శన ఆయనకేమీ వింత అనిపించలేదు.

తన భూభాగానికి రావడానికి ముస్లిములను ప్రేరేపించిన దానిని గురించి రుస్తమ్ వాకబు చేశారు. రబ్‌ఇ(రజి) చెప్పారు, ఇస్లామ్ సత్య వచనాన్ని భూమి అంతా వ్యాపింప జేయడానికి అల్లాహ్‌చే ఆదేశించ బడ్డామని. వచ్చిన రాయబారితో 'నీవు నాయకుడవా?' అని రుస్తమ్ అడిగారు. వినయంతో ఆ రాయబారి సమాధాన మిచ్చారు, ముస్లిములంతా ఒకే శరీరం వంటి వారని మరియు వారిలోని ఏ ఒక్కరైనా ఇతరుల కొరకు నిర్ణయం చేస్తారని.

యుద్ధం కోసమే వారు పట్టుపడితే చాలా చేదు అపజయాన్ని ముస్లిములు చవి చూస్తారని రుస్తమ్ సాద్(రజి)వారికి సందేశం పంపాడు.

ఈ మధ్య కాలంలో సాద్(రజి) పంపిన గూఢచారులు శత్రువు కాంప్‌లోకి వెళ్ళి విలువైన సమాచారాన్ని తెచ్చారు.

ఇరువైపులా సైన్యం పోరుకు సిద్ధం కావడం ప్రారంభించింది. ఒక లక్షమంది పర్షియా సైనికులు పూర్తి ఆయుధాలతో, ఏనుగులతో మరియు ఇతర భారీ యుద్ధ సామాగ్రితో సిద్ధమయ్యారు.

ఇక రెండవవైపు సాదాసీదాయైన మామూలు ఆయుధాలతో ముస్లిమ్ సైన్యం అతి పెద్ద సైన్యాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడ్డారు.

సాద్(రజి)వారు తన సైనికులకు సూచనలిచ్చారు :

"ఖాలిద్(రజి)వారి ఆదేశాలను పాటించండి. ఆయన నా ఆదేశాలను మీకు చేరవేస్తారు. అల్లాహ్ కొరకు మరణించడానికి మీరు ఇష్టపడితే మీరు గెలుస్తారని నమ్మండి. మీరు ఈ భూభాగాన్ని తీసుకుంటారని ఆయనచే వాగ్దానం చేయబడ్డారు".

'అల్లాహు అక్బర్' అని 3 సార్లు నినదించారు. 4 వ నినాదంతో ముస్లిమ్ సైన్యం శత్రువువైపు ఉరికింది. సాద్(రజి)వారు ఆ సమయంలో కీళ్ళనొప్పితో ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ఆయన యుద్ధరంగంలో లేరు. ఆయన ఓ భవనంపై భాగాన కూర్చుని ఆదేశాలు ఇచ్చేవారు. ఘోరంగా యుద్ధం జరిగినా ఇరువైపులా ఎవరికీ ఎటువంటి ఉపయోగం కనిపించలేదు.

తరువాత రోజు కూడా యుద్ధం ప్రారంభమైంది.

సిరియా నుండి తిరిగి వస్తున్న హాషిమ్ బిన్ ఉత్బా నాయకత్వంలోని ముస్లిమ్ సైన్యం, సాద్(రజి)వారి సైన్యానికి తోడయ్యింది. బలం పెరిగింది.

మధ్యాహ్నానికి సిరియా నుండి వస్తున్న ముస్లిమ్ సైన్యం కలిసింది. కాని పర్షియన్లు ఏనుగులను ముందు వరుసలో ఉంచారు. వాటివలన రెండవ రోజు కూడా మొదటి రోజులాగే ముగిసింది.

ఇక మూడవరోజు. యుద్ధానికి అదే ఆఖరిరోజు కావాలని సాద్(రజి) నిర్ణయించుకున్నారు. సాయంత్రమై పోయింది. ఆ ఏనుగుల ప్రమాదాన్ని తొలగిస్తే పెద్ద సమయం అవసరం లేకుండానే శత్రువులను అల్లాహ్ అనుగ్రహంతో ఓడించగలుగుతారనే నమ్మకం ఆయనకు ఉంది. ధైర్య వంతులైన కొందరు వీరులను పిలిపించి ఏనుగులను పడగొట్టమని చెప్పారు. అతి కష్టం మీద వాటిలోని రెండు పెద్ద ఏనుగులను పడగొట్టారు. ఏనుగులు తమ సైన్యాన్ని తొక్కుకుంటూ వెనుకకి పారిపోయాయి.

ఇక విజయం సుసాధ్యమయ్యే పరిస్థితి, ఆయన తమ బలగాల క్రమాన్ని మార్చి శత్రువులపై నూతన ఉత్సాహంతో దాడి చేయమని ఆదేశించారు. ఎప్పుడైతే రక్షణ కవచంగా ఉన్న ఏనుగులు పోయాయో, ముస్లిముల దెబ్బలకు శత్రుసైన్యం భీతిల్లింది. వారి సైనిక వరుసలు మారిపోయాయి. వారి నాయకుడు తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. హిలాల్ అనే ముస్లిమ్ సైనికునిచే చంపబడ్డాడు.

శతాబ్దాల తరబడి ఇరాఖ్ దేశం ఇరాన్ దేశాక్రమణలో ఉంది. వాస్తవంగా ఇరాన్ పాలకులు మదయన్ నగరాన్ని ఇరాఖ్ దేశ ముఖ్య పట్టణంగా చేసుకున్నారు. వారి శక్తికి మరియు వైభవానికి మచ్చుతునక. అయితే, ఇరాఖ్ అరబ్బు భూభాగం మరియు ఉమర్(రజి) విదేశీయుల కబంధాల నుండి దానిని స్వేచ్ఛాయుతం చేయాలనుకున్నారు.

ఉమర్(రజి)వారికి ఇరాన్ పాలకులకు మధ్య ఎటువంటి గొడవ లేదు. ఖదీసియా విజయం ఇరాఖ్‌ను స్వేచ్ఛాయుతం చేయడానికి మార్గాన్ని సుగమం చేసింది.

ఆ బాధ్యత కూడా సాద్(రజి)వారిపై పెట్టబడింది.

బాబిలోన్ ఇరాన్ యొక్క శక్తివంతమైన భూభాగం. మొట్టమొదట దానిని వశపరచుకోవడానికి నిర్ణయించుకున్నారు. మార్గంలో నిరోధాలు ఎదురైనా వాటిని అణిచి తుఫాన్‌లా విజృంభించి బాబిలోన్‌ను వశపరచు కున్నారు. అక్కడి నుండి మదయన్ దిశగా సైన్యం కదిలింది. అక్కడ బెహ్రాషెర్ బలమైన సైనిక స్థావరం ఉంది. సాద్(రజి)వారు అక్కడకి చేరగానే కోటలోకి పోయి కోటను మూసివేసుకున్నారు. రెండు నెలలు గడిచాయి. ఇక గత్యంతరం లేక యుద్ధానికి సిద్ధపడి బయటకి వచ్చారు. ఎప్పుడైతే వారి కమాండర్ చంపబడ్డాడో, మిగిలిన వారు పలాయనం చిత్తగించారు.

బెహ్రాషెర్ పతనమయ్యాక, మదయన్ దారిలోని అడ్డు తొలగిపోయింది. మిలమిల మెరిసే ఇరాన్ పాలకుడి తెల్లటి గొప్ప రాజభవనం కొంత దూరంలోనే టైగ్రిస్ నదికి ఆవల ఒడ్డున ఉంది. పాలకుడు మరియు అతని పరివారం అప్పటికే బ్రిడ్జి (వంతెన)ను దాటి పారిపోయి, వంతెనను నాశనం చేశారు.

ఖదీసియా విజయులు టైగ్రస్ నది ఒడ్డునే ఆగిపోయారు. అటువైపు గొప్ప రాజభవనం ఎడారి సూర్యుని కాంతిలో మెరుస్తూ ఉంది. కాని నదిని దాటడానికి వంతెన లేదు. ఒక నది మూలంగా ఆగిపోవడం సాద్(రజి)వారికి నచ్చలేదు. తన తోటి వీరులతో చెప్పారు :

ఇస్లామ్ ధైర్యవంతులైన కుమారులారా! శత్రువు నదిని కవచంగా ఉపయోగించుకునే ఆలోచనలో ఉన్నాడు. మన పాదాల క్రింద ఆ కవచాన్ని తొక్కేద్దాం పదండి''.

ఇది చెప్పి, ఆయన తన గుఱ్ఱాన్ని నీటిలోనికి దూకుడుగా ప్రవేశింపజేశారు. సైన్యం తన నాయకుడిని అనుసరించింది. ముస్లిముల నమ్మదగని ధైర్యాన్ని చూచి, అవతలి ఒడ్డున ఉన్న ఇరాన్ సైనికులు తమ పాదాలకు పని చెప్పారు, అరుస్తూ 'మహాశక్తి సంపన్నులు వచ్చేశారు, మహాశక్తి సంపన్నులు వచ్చేశారు'.

అందరూ క్షేమంగా నదిని దాటారు. కొద్దిపాటి ఇరాన్ సైన్యం వీరిని ఆపాలని ప్రయత్నించిందిగాని ఆపలేకపోయింది. ఆ శ్వేత భవనాన్ని వదిలేసి వెళ్ళిపోయారు. సాద్(రజి)వారు దానిలోకి ప్రవేశించారు. అందులో ఎక్కడివక్కడే ఉన్నాయి. బంగారం మరియు విలువైన రాళ్ళు పోగులుగా పోసి ఉన్నాయి.

సాద్(రజి) వాటిని ప్రత్యేకంగా ముట్టుకుని క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లను చదివారు :

**"వారు ఎన్నో తోటలను మరియు చెలమలను వెనుక విడిచి పోయారు. మరియు ఎన్నో పంట పొలాలను మరియు గొప్ప భవనాలను. మరియు వారు అనుభవిస్తూ ఉన్న ఎన్నో సుఖసంతోషాలను కూడా! ఈ విధంగా, (వారి ముగింపు జరిగింది.) మరియు మేము వాటికి ఇతర జాతివారిని వారసులుగా చేశాము. కాని, వారికొరకు ఆకాశం గానీ, భూమిగానీ విలపించలేదు మరియు వారికి ఎలాంటి వ్యవధి కూడా ఇవ్వబడలేదు."** (ఖుర్'ఆన్ 44:25-29)

మదయన్ పతనంతో ఇరాఖ్‌ని ఆక్రమించిన ఇరాన్ పరిపాలన అంతమై పోయింది. కొన్ని వ్యవధిలోనే అక్కడి నాయకులు, భూస్వాములు కొత్త పాలనను అంగీకరించారు. ఇరాఖ్‌లో తిరిగి శాంతి రాజ్యమేలింది.

ఇరాఖ్‌ను స్వేచ్ఛాయుతం చేశాక, సాద్ ఇరాన్‌లో ప్రవేశించడానికి ఉమర్(రజి)వారిని అనుమతి నడిగారు. ఆయన ఇలా సమాధానం చెప్పారు:

**"నేను సంపదపై మరియు భూభాగాలపై కంటే ఒక సైనికుని జీవితానికే ఎక్కువ విలువ ఉంచుతాను. ఇరానియన్ల నుండి మనలను విడదీసే విడగొట్టలేని గోడను కోరుకున్నాను, ఇరువురిలో ఒకరిపై ఒకరు దాడిచేయకుండా. స్వేచ్ఛగావించిన భూభాగాలలో శాంతిభద్రతలను ఏర్పరచి మీరు తృప్తిగా విశ్రాంతి తీసుకోండి".**

ఉమర్(రజి)వారి ఆదేశంతో ఆయన సైనిక జీవనం సమాప్తమైంది. ఆయన ఇరాఖ్‌కు గవర్నర్ అయ్యారు.ఇప్పుడు ఆయన ముందున్న కొత్త బాధ్యత ప్రజల సంక్షేమం కోసం న్యాయమైన మరియు నిజాయితీతో కూడిన పరిపాలన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

శతాబ్దాలుగా అక్కడి ప్రజలు అణచివేతకు గురయ్యారు మరియు దోచుకోబడ్డారు.

మదయన్‌లో సామాజిక, ఆర్థిక సంస్కరణలు శీఘ్రంగా మొదలు అయ్యాయి. ఖలీఫా ఉమర్(రజి)వారి ఆదేశాల మేరకు జనాభా గణన మొదలైంది. సాగుచేయడానికి వీలయ్యే భూమి ఎంతుందో కొలవబడింది మరియు వర్గీకరించబడింది. భూశిస్తు విధానం మరియు ఇతర పన్నులను హేతుబద్ధంగా నిర్ణయించడం జరిగింది. దున్నేవానికి పక్కా భూములను కేటాయించారు.

ఈ సంస్కరణలు గొప్ప ప్రభావాన్ని చూపాయి. అవి అన్ని వర్గాల ప్రజలను ఒకే విధంగా ఉపయోగపడ్డాయి. న్యాయమైన నియమాలు మరియు సమసమానంగా సంపద పంచబడటం ఉత్పాదకతను పెంచింది.

ధనవంతులతో సహా ప్రజలందరికీ ఇది ఐశ్వర్యాన్ని సమకూర్చి పెట్టింది. దీనివలన అనివార్యమైన ఫలితం ఏమిటంటే, చాలా శీఘ్రంగా ఇస్లామ్ వ్యాపించింది.

ప్రజలు ముస్లిముల పాలనలోని శుభాలను చూశారు. ఇస్లామ్ అక్కడి ప్రజల హృదయాలను గెలుచుకుంది మరియు వేల సంఖ్యలో ప్రజలు ఇస్లామ్ వైపు వచ్చారు.

అక్కడ ఉండే వాతావరణం మరియు సాంస్కృతిక పరిస్థితుల దృష్ట్యా మదయన్ అరబ్ కేంద్రంగా సరిపోవడం లేదని సాద్(రజి) భావించారు. ఆ విషయాన్ని ఖలీఫా గారి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆయన ఇచ్చిన సలహా ఏమిటంటే అరబ్ భూభాగ సరిహద్దులకు దగ్గరలో సరిపోయే ప్రాంతాన్ని ఎన్నుకుని నగరాన్ని నిర్మించమని.

ఆ సలహా వెలుగులో, ఓ ప్రాంతం ఎన్నుకోబడింది మరియు కూఫా నగరం స్థాపించబడింది. నగరం మధ్యలో వేల సంఖ్యలో ముస్లిములు సలాత్ చేసుకునే విధంగా పెద్ద మస్జిద్‌ను నిర్మించారు. మస్జిద్‌కు దగ్గరలో గవర్నర్ ఇంటిని మరియు ప్రభుత్వ కోశాగారాన్ని ఏర్పాటు చేశారు.

కూఫా చాలా త్వరగానే సందడి నగరం అయిపోయింది. బజారు

యొక్క కోలాహలం మరియు గడబిడ గవర్నర్ ఇంటి ప్రశాంతతకు ఇబ్బంది కలుగుతుంది. ఆ ధ్వని దూరం కావడానికి, సాద్(రజి)వారు తన ఇంటిముందు పోర్టికోను నిర్మింపజేశారు.

ఆ విషయం ఖలీఫా ఉమర్(రజి)వారికి తెలిసింది. ఆయనను బాధించింది.

ఉమర్(రజి)వారు తన గవర్నర్లు ప్రజలకు దగ్గరగా ఉండాలని పదే పదే చెప్పేవారు. పాలకునికి మరియు ప్రజలకు మధ్య దూరం పెరగ కూడదు.

ప్రభుత్వ కార్యాలయానికి ముందు పోర్టికో లేదా ఓ ద్వారపాలకున్ని ఏర్పాటు చేసుకోవడం కూడా ఉమర్(రజి)వారి ప్రజాస్వామ్య భావనను ఉల్లంఘించడమే! ఇస్లామీయ ప్రజాస్వామ్యాన్ని ఖచ్చితంగా అమలు చేసిన ఖలీఫా - ఉమర్(రజి)వారు. ఆయనను ఆనాటి నుండి నేటి వరకూ ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతీ నాయకుడు ఆదర్శంగానే తీసుకున్నారు. మహాత్మాగాంధీగారు కూడా అదే అభిప్రాయ పడ్డారు, ఉమర్ వంటి ఓ నాయకుడు మనదేశంలో ఉంటే మన దేశానికి నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని.

అల్లాహ్ అనుగ్రహంతో సాద్(రజి)వారి ద్వారా ముస్లిమ్ సమాజానికి విజయాలు అంది ఉండవచ్చు. అయినా సరే, సాద్(రజి)వారు చేసిన పనిని ఆయన చూసీ చూడనట్లు వదిలేయలేదు. ఆయన వెంటనే ముహమ్మద్ బిన్ ముస్లిమాను కూఫా పంపారు, ఆ పోర్టికోకు నిప్పు పెట్టమని. ఇబ్నె ముస్లిమా కూఫా చేరగానే ఖలీఫాగారి ఆదేశాల ప్రకారం విశ్వసనీయంగా ఆ పని చేశారు. సాద్(రజి)వారు తన పోర్టికో నాశనమౌతూ ఉంటే చూస్తూ నిలబడ్డారంతే.

6 సంవత్సరాలు గవర్నర్‌గా చేసాక, ఉమర్(రజి) ఆ పదవి నుండి ఆయనను విముక్తిడిని చేశారు. అయినప్పటికీ సాద్(రజి)వారు చేసిన సేవలను ఎల్లప్పుడూ ఉమర్(రజి)వారు మెచ్చుకునేవారు.

ఆ తరువాత రెండు సంవత్సరాలకు ఉమర్(రజి)వారు మరణానికి సమీపంలో ఉన్నప్పుడు, తన తరువాత వచ్చే ఖలీఫా సాద్(రజి)వారి సేవలను ఉపయోగించు కోవాలని చెప్పారు.

ఆ విధంగానే తరువాత వచ్చిన 3వ ఖలీఫా 'ఉస్మాన్(రజి)'వారు, సాద్(రజి)వారిని కూఫా నగరానికి తిరిగి గవర్నర్‌గా నియమించారు. రెండవసారి గవర్నర్‌గా మూడు సంవత్సరాలు చేశారు.

ఆ పదవిని నిర్వహించి తిరిగి వచ్చాక మదీనాలో తన మిగిలిన జీవితం అంతా విశ్రాంతిలో గడిపారు. ఉస్మాన్(రజి)వారి కాలంలో ఎన్నో ఉపద్రవాలు కలిగాయి. కాని వేటిని సాద్(రజి)వారు పట్టించుకోలేదు. ముస్లిముల మధ్య ఐక్యత పోవడం ఆయనను చాలా తీవ్రంగా బాధించింది. అయినాసరే ఆ వర్గాలలో ఎటువైపు కూడా మొగ్గు చూపలేదు. మదీనాకు 10 మైళ్ళ దూరంలో ఇల్లు నిర్మించుకుని అక్కడే ప్రార్థనలతో గడిపారు. బయట జరుగుతున్న విషయాలను తన దృష్టికి తీసుకు రావద్దని కుటుంబ సభ్యులకు చెప్పారు. రిటైర్ అయ్యాక కూడా ఆయన తరచుగా తన స్వంత ఒంటెలను మేపేవారు. ఒక రోజు ఆయన కుమారుడు అమ్ర్, 'ఇతరులు అధికారాన్ని లాక్కోవడానికి పోరాడుతుంటే, మీరు ఎడారిలో ఒంటెలను మేపుకోవడం ఎంత దీనంగా ఉంది'.

సాద్(రజి) సమాధానంగా అన్నారు : "హుష్"

నేను రసూలుల్లాహ్(స) చెప్పగా విన్నాను "అల్లాహ్ ప్రేమిస్తారు పోరాడేవాడిని మరియు ధర్మపరాయణుడిని"

ఆయన చివరి కోరిక ఏమిటంటే బద్ర్ యుద్ధంలో ఆయన ధరించిన ముతక ఉన్ని వస్త్రాలను ధరింపజేసి సమాధి కావించమన్నారు.

70 సంవత్సరాలకు పైబడిన వయసస్సులో మృత్యువుకు చేరువయ్యారు.

దు:ఖిస్తున్న కుమారునితో,

"దు:ఖించకు నా కుమారా! నీకు తెలియదా నీ తండ్రికి స్వర్గం వాగ్దానం చేయబడిందని"

తన జీవితాన్ని రాబోయే ముస్లిమ్ తరాలకు ఓ ప్రకాశించే ఉదాహరణగా వదిలేసి, ఈ లోకాన్ని వీడారు.

**తన జీవితాన్ని ఇస్లామ్ సేవ కొరకు త్యాగం చేసిన మన నాయకుని జీవిత చరిత్ర ఇది. మక్కాలోని అవిశ్వాసులచే హింసకు లోనై, మదీనాకు వలస వచ్చి, పవిత్ర ఖుర్ఆన్ కాంతిని వ్యాపింపజేయడానికి ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నారు.**

**ఆయనకు స్వర్గ సువార్తను ముందుగానే ప్రవక్త(స)వారు తెలియజేశారు. ఆయనకు సంబంధించిన చాలా విషయాలలో ఖుర్ఆన్ ఆయత్‌లు అవతరించాయి.**

విశ్వసించడం అంటే అన్ని రకాల పూజలను ఆపేసి, కేవలం నోటితో కలిమా చదివేస్తే సరిపోదు. ఇస్లామ్‌ను అర్థం చేసుకున్న ఏ నవ ముస్లిమైనా, సమస్యలు చూచి భయపడరు.

స్వర్గ శుభవార్తలను అందుకున్న సహాబీలందరూ ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించినవారే!

వారిని చూచి సమస్యలే భయపడేలా వారి జీవనం సాగింది.

ఇస్లామ్‌పై అవగాహన పెంచుకోండి.

ఆలిమ్‌ల దగ్గర సరియైన శిక్షణ పొందండి.




دُعَا

ఈ నెల ప్రత్యేకం

అల్లాహ్‌ను వేడుకోవడం ఆరాధనకు మూలం. ఎందుకంటే దాసుడు తన లేమిని మరియు బలహీనతను అల్లాహ్ ముందు వ్యక్తపరుస్తాడు. అల్లాహ్ ముందు చాలా అణుకువగా అర్థించి, ఆయన గొప్పతనాన్ని మరియు శక్తిని అంగీకరిస్తూ తన అవసరాలను తీర్చుకుంటాడు.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు : **"అల్లాహ్‌ను రక్షణకై అర్థించండి పేదరికం నుండి మరియు లేమి నుండి చులకనల నుండి మరియు (ఇతరులను)అణచడం నుండి మరియు అణిచివేతకు గురికావడం నుండి"** (ఇబ్నెమాజా, 3842, సహీహ్, పుస్తకం 34, అధ్యా.1, సంపుటి 5)

**(అల్లాహుమ్మ! ఇన్నీ అవుజుబిక మినల్ ఫఖ్రి వల్ ఖిల్లతి వజ్జిల్లతి వ అన్ అజ్‌లిమ ఔఉజ్‌లమ)**

ఓ అల్లాహ్! నేను మీ రక్షణ కోరుతున్నాను పేదరికం నుండి, మరియు లేమి నుండి మరియు అవమానం నుండి ఇతరులను అణచివేతకు గురిచేయడం నుండి, (ఇతరులచే) అణిచివేతకు గురికావడం నుండి.

వేడుకోలును వదిలివేయడం అల్లాహ్ నుండి మరలిపోయినట్లు అవుతుంది.

>ను'మాన్ బిన్ బషీర్ ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు : **"వాస్తవానికి దు'ఆ ఆరాధనే"**. తరువాత ఆయన పఠించారు: "మరియు మీ ప్రభువు ఇలా అన్నాడు : "నన్ను ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. నిశ్చయంగా ఎవరైతే నా ప్రార్థన పట్ల దురహంకారం చూపుతారో, వారు తప్పక అవమానితులై నరకంలో ప్రవేశించ గలరు (40:60)" (ఇబ్నెమాజా, 3828, సహీహ్, పుస్తకం 34, అధ్యా.1, సంపుటి 5)

కాబట్టి మనకు ఏ కష్టమొచ్చినా తీర్చగలిగేది ఒక్కరే! ఆయనే అల్లాహ్, సృష్టికర్త. ఆయననే వేడుకోవాలి. అల్లాహ్‌ను వేడుకోవడం వలన రెండు ఉపయోగాలున్నాయి. 1. మన అవసరం తీరడం 2. వేడుకోలు కూడా ఆరాధనే కావడం వలన దాని వలన లభించే పుణ్యం.

కొందరికి వేడుకోలు విషయంలో చిన్న సందేహం ఉంటుంది. వారంటారు : "అల్లాహ్ అంటే పూర్తి విశ్వాసముంది. అయితే కష్టం వచ్చినపుడు అవసరానికి ధనం కావాలనుకుంటే ముందు ధనవంతుడైన స్నేహితుడిని అడగాలి కదా! ఎందుకంటే ధనం అల్లాహ్ నుండి డైరక్టుగా అందదు కాబట్టి"

అల్లాహ్ మీకు సహాయం చేయాలని తలిస్తే, ఎవరో వ్యక్తి ద్వారా మీకు సహాయం అందేలా చేస్తారు. ఎవరైతే మీకు సహాయం చేయగలరని భావిస్తారో, వారు చేయకపోవచ్చు. మీరు ఊహించని వారెవరో మీకు సహాయం చేయవచ్చు. మనం రోజూ సలాత్ (నమాజ్)లో అదే కోరుకుంటున్నాము! **"ఇయ్యాక నస్తయీన్"** నీ సహాయాన్నే కోరుతున్నాము.

**ఏ కష్టమొచ్చినా మనం వెంటనే కోరుకోవలసినది అల్లాహ్‌నే! ఆ విధంగా కోరినందుకు పుణ్యాన్ని మరియు సహాయాన్ని కూడా పొంద గలుగుతాం, ఇన్షా అల్లాహ్!**

> (అబ్దుల్లా) ఇబ్న్ మస్ఊద్ (రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, "ఎవరైతే దారిద్ర్యంతో బాధపడ్డారో మరియు ప్రజలవైపు తిరిగారో (పరిష్కారం కొరకు), **అతని దారిద్ర్యం పరిష్కరించబడదు.** మరియు ఎవరైతే అల్లాహ్ వైపు తిరిగారో, అల్లాహ్ అతనికి స్వేచ్ఛా మార్గాలను (ఎవరిపై ఆధారపడకుండా పరిష్కారాన్ని) త్వరితం చేస్తాడు, శీఘ్ర మృత్యువు ద్వారాగాని లేక వేగంగా సంపదను చేకూర్చడం ద్వారా గాని". (అబూదావూద్, హసన్ హదీస్, 1645, పుస్తకం 9, అధ్యా. 28, సంపుటి 2)

## వేడుకోలు ఎలా ఉండాలి?

దు'ఆ మీకు తెలిసిన భాషలోనే చేసుకోవచ్చు. అయితే వుజూ మరియు సలాత్ (నమాజ్)ను ముహమ్మద్(స)వారు ఎలా నేర్పించారో, అదే విధంగా దు'ఆలను కూడా నేర్పించారు. ఎందరో ప్రవక్తలు అల్లాహ్‌ను వేడుకున్నారు. అవి ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. ఆ దు'ఆలు ఎంతో తఖ్వా మరియు విశ్వాసంతో నిండి ఉన్నవి కావున, వాటి నుండి మన అవసరానికి సరిపోయే దు'ఆను పఠిస్తే ఎక్కువ మేలు జరగవచ్చు. ఒకొక్కసారి మనకు తెలియకుండా తప్పుగా దు'ఆ చేసుకుని ఉండవచ్చు.

ఆ విధంగా ఓ వ్యక్తి చేసిన దు'ఆను ముహమ్మద్(స)వారు సవరించి, మరో **దు'ఆను నేర్పారు.**

అనస్(రజి) ఉల్లేఖనం. అనారోగ్యంతో దుర్భలంగా కోడిపిల్లలా అయిపోయిన ఓ ముస్లిమ్ వ్యక్తిని చూడటానికి అల్లాహ్ యొక్క

సందేశహరులు(స) వచ్చారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అతనితో చెప్పారు : దేని గురించైనా అల్లాహ్‌ను ప్రార్థించావా? లేక దాని కొరకు అడిగావా? అతను చెప్పాడు, ''ఔను, నేను చెప్పేవాడిని : 'ఓ అల్లాహ్! పరలోకంలో ఏ శిక్షనైతే నాకు ఇస్తారో, దానిని ముందుగా ఈ లోకంలోనే తీసుకురా''. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) అన్నారు : సుబహానల్లాహ్! నీవు దానిని సహించలేవు లేక నీవు దానిని భరించలేవు. నీవెందుకు (ఇలా) చెప్పలేదు, **"ఓ అల్లాహ్! ఈ ప్రపంచంలో మంచినివ్వు మరియు పరలోకంలో మంచి నివ్వు. మరియు మమ్మల్ని నరకాగ్ని యాతన నుండి రక్షించు".**

తరువాత ఆయన(స) అతని కొరకు అల్లాహ్‌ను ప్రార్థించారు మరియు ఆయన(అల్లాహ్) అతనికి నయం చేశారు. **(సహీహ్ ముస్లిమ్, 6835, పుస్తకం 48, అధ్యా. 7, సంపుటి 7)**

అబూ న'ఆమా ఉల్లేఖనం. అబ్దుల్లాహ్ బిన్ ముఘఫ్ఫల్ తన కుమారుడు చెప్పగా విన్నారు : ''ఓ అల్లాహ్! స్వర్గంలో కుడివైపున ఉండే తెల్లటి గొప్పభవనం కొరకు నిన్ను వేడుకుంటున్నాను నేను దానిలో ప్రవేశించినప్పుడు''. అతను చెప్పారు, ''ఓ నా కుమారా! అల్లాహ్‌ను వేడుకో స్వర్గం కొరకు మరియు ఆయన రక్షణను వేడుకో నరకం నుండి, నేను అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పగా విన్నాను : **'వేడుకోలులో అతిక్రమణకు పాల్పడే కొందరు ప్రజలు అతి దగ్గరలో ఉంటారు'.** (ఇబ్నెమాజా, 3864, సహీహ్, అధ్యా.12, సంపుటి 5)

వేడుకోలులో మనం అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని మరియు గౌరవాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరైతే స్వర్గంలో ప్రవేశిస్తారో వారు కోరుకున్నవి పొందగలుగుతారు. కాబట్టి స్వర్గానికి సంబంధించిన వివరాలను వేడుకోలులో ప్రస్తావించనవసరం లేదు. స్వర్గంలో 'ఫిర్‌దౌస్' (స్వర్గంలోని ఉన్నత భాగం)ను లేదా ప్రవక్త(స)వారి సామీప్యాన్ని కోరుకోవచ్చు. ఎందుకంటే, అవి మంచి ఆచరణలకు ప్రతిఫలంగా ప్రస్తావించబడ్డాయి.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **''మీలో ఎవరూ (ఇలా) అనకూడదు:** 'ఓ అల్లాహ్! క్షమించండి మీకు ఇష్టమైతే'. అతని వేడుకోలులో అతనిని స్థిరంగా ఉండనీయండి మరియు ఎవరూ అల్లాహ్‌ను బలవంతం చేయలేరు.'' (ఇబ్నెమాజా, 3854, సహీహ్, అధ్యా.8)

అల్లాహ్‌ను వేడుకునే వ్యక్తి, అల్లాహ్ తన అవసరాలను తీరుస్తారనే విశ్వాసంతో వేడుకోవాలి. 'మీకు ఇష్టమైతే' అనేది అనవసరం. ఉపయోగం లేదు. ఎవరి వేడుకోలుకైనా ఆయన తన ఇష్ట ప్రకారమే స్పందిస్తారు. 'నాకు ఇది అవసరం. మీకు ఇష్టమైతే ఇవ్వండి లేకపోతే లేదు' అని మామూలు మనిషిని అడిగితేనే, ఆ మాటలు సంస్కారంగా అనిపించవు. అటువంటిది సర్వోన్నతుడైన ప్రభువుతో అలా వేడుకోవడం తగదు. ఆయన అనుగ్రహించే వరకూ ఎంతో వినయంగా, విధేయతతో వేడుకోవడమే మనం చేయదగినది.

అబూ మాలిక్, సాద్ బిన్ తారిఖ్ అతని తండ్రి నుండి ఉల్లేఖించారు. ఒకవ్యక్తి రసూలుల్లాహ్(స)వారి వద్దకు వచ్చి చెప్పగా విన్నారు : ''ఓ రసూలుల్లాహ్! నేను నా ప్రభువును అడిగేటప్పుడు ఎలా చెప్పాలి?'' ఆయన(స) చెప్పారు : ''చెప్పు : అల్లాహుమ్మ-గ్ ఫిర్లీ వ రహమ్‌నీ వ'ఆఫినీ వర్‌జుఖ్నీ'' (ఓ అల్లాహ్ నన్ను క్షమించు, నాపై కరుణ అనుగ్రహించు, నన్ను క్షేమంగా మరియు బలంగా ఉంచు మరియు నాకు జీవనోపాధిని అనుగ్రహించు'' మరియు ఆయన(స) తన నాలుగు వ్రేళ్ళను బొటన వ్రేలికి దూరంగా పట్టి ఉంచి చెప్పారు : ''ఇవి నీ ధార్మిక మరియు ప్రాపంచిక వ్యవహారాలను కలుపుతున్నాయి''. **(ఇబ్నెమాజా, 3845, సహీహ్, పుస్తకం 34, అధ్యా.4, సంపుటి 5)**

ఈ ప్రపంచంలో ఎవరైనా దురదృష్టం నుండి క్షేమంగానూ మరియు మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండి మరియు లోటులేని జీవనోపాధి ఉంటే, ఈ ప్రపంచపు అన్ని అనుగ్రహాలు పొందినట్లే. పరలోకంలో అతని పాపాలు క్షమించబడితే, పరలోకపు అనుగ్రహాలు పొందినట్లే. ఈ లోకపు మరియు పరలోకపు అనుగ్రహాలన్నీ అల్లాహ్ కరుణపై ఆధారపడి ఉంటాయి.

**విశ్వాసి తన వేడుకోలుకు ఫలితం లభిస్తుందనే విశ్వాసంతో ఉండాలి.**

ఉదాహరణకు జకరియ్యా(అ) అల్లాహ్‌ను ఎలా వేడుకున్నారో క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లో చూడండి : ఇలా ప్రార్థించాడు :

''ఓ నా ప్రభూ! నా ఎముకలు బలహీనమై పోయాయి. మరియు నా తల (వెంట్రుకలు) ముసలితనం వల్ల తెల్లబడి మెరిసి పోతున్నాయి. మరియు **ఓ నా ప్రభూ! నిన్ను వేడుకుని నేను ఎన్నడూ నిష్ఫలుడును కాలేదు!''** (ఖుర్'ఆన్ 19:4)

దు'ఆ చేసుకున్న వారిలో నిరాశ ఉండకూడదు.

మరొక ఖుర్'ఆన్ ఆయత్‌లో,

ఎప్పుడైతే ఆ యువకులు ఆ గుహలో ఆశ్రయం పొందారో, ఇలా ప్రార్థించారు : **'ఓ మా ప్రభూ! మాపై నీ కారుణ్యాన్ని ప్రసాదించు మరియు మా వ్యవహారంలో మేము నీతిపరులమై ఉండేటట్లు మమ్మల్ని సరిదిద్దు".** (ఖుర్'ఆన్ 18:10)

వారి వేడుకోలుకు అల్లాహ్ స్పందించారు.

క్రింది ఆయత్ చూడండి:

''కావున ఆ గుహలో, కొన్ని సంవత్సరాల వరకు వారి చెవులను మూసివేశాము'' (ఖుర్'ఆన్ 18:11) (అంటే గాఢనిద్రను కలుగజేశాము)

ఆ గుహవాసులు ఎటువంటి వారు?

''మేము వారి యథార్థ గాథ నీకు వినిపిస్తున్నాము. నిశ్చయంగా, వారు తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు, మేము వారి మార్గదర్శకత్వాన్ని అధికం చేశాము. మరియు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని ప్రసాదించాము. వారు లేచి

నిలబడినప్పుడు ఇలా అన్నారు: 'భూమ్యాకాశాల ప్రభువే మా ప్రభువు! ఆయనను వదిలి మేము వేరే దైవాన్ని ఎలాంటి స్థితిలోనూ ప్రార్థించము. వాస్తవానికి అలా చేస్తే దారుణం చేసిన వారమవుతాము!'' (ఖుర్'ఆన్ 18:13-14)

వారు అంత విశ్వాసం కలిగి ఉండి అల్లాహ్‌ను వేడుకున్నారు. ఫలితం పొందారు. కాబట్టి విశ్వాసంతో అల్లాహ్‌ను వేడుకుంటే మనకు ప్రతిఫలం లభిస్తుందని దృఢంగా నమ్మాలి.

**అల్లాహ్ అనుగ్రహం పొందిన విశ్వాసులను చూసినప్పుడు, అసూయ పడకుండా మనం ఏవిధంగా వేడుకోవాలి?**

క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లలో అటువంటి వేడుకోలు ఎలా ఉండాలో స్పష్టం అవుతుంది.

'ఆ తరువాత ఆ బాలికను, ఆమె ప్రభువు ఆదరంతో స్వీకరించి, ఆమెను ఒక మంచి స్త్రీగా పెంచాడు మరియు ఆమెను జకరియ్యా సంరక్షణలో ఉంచాడు. జకరియ్యా ఆమె గదికి పోయినప్పుడల్లా, ఆమె వద్ద (ఏవో కొన్ని) భోజన పదార్థాలను చూసి, ఆమెను ఇలా అడిగేవాడు: "ఓ మర్యమ్, ఇది నీ వద్దకు ఎక్కడి నుండి వచ్చింది?" ఆమె ఇలా జవాబిచ్చేది : "ఇది అల్లాహ్ వద్ద నుండి వచ్చింది." నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వారికి లెక్క లేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడు. (ఖుర్'ఆన్ 3:37)

అప్పుడు జకరియ్యా తన ప్రభువును ప్రార్థించాడు. అతను ఇలా విన్నవించుకున్నాడు :

**"ఓ నా ప్రభూ! నీ కనికరంతో నాకు కూడా ఒక మంచి సంతానాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే ప్రార్థనలను వేడుకోలులను వినేవాడవు".** (ఖుర్'ఆన్ 3:38)

**ఆయన(అ) వేడుకోలుకు ఫలితం**

తరువాత అతను (జకరియ్యా) తన గదిలో నిలబడి సలాత్ చేస్తున్నప్పుడు దేవదూతలు : "నిశ్చయంగా, అల్లాహ్ నీకు యహ్యా యొక్క శుభవార్తను ఇస్తున్నాడు. అతను, అల్లాహ్ వాక్కును ధృవపరుస్తాడు. అతను మంచి నాయకుడు మరియు మనో నిగ్రహం గల ప్రవక్త అయి సద్వర్తనులలో చేరిన వాడవుతాడు" అని వినిపించారు. (ఖుర్'ఆన్ 3:39)

లూత్(అ) ఇలా ప్రార్థించారు :

**"ఓ నా ప్రభూ! నన్నూ మరియు నా కుటుంబం వారినీ వీరి చేష్టల నుండి కాపాడు."** (ఖుర్'ఆన్ 26:169)

''కావున మేము అతనిని మరియు అతని కుటుంబం వారి నందరినీ కాపాడాము'' (ఖుర్'ఆన్ 26:170)

**దు'ఆ చేసుకునేవారు, తమ దు'ఆకు ప్రత్యుత్తరం ఇవ్వబడుతుందని, అల్లాహ్‌చే కాపాడబడతామని తెలుసుకోవాలి**

మరియు వాస్తవంగా, నూహ్ మమ్మల్ని వేడుకున్నాడు. ఎందుకంటే, మేము (ప్రార్థనలకు) ప్రత్యుత్తరమిచ్చే వారిలో సర్వోత్తములము. మరియు మేము అతని కుటుంబం వారిని మహావిపత్తు నుండి కాపాడాము. (ఖుర్'ఆన్ 37:75,76)

ఇబ్రాహీమ్(అ) ఇలా ప్రార్థించారు :

''ఓ నా ప్రభూ! నాకు సద్వర్తనుడైన (కుమారుణ్ణి) ప్రసాదించు!'' కావున మేము అతనికి సహనశీలుడైన కుమారుని శుభవార్త నిచ్చాము (ఖుర్'ఆన్ 37: 100, 101)

**అల్లాహ్ యొక్క గుణాలను తెలిపే పేర్లతో దు'ఆ చేసుకోవడం వలన కూడా ఎక్కువ మేలు జరుగుతుంది**

ఉదాహరణకు క్రింది ఖుర్'ఆన్ ఆయత్ చూడండి :

''ఓ మా ప్రభూ! మమ్మల్ని సత్యతిరస్కారుల కొరకు పరీక్షా సాధనంగా చేయకు మరియు ఓ మా ప్రభూ మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా కేవలం **నీవే సర్వశక్తివంతుడవు (అల్-అజీజ్), మహా వివేచనాపరుడవు (అల్-హకీమ్).** (ఖుర్'ఆన్ 60:5)

**అల్లాహ్‌కు దు'ఆ చేసినవాడు ఖాళీచేతులతో వెళ్ళడు**

సల్మాన్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : మీ ప్రభువు చాలా సంకోచం, చాలా దయగలవాడు. తన దాసుడు ఆయనవైపు చేతులను ఎత్తితే, వాటిని ఖాళీగా వెనక్కి వెళ్ళనివ్వడానికి సంకోచిస్తాడు .... **(ఇబ్నెమాజా, 3865, హసన్, అధ్యా. 13, సంపుటి 5)**

**ముగ్గురి దు'ఆలకు జవాబు ఇవ్వబడుతుంది**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: మూడు దు'ఆలు నిస్సందేహంగా సమాధానం చెప్పబడతాయి : అణచివేయబడిన వాని దు'ఆ, ప్రయాణీకుని దు'ఆ మరియు తండ్రి తన కొడుకు కొరకు చేసుకునే దు'ఆ. **(ఇబ్నెమాజా, 3862, హసన్, అధ్యా. 11, సంపుటి 5)**

**దు'ఆ చేసుకున్నవారు సహనం వహించాలి**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: మీలో ఒకరి దు'ఆ స్వీకరించబడుతుంది ఎప్పటి వరకైతే అతడు తొందరపడకుండా ఉంటాడో. ప్రవక్త(స)వారు అడగబడ్డారు ''తొందరపడటం అంటే ఎలా ఓ రసూలుల్లాహ్?''

ఆయన(స) చెప్పారు : ఒకరు (ఇలా) చెప్పినప్పుడు : 'నేను అల్లాహ్‌కు దు'ఆ చేసుకున్నాను గాని అల్లాహ్ నా దు'ఆ స్వీకరించలేదు.'' **(ఇబ్నెమాజా, 3853, సహీహ్, అధ్యా. 7, సంపుటి 5)**

ఈ వ్యాసంలో వేడుకోలు (దు'ఆ) యొక్క ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించడం జరిగింది. మరిన్ని ముఖ్య విషయాలు దు'ఆలతో సహా మరో వ్యాసంలో ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

# ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు 6

**ఇంట్లో ఇంటర్‌నెట్ సౌకర్యమున్న తల్లిదండ్రులు, తమ పిల్లలకు తమ సమక్షంలోనే ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకునేలా అలవాటు చేస్తే, కొంతైనా మన పిల్లలకు జరిగే కీడునుండి తప్పించిన వాళ్ళ మవుతాము.**

*స్థలాభావం వలన మరియు ఇతర కారణాల వలన ఈ శీర్షికను కొద్దికాలంగా అందించలేక పోయాము. ఇంటర్‌నెట్ ఈ రోజున సర్వ సామాన్యం అయిపోయింది. ఎవరికి ఏ వీడియో ఇష్టమైతే ఆ వీడియోను అప్‌లోడ్ చేసుకునే స్వేచ్ఛను కల్పించారు. కంట్రోల్ లేని ఈ స్వేచ్ఛ అనర్థానికి దారితీస్తుంది. ఇంటర్‌నెట్‌ను సరిగ్గా ఉపయోగించు కోగలిగితే, మన జీవితంలో దానంత సహాయకారి మరొకటి లేదనిపిస్తుంది. అదే విధంగా ప్రజలను సన్మార్గం నుండి తప్పించడంలో కూడా ఇంటర్‌నెట్ పాత్ర చాలా ఎక్కువే.*

*పిట్టగోడలు లేని ఓ డాబా ఇంటి స్లాబ్‌పై చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు అనుకుందాం. చూసేవారికి చాలా టెన్షన్ కలుగుతుంది. పిల్లలు పరుగెడుతూ చుట్టూ గోడలు లేని ఆ డాబాపై నుండి క్రిందికి పడిపోవచ్చు. అది ఓ డాబా ఇల్లు కాకుండా ఎన్నో అంతస్థులున్న అపార్ట్‌మెంట్ పైభాగాన గోడలు లేని టెర్రస్ అయితే, దానిపై ఆడుతుంటే, చూసేవారికి ఇంకా ఎక్కువ టెన్షన్‌గా ఉంటుంది. పిల్లవాడు అక్కడి నుండి పడటాన్ని ఊహించలేము. కాబట్టి స్వేచ్ఛతోపాటు సేఫ్‌టీ మెజర్స్ కూడా తీసుకోవాలి.*

*ఏ విధంగా డాబాకు పిట్టగోడలు కడతారో, అదే విధంగా ఇంట్లో ఇంటర్‌నెట్ నుపయోగించే పిల్లలు తమ గదులలో కాకుండా తల్లిదండ్రుల మధ్యలో ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.*

÷÷÷÷÷

## తప్పుదారి పట్టించే వెబ్‌సైట్లు

ఏదైనా ఓ ధర్మంపై ద్వేషం ఎందుకు పెరుగుతుంది? కారణాలేమిటి? మత దురభిమానాన్ని ఇస్లామ్ ఖండిస్తుంది.

> "మరియు - **అల్లాహ్‌ను వదలి వారు ప్రార్థిస్తున్న ఇతరులను మీరు దూషించకండి. ఎందుకంటే, వారు ద్వేషంతో, అజ్ఞానంతో అల్లాహ్‌ను దూషించవచ్చు**. ఈ విధంగా మేము ప్రతి జాతికి, వారి కర్మలు (ఆచారాలు) వారికి ఆకర్షణీయంగా కనబడేటట్లు చేశాము. తరువాత వారి ప్రభువు వైపునకు వారి మరలింపు ఉంటుంది, అప్పుడు వారికి వారి చేష్టలు తెలుపబడతాయి. (ఖుర్‌ఆన్ 6:108)

ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ప్రకారం ఆచరించేవానితో, ఏ మతధర్మానికి చెందినవారైనా స్నేహంగా ఉండగలుగుతారు. కారణం అంతటి సంస్కారాన్ని ముహమ్మద్(స)వారు ముస్లిము (అల్లాహ్‌కు విధేయుల)లో కలిగించారు. కాని నేడు కొందరు ఓ స్వార్థపూరిత వ్యవస్థను నిర్మించి ఈ సామరస్య వాతావరణాన్ని నాశనం చేయడానికి, **ముహమ్మద్(స)వారి బోధనలకు వ్యతిరేకంగా ఇతర గ్రంథాలపై కామెంట్ చేయడం ప్రారంభించారు. దాని ఫలితంగా ఆయా ధర్మాలకు సంబంధించినవారు ఈ స్వార్థ పరులపై ద్వేషాన్ని చూపడానికి బదులు, ఆ ద్వేషాన్ని ఇస్లామ్‌పై చూపించడం మొదలుపెట్టారు. దీని వలన ఇస్లామ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు ప్రారంభమయ్యాయి.**

ఓ మంచి విషయాన్ని ఎవరైనా తెలుసుకుని ఇంటర్‌నెట్‌లో ఉంచిన మరుక్షణం, అటువంటి పేరుతోనే ఆ వీడియోలో అశ్లీలమైన దృశ్యాలను చొప్పించిగాని, లేదా ఆ విషయంపై అనుమానం కలిగే మరికొన్ని విషయాలను కలుపుతున్నారు. అటువంటి వీడియోలను ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అన్ని విషయాలూ అందరి జ్ఞానానికి అందవు. ఏ ఫీల్డ్‌లో ఉన్నవారికి వాటికి సంబంధించిన విషయాలు మాత్రమే అర్థమౌతాయి. ఇస్లామ్ పేరుతోనే వెబ్‌సైట్ ఉంటుంది. కాని అది ఇస్లామ్‌ను ద్వేషించే వ్యక్తి నడిపే వెబ్‌సైట్. దానిని ముస్లిమ్ వెబ్‌సైట్ అని నమ్మకం కలిగించడానికి, ప్రారంభంలో కొన్ని విషయాలు మంచిగానే ఇస్తారు. కాని 'స్లో పాయిజన్'లా చదివేవాని మనస్సును ఆ వెబ్‌సైట్ పాడుచేస్తుంది. మనస్సులో విపరీతమైన సందేహాలు కలిగేలా చేసి ఇస్లామ్‌కు దూరమయ్యేలా చేస్తుంది.

పాశ్చాత్యుల మత దురభిమానం ఎటువంటిదో శాంతిబాట పాఠకులకు తెలిసిన విషయమే! ఇస్లామ్ వ్యతిరేక వెబ్‌సైట్ల కొరకు వారు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అటువంటి వెబ్‌సైట్ల గురించి మాకు తెలిసి నప్పటికీ వాటి వివరాలు అందించలేము. ఎందుకంటే ఆతృతతో వాటిలో తప్పు ఏముందోనని, వాటిని ఓపెన్ చేస్తారు. ఫలితంగా ఆ వెబ్‌సైట్ హిట్ రేట్ పెరిగి, అది ప్రముఖ వెబ్‌సైట్ అవుతుంది. ఎవరైనా ఇస్లామ్ గురించి ఇంటర్‌నెట్‌లో అన్వేషించేటప్పుడు అటువంటి సైట్‌లే ముందుగా కనిపిస్తాయి.

కాబట్టి ఇస్లామ్ గురించి ఇంటర్‌నెట్‌లో వెతికి తెలుసుకునే బదులు, ప్రామాణిక గ్రంథాల ద్వారా బాగా అధ్యయనం చేసిన తరువాత ఎవరైనా ఇంటర్‌నెట్‌లో అదనపు సమాచారం కొరకు చదివితే, అప్పుడు ఆ వెబ్‌సైట్ మంచిదో కాదోనని నిర్ధారణకు రాగలుగుతారు.

ఇస్లామ్ పై ప్రాథమిక జ్ఞానం పొందడం ప్రతీ ముస్లిమ్‌పైనున్న తప్పనిసరి బాధ్యత.

ఈ నెల ప్రత్యేకం

## కాబా మస్‌జిద్ నుండి ప్రసరించబడుతున్న రేడియేషన్ ...

ప్రస్తుత వ్యాసం ప్రారంభించడానికి ముందు తెలుసుకోవలసిన ముఖ్య విషయాలు రెండు ఉన్నాయి. మొదటిది అంతరిక్షం నుండి తీయబడే ఫొటో గురించి. ఉపగ్రహం పంపిన ఫొటో అని న్యూస్ పేపర్లలో సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది. నిజానికి ఈ ఫొటో మామూలుగా మనం ఉపయోగించే కెమెరాల వంటి వాటితో తీసినది కాదు.

భూమి నుండి పరావర్తనం చెందే లేదా ప్రసరించబడే రేడియేషన్‌ని రికార్డ్ చేసే సెన్సర్స్ ఉపగ్రహం కలిగి ఉంటుంది. ఈ రేడియేషన్ తరంగ రూపంలో ప్రయాణం చేస్తుంది. ఒకో తరంగానికి ఒక ప్రత్యేక వేవ్ లెంగ్త్ ఉంటుంది. ఒకొక్క బ్యాండ్ ఇటువంటి కొన్ని వేవ్ లెంగ్త్‌లను కలిగి ఉంటుంది. ఒకొక్క బ్యాండ్‌కు ఒకో సెన్సర్ ఉంటుంది. ఈ సెన్సర్ రికార్డ్ చేసిన డిజిటల్ డేటాను భూమిపై ఉండే కేంద్రం రిసీవ్ చేసుకుని వివిధ

బ్యాండ్‌ల ద్వారా అందిన డిజిటల్ సమాచారానికి కలర్‌ని అప్లై చేయడం ద్వారా ఉపగ్రహ ఛాయా చిత్రాన్ని తయారు చేస్తారు. భూమిపై నున్న వివిధ పదార్థాలు వివిధ రకాల రేడియేషన్‌లను పరావర్తనం చేయడం/ప్రసరింప చేయడం చేస్తుంటాయి. ఒక గట్టి కొండరాయి ఒక విధంగా రేడియేషన్‌ని పరావర్తనం చెందిస్తే, మెత్తటి మట్టి మరోలా చేస్తుంది.

ఇక రెండవ విషయం బైతుల్ మ'మూర్. ఇది ఏడవ ఆకాశంపై ఉంది. ముహమ్మద్(స)వారు గగన యాత్ర(మేరాజ్) సందర్భంగా ఏడవ ఆకాశంపైకి చేరుకున్నాక అక్కడ ఇబ్రాహీమ్(అ)వారు బైతుల్ మ'మూర్ దగ్గర కూర్చుని ఉండగా చూసారు. దీనినే **స్వర్గపు కాబా** అంటారు. భూమిపై మక్కాలో ఉన్న కాబా మస్జిద్ గురించి అందరికీ బాగా తెలిసిన విషయమే. దీనిని ఇబ్రాహీమ్(అ)వారు తన కుమారుడైన ఇస్మాయిల్(అ)వారితో కలిసి పునర్ నిర్మించారు.

"అల్-బైత్ అల్-మ'మూర్" అంటే చాల ఎక్కువగా సందర్శించబడే గృహం. ఇక్కడ ప్రతీసారి 70వేల మంది దైవదూతలు తవాఫ్ చేస్తారు. ఒకసారి తవాఫ్ చేసిన దైవదూతలకు మరలా ఇక్కడ తవాఫ్ చేయడానికి పునరుత్థాన దినం వరకూ అవకాశమే దొరకదు. దీనిని బట్టి మొత్తం ఎంతమంది దైవదూతలు ఉంటారో మనకందని విషయం. **(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 411, అధ్యాయం 74, సంపుటి 1** అనస్ బిన్ మాలిక్(రజి)గారి ఉల్లేఖనంలో చూడండి.)

ఇక విషయానికొద్దాం. జనవరి 16, 2005 తేదీన ఈజిప్షియన్ నేషనల్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డా॥ అబ్దుల్ బాసిత్ సయ్యద్ గారు సౌదీ అరేబియాలో అల్-మజ్ద్ టి.వి.కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ అందిస్తున్నాము.

ఆ ఇంటర్వ్యూ పూర్తిగా అరబీలో సాగింది. ఆ వీడియోను ఎవరో ఇంటర్‌నెట్‌లో ఉంచారు. సంభాషణ స్పష్టంగా అర్థం కావడానికి ఆ వీడియోలో ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌ను కూడా ఇచ్చారు.

ఈ ఇంటర్వ్యూ వివరాలు ఇక్కడ తెలియజేయడానికి ఒక కారణం ఉంది. కొన్ని విషయాలు మనకు ఆహ్లాదాన్నిస్తాయి. మరికొన్ని విషయాలు మన కుటుంబంతో మాత్రమే పంచుకుని మంచి అనుభూతిని పొందే విధంగా ఉంటే, ఇంకొన్నింటిని బంధువులతో మరియు స్నేహితులతోనూ పంచుకుంటాము.

పబ్లిక్‌గా అంటే అందరితో షేర్ చేసుకునేవి కొన్ని ఉంటాయి.

ఈ ఇంటర్వ్యూలో ఇచ్చిన కొద్దిపాటి సమాచారంతోనే పబ్లిక్‌గా షేర్ చేసుకోలేము.

ముహమ్మద్(స)వారు అద్భుతాలు చూపించో లేక ఖుర్'ఆన్‌లోని శాస్త్రీయ విజ్ఞానాన్ని చూపించో ప్రజలను ఇస్లామ్ వైపు పిలవలేదు. ఇది దృష్టిలో ఉంచుకుని ఈ ఇంటర్వ్యూ విశేషాలను చదవమని కోరుతున్నాము.

డా॥ అబ్దుల్ బాసిత్ : భూమికి మధ్యలో (కాబా) ఉందని సైంటిఫిక్‌గా నిరూపించబడింది. ఎలా? వారు అంతరిక్షంలో ప్రయాణం చేసి భూమియొక్క చిత్రాలను తీసినప్పుడు, వారు దానిని వ్రేలాడుతున్న చీకటి గోళంగా చూశారు. భూమి వ్రేలాడుతున్న చీకటి గోళం! దానిని ఎవరు వ్రేలాడదీశారు?

యాంకర్ : ఎవరు చెప్పారు?

డా॥ అబ్దుల్ బాసిత్ : (నీల్) ఆర్మ్‌స్ట్రాంగ్ (ఎవరు వ్రేలాడ దీస్తారు, సృష్టికర్తయైన అల్లాహ్‌యే వ్రేలాడదీయాలి) భూమి ప్రసరింపజేస్తున్న రేడియేషన్‌ను కనుగొని దానిపై ఓ వ్యాసం వ్రాసి వెబ్ (ఇంటర్‌నెట్)లో ఉంచారు. 21 రోజులు మాత్రమే దానిని (ఆ వెబ్‌సైట్‌లో) ఉంచారు. తరువాత దానిని కనిపించకుండా చేశారు.

యాంకర్ : వారు ఎందుకు దానిని కనిపించకుండా చేశారు?

డా॥ అబ్దుల్ బాసిత్ : ఏదో ఉద్దేశ్యముంది ...

యాంకర్ : ఈ కప్పి ఉంచిన సమాచారం ముఖ్యమైనది అయివుంటుంది.

డా॥ అబ్దుల్ బాసిత్ : ఆ విషయం చాలా ముఖ్యమైనది, ఎందుకంటే కాబా (మక్కా) రేడియేషన్‌ను విడుదల చేస్తుందని వారు చెప్పారు. కాబా విడుదల చేస్తున్నది షార్ట్ వేవ్ రేడియేషన్. వారు ఈ రేడియేషన్‌ను కనుగొన్నప్పుడు, దానిని పెద్దదిగా కనిపించేలా జూమ్ చేయడం ప్రారంభించారు. మరియు అది మక్కా నుండి ప్రసరించబడుతుందని, ఇంకా ఖచ్చితంగా (చెప్పాలంటే) 'కాబా' మస్జిద్ నుండి.

యాంకర్ : వల్లాహ్!

డా॥ అబ్దుల్ బాసిత్ : అలా చెప్పబడింది!

యాంకర్ : ఈ రేడియేషన్ ఏదైనా ప్రభావం కలిగి ఉందా?

డా॥ అబ్దుల్ బాసిత్ : వారు కనుగొన్న ఆ రేడియేషన్ infinite (అనంతం). వారు మార్స్‌ను చేరి ఫొటోలు తీసినప్పుడు ఆ రేడియేషన్ దానిని దాటుకుని వెళుతున్నట్లు కనుగొన్నారు. వారు చెప్పారు దాని తరంగదైర్ఘ్యం (వేవ్ లెంగ్త్) తెలుసునని లేక తరంగదైర్ఘ్యం యొక్క షార్ట్‌నెస్ తమకు తెలుసని.

ఈ రేడియేషన్‌కు ఒక ప్రత్యేక లక్షణముంది. ఇది అనంతం. మరియు నేను నమ్ముతున్నది ఏమిటంటే, ఆ రేడియేషన్ (భూమి మీది 'కాబా' మస్జిద్‌ను) ఆకాశాల పైన ఉండే 'కాబా'తో కలుపుతుందని.

**(మిగతా భాగం కొరకు 39వ పేజీ చూడండి)**

పేదల, బంధువుల, బాటసారుల ... హక్కు

# జకాత్



## అభ్యంతరకర వ్యాఖ్యలతో కొందరి తిరస్కారం

**"మదరసాలకు, దావా సంస్థలకు, దాయీలకు, సొసైటీలకు, జీతాల చెల్లింపు కొరకు, లైబ్రరీలకు, మస్జిద్‌లకు, టి.వి.ఛానళ్ళకు, పబ్లిషర్స్‌కు, పుస్తకాలకు మొదలైన వేటికొరకూ జకాత్ ఇవ్వకండి."**

**కేవలం పైన తెలిపిన 8 రకాల వ్యక్తులకు మాత్రమే జకాత్ ఇవ్వాలి.**

(అంటే ఖుర్'ఆన్ 9:60 ఆయత్ లో చెప్పబడిన 8 రకాల వ్యక్తులు)

జూన్-జూలై, 2011 శాంతిబాట సంచిక వెనుక అట్టపై ఉన్న పై గమనికపై కొందరు చాలా విపరీతంగా స్పందించారు.

ఖుర్'ఆన్ వాక్యం (9:60)లో 8 రకాల వ్యక్తులకు మాత్రమే జకాత్ ఇవ్వాలని చాలా స్పష్టంగా చెప్పబడింది. **మా గమనికలో కూడా మేము ఖుర్'ఆన్ చెప్పినట్లే తెలియజేశాము.**

కాని అల్లాహ్ మాటను పెడచెవిన పెట్టి, ఆ 8 రకాల వ్యక్తులకు కాకుండా, ఇతరులకే దాదాపు మొత్తం జకాత్‌ను పంచేస్తున్నారు. కాబట్టి ఆ ఇతరులకు ఇవ్వకండి అని మాత్రమే మేము చెప్పడం జరిగింది.

జకాత్ చెల్లించిన వారు తమ జకాత్ సవ్యంగా అందవలసిన వారికే అంది ఉంటుందని అనుకుంటారు. జకాత్ ఇవ్వకపోతే పడే శిక్ష నుండి తప్పించుకున్నామని అనుకుంటారు.

కాని అల్లాహ్ ఎవరికైతే జకాత్ ఇవ్వమన్నారో వారికి హక్కు అందలేదనే విషయం వారికి తెలియదు. జకాత్ ఇవ్వకపోతే తీర్పు దినం నాడు తీర్పు పూర్తయ్యేవరకూ జకాత్ ఇవ్వని వారి కొరకు ప్రత్యేకమైన కఠిన శిక్ష ఉంటుంది. ఆ రోజు ఇప్పటి 50,000 సంవత్సరాలకు సమానం.

జకాత్ ఇచ్చిన వారి సంపదను వృద్ధి చేస్తానని అల్లాహ్ వాగ్దానం చేశారు. **అల్లాహ్ వాగ్దానం సత్యమైనది.** మరి మీరు మీ జకాత్‌ను అల్లాహ్ చెప్పినవారికి కాకుండా, ఆయన మాటను కాదని ఇతరులకు ఇస్తే, మీ సంపద వృద్ధి పొందుతుందా?

కాబట్టి జకాత్ ఇచ్చే సోదరులకు సత్యాన్ని తెలిపి మేలు చేయాలనే సంకల్పంతో, అల్లాహ్ ప్రతీ ముస్లిమ్‌పై పెట్టిన బాధ్యత యైన '**మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడం**' అనే ఆదేశాన్ని మేము అమలు చేశాము. అల్లాహ్ ఆదేశంపై ఎటువంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే వారున్నారో పాఠకులకు తెలియజేయడం మా బాధ్యతగా భావించి వాటిని ఇక్కడ అందిస్తున్నాము.

క్రిందటి సంవత్సరం రమదాన్ నెలలో విడుదల చేసిన 'జకాత్ ప్రత్యేక సంచిక'లో కూడా **జకాత్ ఎవరికి ఇవ్వకూడదో** తెలిపాము. అప్పటి వ్యాసం కొరకు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, అబూదావూద్, తిర్మిజీ, నసాయీ, ఇబ్నెమాజా హదీస్ గ్రంథాలలో జకాత్ విషయంపై ఇచ్చిన **709** హదీస్‌లను బాగా అధ్యయనం చేసి ఓ వ్యాసాన్ని అందించాము.

| | గ్రంథం పేరు | హదీస్‌లు | పుస్తకం | అధ్యాయాలు | సంపుటి |
|---|---|---|---|---|---|
| 1. | సహీహ్ బుఖారీ | 118 | 24 | 78 | 2 |
| 2. | సహీహ్ ముస్లిమ్ | 232 | 12 | 55 | 3 |
| 3. | అబూదావూద్ | స. 59<br>హ. 45 | 9 | 46 | 2 |
| 4. | తిర్మిదీ | స. 30<br>హ. 16 | 5 | 38 | 2 |
| 5. | నసాయీ | స. 130<br>హ. 33 | 23 | 100 | 3 |
| 6. | ఇబ్నెమాజా | స. 26<br>హ. 20 | 8 | 28 | 3 |

**స.** - సహీహ్ (strong) **హ.** - హసన్ (good)

ఏదైనా ఒక విషయంపై స్పష్టంగా చెప్పాలనుకున్నప్పుడు, ఆ విషయం గురించి బోధించిన మొత్తం హదీస్‌లను అధ్యయనం చెయ్యాలి. కాబట్టి 6 హదీస్ గ్రంథాలలో జకాత్‌పై నున్న హదీస్‌లన్నింటిని చదివి క్రిందటి సంవత్సరమే ప్రత్యేక వ్యాసాన్ని అందించాము. ఎంత పెద్ద ఆలిమ్ అయినా సరే, హదీస్‌లను చదవకుండా, వాటికి వ్యతిరేకంగా వ్యక్తిగత అభిప్రాయం చెబితే అది స్వీకరించబడదు. **మేము అధ్యయనం చేసి వ్రాశాము. మా మాటలను ఖండించాలనుకునేవారు కూడా ముందుగా వాటిని అధ్యయనం చేసి మాట్లాడాలి.**

క్రిందటి సంవత్సరం ఎవరూ ఎటువంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదు. కారణం ఏమిటంటే, అప్పటికే జకాత్‌ను వాళ్ళలో వాళ్లు పంచేసుకున్నారు. ఇక వారికి వచ్చిన నష్టం ఏమీలేదు. ఈ సంవత్సరం కూడా మేము మరలా అవే విషయాలను తెలియజేస్తామని అప్పట్లో వారు ఊహించి ఉండరు. మే, 2011 సంచికలో కూడా 'రమదాన్' వ్యాసంలో ఈ విషయాలు చెప్పాము. అప్పుడు కూడా ఏమీ మాట్లాడలేదు. ఈ సారి స్పష్టంగా రంగులలో అట్టపై ప్రింట్ చేయడంతో కలవరపాటుకు గురయ్యారు. ఈ కలవరానికి కారణం సరిగ్గా జకాత్ ఇచ్చే సమయంలోనే ఈ పత్రిక ప్రజలకు అందింది.

శాంతిబాట చదివిన ముస్లిములు తమ పెద్దలను, ఆలిమ్‌లను, దాయీలను నిలదీస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక,

**"మీరు ఫత్వా ఎలా ఇస్తారు?"** అని మమ్మల్ని అడిగారు.

ఫత్వా అంటే ఏమిటో, దాని అవసరం ఎప్పుడొస్తుందో కనీస అవగాహన కూడా వారికి లేకుండా పోయింది. **'రమదాన్ నెలలో**

**ఉపవాసం ఉండండి**' అని చెబితే దానిని కూడా మేమిచ్చిన ఫత్వా అని అంటారేమో వీరు.

'**అబద్ధం చెప్పకండి**' అని వ్రాసినా, '**అల్లాహ్‌కు సాటి కల్పించకండి**' అని వ్రాసినా అది ఫత్వా అవ్వదు. ఖుర్'ఆన్‌లో స్పష్టంగా ఉన్న విషయాలను చెబితే వాటిని కూడా 'ఫత్వా' అని అనుకునేవారి జ్ఞానం ఏ స్థాయిలో ఉందో పాఠకులకు అర్థమై ఉంటుంది.

మనదేశంలో జకాత్‌ను ఇస్లామ్ నియమాల ప్రకారం సరిగ్గా వసూలు చేయడం లేదని మరియు వసూలైన సొమ్మును హక్కుదారులకు సరిగ్గా పంచడం లేదని ఆలిమ్‌లకు బాగా తెలుసు. మదరసాలలో బోధించే టీచర్లే తమ విద్యార్థులతో '**మదరసాలకు జకాత్ లేదు**' అని ధైర్యంగా అక్కడక్కడ చెబుతున్నారు. అల్లాహ్‌పై భయమున్నవారికే ఇలా చెప్పే ధైర్యం వస్తుంది. నిజాన్ని నిర్భయంగా మస్‌జిద్‌లలో చెప్పాలి. ప్రజలను చైతన్యవంతం చేయాలి. అప్పుడే మధ్యలో నున్న దళారీ వ్యవస్థ, పూజారి వ్యవస్థ రూపు లేకుండా పోతుంది.

సూరహ్ తౌబాలోని 60వ వాక్యంలో జకాత్ ఎవరెవరికి ఇవ్వాలో అంత స్పష్టంగా ఉన్నప్పటికీ, అల్లాహ్ చెప్పినవారు కాకుండా, ఇతరులు జకాత్‌ను ఎలా తీసుకో గలుగుతున్నారు? **ఏ విధంగా వారు ప్రజలను నమ్మించ గలిగారు?**

ఖుర్'ఆన్ చెప్పిన 8 కేటగిరిలలో ఏడింటిలో వీరెవరికి స్థానం లేదు. ఇక మిగిలినది ఒకే ఒక కేటగిరి. అదే '**అల్లాహ్ మార్గంలో**'. ప్రజలను నమ్మించడానికి దీనిని అడ్డం పెట్టుకున్నారు. తాము అల్లాహ్ మార్గంలో పనిచేస్తున్నామని చెబుతూ, జకాత్ సొమ్మును మదరసాలు, దావా సంస్థలు, దాయీలు, సొసైటీలు, లైబ్రరీలు, టి.వి.ఛానళ్ళు, పబ్లిషర్స్, పుస్తకాలు కొరకు ఇవ్వవచ్చు అని చెప్పి, **ఎన్నో సంవత్సరాల నుండి పేదల హక్కును వీరే దోచేస్తున్నారు.**

పేదల హక్కును ఈ విధంగా అధర్మంగా దోచుకు తింటుంటే ఎందుకు ఎవరూ నిలదీయరు? ఎందుకు భయపడుతున్నారు? ఇస్లామ్‌లో అతి ముఖ్య అంశమైన 'జకాత్' విషయంలో ఖుర్'ఆన్‌కు వ్యతిరేకంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?

**ఖుర్'ఆన్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించడం సత్య తిరస్కారం కాదా? ఎన్నో సంవత్సరాల నుండి పేదలకు అందవలసిన సొమ్మును దోచుకు తింటుంటే, మనదేశ ఆలిమ్‌లు ఎందుకు మౌనంగా ఉన్నారు? అల్లాహ్ అంటే భయం లేదా?**

ఇక దాయీలు, తమ గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటున్నారంటే, వీరు తమ జీవితాలను త్యాగం చేసేసి, ఊర్లకు ఊర్లు తిరిగేసి ధర్మం గురించి బోధించేస్తున్నారట. అందుకని వారు అల్లాహ్ మార్గంలో పోయేవారు కనుక వారు జకాత్‌కు అర్హులు అని నమ్మబలుకుతున్నారు.

శాంతిబాట పాఠకులకు దాయీల భాగోతం బాగా తెలుసు. 'దావత్' అంటే అల్లాహ్ మార్గం వైపు పిలవడం. ఇది ప్రతీ ముస్లిమ్‌పై అల్లాహ్ పెట్టిన బాధ్యత. నమాజ్ ఎవరిపై బాధ్యతగా ఉందో, వారిపై దావత్ కూడా బాధ్యతగా ఉంది. **ఎవరికి ఎంత శక్తి ఉందో, ఎవరికి ఎంత సమయం ఉందో అల్లాహ్‌కు బాగా తెలుసు. ఆయన సర్వజ్ఞాని.** కాబట్టి తన శక్తికి మరియు సమయానికి తగ్గట్టుగా ప్రతీ ముస్లిమ్ ప్రజలకు అల్లాహ్ మార్గం గురించి తెలియజేయాలి.

గుడిసెలో ఉండే పేదవాడు, ఆకలి వేసినప్పుడు తనకు సరిపోయే చిన్న కాకా హెూటల్‌కి వెళ్ళి భోంచేస్తాడుగాని, అందరి దగ్గరా చందా అడిగి ఫైవ్ స్టార్ హెూటల్‌కి వెళ్ళి భోం చేస్తాడా? అంత అవసరం ఆ పేదవానికి లేదు.

**ఎంత చెట్టుకు అంత గాలి! ఎవరికి ఎంత వీలైతే అంతే చేస్తారు.**

నమాజ్ చేయడం ఎలా వృత్తికాదో 'దావత్' చేయడం అదే విధంగా వృత్తి కాదు. దాయీలకు, దావా ప్రోగ్రామ్‌ల కొరకు 'జకాత్' సొమ్మును ఉపయోగించ కూడదనే నిజం ప్రజలకు తెలియ జేసామని, అది చదివి భరించలేక, వాటి ద్వారా ఐశ్వర్యాన్ని పెంచు కుంటున్న కొందరు, తమ నాయకులను రెచ్చగొడుతున్నారు.

దావాను ఒక వృత్తిగానూ, వ్యాపారంగానూ మార్చేసారు. కొంతకాలానికి **"మీరు నమాజ్‌లు చేయనవసరం లేదు, మీ బదులు మేము చేసేస్తాము, అందుకొరకు డబ్బులివ్వండి"** అని చెప్పే '**నమాజ్ సంస్థలు**' కూడా మొదలౌతాయేమోనని అనుమానం వస్తుంది.

దాయీలు చెప్పే తెలివైన సాకు ఏమిటంటే, పల్లెటూర్లలో తెలుగు మాట్లాడే పేద ముస్లిములు ఇతర మతాలలోకి మారిపోతున్నారట. అందుకని వీరు వెళ్ళి అక్కడ బోధించి వారిని ఇతర ధర్మాలలోకి మారకుండా ఆపుతున్నారట. అందుకొరకు డబ్బు కావాలిట.

**పేదముస్లిములకు సహాయం చెయ్యమని అల్లాహ్ ఆదేశించి, జకాత్ వంటి కార్యక్రమాల ద్వారా వారికి మేలు చేయమని చెబితే పేదవారికి అందవలసిన ఆ జకాత్‌ను పూర్తిగా తినేసి, వారి దగ్గరకు ఖాళీ చేతులతో వెళ్ళి ధర్మాన్ని బోధిస్తున్నారా?**

పై విధంగా చేయకుండా, జకాత్ సొమ్మును ఆ పేదవారి దగ్గరకు తీసుకువెళ్ళి, "**అల్లాహ్ ఆదేశించినట్లుగా పేదవారైన మీకు ఈ సొమ్మును అందజేస్తున్నాము. అంతేగాని మీ నుండి మేము ఏ ప్రతిఫలాన్ని కోరడం లేదు. ఇది మా సంపదలో అల్లాహ్ ఉంచిన మీ హక్కు. ఇది మీదే.**" అని వారికి చెబితే అల్లాహ్ తమ కోసం ఎంత చక్కటి వ్యవస్థ ఏర్పాటు చేశారో తెలుసుకుని, అల్లాహ్ గురించి ఇంకా తెలుసుకోవాలని **వారే స్వయంగా అడుగుతారు.**

కొందరు ఇలా అంటున్నారు, "మా ఊరిలో పేదవారు లేరు, మా ప్రక్క ఊరిలోనే కాదు, మా చుట్టుపక్కల 15 ఊర్లలో పేదవారే లేరు". మనదేశంలో ఇంతకంటే పెద్ద జోక్ వినడానికి మరొకటి దొరకదు. ఇంటింటికి వెళ్ళి సర్వే చేశారా? ముస్లిమ్ నాయకుడు (అమీర్) తన ఏరియాలో ఎవరెవరి ఆర్థిక స్థాయి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఎప్పుడైనా ఆ ప్రయత్నం చేశారా? నేటి అమీర్లకు తమపై ఎటువంటి బాధ్యతలున్నాయో కూడా తెలియదు.

కొందరు ఇలా కూడా అంటున్నారు : '**కొందరు ముస్లిములు పేదవారే అయినప్పటికీ వారు షిర్క్ చేస్తున్నారు కాబట్టి వారికి ఇవ్వకూడదు**

**కదా!**' (అంటే వారు వేరే జమాత్‌కు చెందినవారు). విగ్రహారాధన చేసేవారికి జకాత్ ఇవ్వకూడదు. **కాని వారికి కూడా ఇతర దానాలేమైనా ఇవ్వవచ్చు**. విగ్రహారాధన చేయకుండా, అల్లాహ్‌ను తిరస్కరించకుండా ఉండే ఏ ముస్లిమ్‌కైనా జకాత్ ఇవ్వవచ్చు. షిర్క్‌లో చాలా రకాలున్నాయి. శాంతిబాటలో ముష్రిక్ అనే వ్యాసంలో షిర్క్ గురించి పూర్తి వివరాలు అందజేసాము. ఫలానా ఆలిమ్‌గారు దు'ఆ చదివితేనే నాకు మేలు జరుగుతుంది అనుకోవడం ఏమవుతుంది? ఏదైనా కష్టమొస్తే ముందుగా అల్లాహ్‌ను వేడుకోకుండా ఇతరుల సహాయం గురించి ఆలోచించేవారు షిర్క్ చేస్తున్నట్లు కాదా?

**ముఖ్య విషయం :** జకాత్ ఎవరెవరికి ఇవ్వాలో ఖుర్'ఆన్ అంత స్పష్టంగా చెప్పినప్పటికీ, హదీస్‌ల ద్వారా సత్యాన్ని తెలుసు కున్నప్పటికీ, వితండవాదం చేస్తూ **ఖుర్'ఆన్ వాక్యాన్ని కూడా తిరస్కరిస్తున్న** దాయీలు జకాత్ తీసుకోవడానికి స్వయంగా తాము అర్హులమని ప్రకటించు కోగలిగినప్పుడు, షిర్క్ చేసే ముస్లిములకు ఇవ్వడంలో మాత్రం వీరికి అభ్యంతరం ఎందుకు కలిగింది? వీరు ఖుర్'ఆన్ వాక్యాన్ని తిరస్కరిస్తున్నారు. వారు షిర్క్ చేస్తున్నారు. **ఇద్దరికీ తేడా ఏముంది?**

**అర్హత లేకపోయినా ఎన్నాళ్ళ నుండో జకాత్ తీసుకోవడానికి అలవాటు పడిపోయిన వారికి సత్యం చెబితే తిరస్కరించినప్పుడు, ఎన్నాళ్ళ నుండో షిర్క్‌కు అలవాటుపడినవారు సత్యం చెప్పగానే వెంటనే స్వీకరించలేదని వారిని ఎలా విమర్శించగలుగు తున్నారు?**

దాయీలు ధర్మాన్ని బోధించడం కాదు, ముస్లిముల ఐక్యతను చెడగొడు తున్నారు. ఇతర ధర్మాల వారిని ఇస్లామ్ వైపు పిలుస్తున్నామని చెబుతూ, వేరే జమాత్‌లకు సంబంధించిన వారిని మాత్రం శత్రువులుగా చూడటాన్ని బట్టి, వారు ముస్లిమ్ సమాజానికి ఎంత చేటు చేస్తున్నారో ఇప్పటికైనా తెలుసుకోండి. ఏ జమాత్ అయినా అందరికీ ఖుర్'ఆన్ ఒక్కటే! దాని ప్రకారమే అందరి ఆచరణ ఉండాలి. అందరికీ రసూలుల్లాహ్ ఒక్కరే! ఆయన(స)ను అందరూ ప్రేమించాలి.

నఫిల్ ఆరాధనల విషయంలోనూ మరియు కొన్ని సూక్ష్మ విషయాల్లోనూ ఎప్పుడూ కొట్టుకునే జమాత్‌లు, ఖుర్'ఆన్ ఆచరణకు దూరంగా ఉండే విషయంలో మాత్రం తామంతా ఒకటే అని నిరూపించు కుంటున్నాయి. ముందుగా సూక్ష్మ బేధాలను వదిలేయాలి. అందరూ ఖుర్'ఆన్ ప్రకారం ఆచరించాలి. ఆ విధంగా జరగకుండా చేస్తూ ముస్లిముల ఐక్యతను చెడగొట్టే దళారీలను మన మధ్యనుండి తొలగించాలి.

**ఇస్లామ్‌లో పూజారి వ్యవస్థ, దళారీ వ్యవస్థ లేదు.**

సరే! కొందరు ముస్లిమ్‌లు షిర్క్ చేస్తున్నారు. నిజమే! వారికి అల్లాహ్ గురించి తెలియదు. అంతేకాకుండా వారు పేద ముస్లిములు. వారి దగ్గరకు వెళ్ళి జకాత్ ఇచ్చి, వారి కష్టాలను పంచుకుని మీకు మేమున్నామనే భరోసా ఇస్తే, ఇన్షా అల్లాహ్ వారు షిర్క్ వదిలేయ వచ్చు. ఆ విధంగా చేయకుండా వారి హక్కును దోచేసి వారినే విమర్శించడం సమంజసమా?

ఇస్లామ్‌లో అతి ముఖ్యమైన 'జకాత్' ఎవరికి ఇవ్వాలో చెప్పలేని వారు ధర్మం గురించి బోధించడమా? ముస్లిమ్ సమాజం ఏ స్థితిలో ఉంది.

లక్షలు ఖర్చు చేసి దావా ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేసి, స్టేజి మీదికి ఒకరో ఇద్దర్నో పిలిపించి, ఆ ప్రోగ్రామ్‌లో దాయీ గారి ప్రసంగం వల్లనే ఇస్లామ్ స్వీకరించారని పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తున్నారు. **కొండను తవ్వి ఎలకను పడుతున్నారు.** ఆ రోజుల్లోనే ఎన్నో సంస్కృతులకు నిలయమైన ఈజిప్టు వంటి దేశంలో, అది ముస్లిముల వశమయ్యాక అతి తక్కువ కాలంలో మొత్తం ప్రజలు ఇస్లామ్ స్వీకరించారు. ఒకరో ఇద్దరో కాదు, ఏకంగా **ఒక దేశమే ముస్లిమ్ దేశంగా మారిపోయింది**. కారణం ప్రసంగాలు కాదు. ఆయుధాలూ కాదు. ముస్లిముల ప్రవర్తనే. వారి నిరాడంబరత, నిజాయితీ, మంచితనాన్ని చూచి వారు ఇస్లామ్ వైపు ఆకర్షితులయ్యారు.

జ్ఞానం ఉండి ఇస్లామ్ ప్రకారం ఆచరించేవారు కనీసం కొద్ది మంది ఉన్నా, వారిని చూచి ఇతరులు ఇస్లామ్‌వైపు ఆకర్షింప బడతారు. మెజారిటీ ముస్లిములకు తమ ఆచరణ ఏయే సందర్భాలలో ఎలా ఉండాలో తెలియదు. శుక్రవారం ఖుత్బాలలో అటువంటివి చెప్పి మన తోటి సోదరులకు ప్రవక్త(స)వారి ఆచరణను అలవాటు చేయడానికి ప్రయత్నించాలి.

ఇతర ధర్మాల వారిచే కలిమా చదివించేసాము అని గొప్పగా చెప్పుకునేవారు, షిర్క్ చేసే ముస్లిములు కూడా కలిమా చదివిన వారేనని ముందుగా తెలుసుకోవాలి. వారు ఎంతమాత్రం శత్రువులు కాదు. వారిని ప్రేమగా, ఆప్యాయంగా పలకరించి వారిలో మార్పు రావడం కోసం ప్రయత్నించాలి. కాని వారి విషయంలో మాత్రం శత్రుత్వం వహిస్తూ, మునాఫిక్ (కపట విశ్వాసు)ల దుర్మార్గానికి మాత్రం ఆర్థికంగా సహకరిస్తున్నారు. వారిని నిలదీయడం లేదు.

## సూటి ప్రశ్న

1. 'అల్లాహ్ మార్గంలో' అనే కేటగిరిలోని వ్యక్తులు కేవలం 'ముజాహిద్ మరియు హజ్జ్ చేసేవారు' మాత్రమే అని మేము ప్రామాణిక ఆధారాల ద్వారా చెప్పాము. ఆ ఆధారాలను కూడా అందించాము.
2. **మేము ఎవరికైతే ఇవ్వవద్దని చెప్పామో**, అటువంటి వారు కూడా జకాత్ స్వీకరించడానికి అర్హులేనని జకాత్‌ను లాగేసుకునే కొందరు పెద్దలు చెబుతున్నారు.

**పై రెండింటిలో ఏది నిజం?** అని మీకు సందేహం వచ్చినప్పుడు మీరేమి చేయాలి?

ఈ విషయంపై ముహమ్మద్(స)వారి బోధనలలో ఏమి చెప్పబడిందో వెతకాలి. ముఖ్యంగా అందుబాటులో ఉండే హదీస్ గ్రంథాలలో చూడాలి. వీటిలో కొన్ని ఖుర్'ఆన్ వాక్యాలకు వివరణలున్నాయి. ఉదాహరణకు సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథం 9 సంపుటాలు (volumes)గా ఉంది. వాటిలోని 6వ సంపుటి పూర్తిగా ఖుర్'ఆన్ వ్యాక్యాల తఫ్సీర్‌కు సంబంధించిన హదీస్‌లను మాత్రమే కలిగి ఉంది.

వాటిని మీరు చదివితే **నిజం స్పష్టం అవుతుంది.**

ఈ హదీస్‌లను ఉదాహరిస్తూ ఎన్నో ఖుర్ఆన్ తఫ్సీర్ గ్రంథాలు కూడా ఉన్నాయి. తఫ్సీర్ గ్రంథం అనగానే వెంటనే జ్ఞాపకం వచ్చేది 'తఫ్సీర్ ఇబ్నె కసీర్'. ఈ గ్రంథం చాలా చోట్ల అందుబాటులోనే ఉంటుంది. ఒక్కసారి 9వ సూరహ్ 60వ వాక్యంలోని 'అల్లాహ్ మార్గంలో (ఫీ సబీలిల్లాహ్)' ఏ వ్యక్తుల గురించి ఆ గ్రంథంలో ఏమి చెప్పబడిందో చదవండి. లేదా మీ ఆలిమ్‌నుగాని, మీ ఇమామ్‌ను గాని కూర్చోబెట్టి చదివి వినిపించ మనండి.

**సత్యాన్ని తెలుసుకున్నాక కూడా ఎవరో ఏదో చెప్పేయగానే గుడ్డిగా నమ్మేయడమేనా? ఆలోచించరా?**

దాయీలు ధర్మాన్ని బోధిస్తున్నారు కాబట్టి వారు అల్లాహ్ మార్గంలో పోయేవారేనని నమ్మించారు. మదరసాలలో జ్ఞానం నేర్పించబడుతుంది కాబట్టి అది కూడా అల్లాహ్ మార్గమేనని చెబుతున్నారు. దావా ప్రోగ్రామ్‌లు కూడా అల్లాహ్ మార్గానికి చెందినవేనని సమర్థించు కుంటున్నారు.

సరే! ఆ విధంగా వారు సమర్థించుకుంటే అల్లాహ్ మార్గంలో కానివి ఇక ఏమి మిగిలి ఉన్నాయి? మీరు సమర్థిస్తున్నది నిజమే అనుకుంటే, క్రింది హదీస్ ప్రకారం రమదాన్ నెలలో ఉపవాసముండటం కూడా అల్లాహ్ మార్గమే!

"అబూ సఈ'ద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను : "ఎవరైతే **అల్లాహ్ మార్గంలో** (ఫీ సబీలిల్లాహ్) ఒక రోజు సౌమ్ (ఉపవాసం) ఉంటారో, అల్లాహ్ అతని ముఖం నుండి నరకాగ్నిని 70 వసంతాల దూరంగా ఉంచుతాడు" **(సహీహ్ బుఖారీ, 2840, పుస్తకం 56, అధ్యా.36, సంపుటి 4)**

అంతేకాకుండా,

- పేదవానికి సహాయం చేయడం - **అల్లాహ్ మార్గమే**
- బాటసారికి సహాయం చేయడం - **అల్లాహ్ మార్గమే**
- అప్పులపాలైనవారికి సహాయం చేయడం - **అల్లాహ్ మార్గమే**
- బానిసల విముక్తి కూడా - **అల్లాహ్ మార్గమే**

మీరు సమర్థించే దాని ప్రకారం అల్లాహ్ చెప్పిన 8 కేటగిరిలలో ఉన్న ప్రతీ కేటగిరి కూడా **అల్లాహ్ మార్గం** క్రిందికే వస్తుంది. అటువంటప్పుడు **7వ కేటగిరిలో మరలా 'అల్లాహ్ మార్గంలో' అని ప్రత్యేకంగా ఎందుకు చెప్పడం జరిగింది?** అంతేకాకుండా, **కేవలం** ఆ ఆయత్‌లో చెప్పినవారికి మాత్రమే జకాత్ చెల్లించమన్నారు. **అంటే వారికి తప్ప ఇతరులకు జకాత్ ఇవ్వకూడదు.** అటువంటప్పుడు, **వారెవరో స్పష్టంగా తెలుసుకోవాలి కదా!**

"వారు ఎవరై ఉంటారోనని" మాపై విరుచుకు పడినవారు ఎప్పుడైనా ఆలోచించారా? లేక ఆలోచనా శక్తి కోల్పోయారా?ఈ విషయం సామాన్యులకు చెబితేనే వారిలో ఆలోచన మొదలౌతుంది కదా! మరి ధర్మబోధ చేసేస్తున్నాము అని భ్రమపడేవారికి అటువంటి ఆలోచన ఎందుకు రాలేదు?

మాటిమాటికి పఠించబడే 'ఖుర్ఆన్'ను, ఈ బోధకులు చదవడం మానివేశారా? సూరహ్ తౌబాలోని 60వ వాక్యం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అర్థాలను చెబుతున్నారు గాని కనీసం ఆ సూరహ్ తౌబా ఒక్కసారైనా పూర్తిగా అరబీలో చదివి ఉంటే, **ఫీసబీలిల్లాహ్ (అల్లాహ్ మార్గంలో)** అనే పదాలు ఆ సూరహ్‌లోనే మరో 8 చోట్ల ఉన్నాయనే విషయం తెలిసుండేది.

ఈ 60వ ఆయత్‌కు ముందు 5 చోట్ల, ఈ ఆయత్‌కు తరువాత 3 చోట్ల **'ఫీ సబీలిల్లాహ్'** పదాలను కలిగిన ఆయత్‌లు ఉన్నాయి. అంటే మొత్తం 9వ సూరహ్‌లో 'అల్లాహ్ మార్గంలో' అనే పదాలు 9 ఆయత్‌లలో ఉన్నాయి. అవి :

"…. **అల్లాహ్ మార్గంలో పోరాడే** దానికి సమానంగా భావిస్తున్నారా …." (9:19)

"విశ్వసించి, **అల్లాహ్ మార్గంలో వలసపోయిన వారికీ** మరియు **తమ ధన సంపత్తులను ప్రాణాలను వినియోగించి పోరాడిన వారికీ**, …." (9:20)

"ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, చాలామంది అహ్‌బారులు మరియు రుహ్‌బానులు ప్రజల సొత్తును అక్రమ పద్ధతుల ద్వారా తినివేస్తున్నారు మరియు వారిని **అల్లాహ్ మార్గం** నుండి ఆటంక పరుస్తున్నారు. మరియు ఎవరైతే వెండి బంగారాన్ని కూడబెట్టి, దానిని **అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టరో** వారికి బాధాకరమైన శిక్ష గలదనే వార్తను వినిపించు" (9:34)

**(అహ్‌బారులు, రుహ్‌బానులు ఇతర ధర్మాలకు చెందినవారు. నేడు ముస్లిమ్ సమాజంలో కూడా అదే విధంగా ప్రజల సొత్తును ఎవరు తినివేస్తున్నారో వ్యాసం చదవడం పూర్తయ్యాక మీకే తెలుస్తుంది.)**

"ఓ విశ్వాసులారా! మీకేమయింది? మీతో : **"అల్లాహ్ మార్గంలో బయలుదేరండి"** అని చెప్పినప్పుడు మీరు భూమిలోకి అతుక్కొని పోతున్నారేమిటి? …." (9:38)

"తేలికగానైనా సరే, లేక బరువుగానైనా సరే బయలుదేరండి. మరియు **మీ సంపదలతో మరియు మీ ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడండి.** ఒకవేళ మీరిది తెలుసుకోగలిగితే ఇది మీకెంతో ఉత్తమ మైనది." (9:41)

"… మరియు వారు తమ ధన సంపత్తులతో మరియు తమ ప్రాణాలతో **అల్లాహ్ మార్గంలో పోరాడటాన్ని** అసహ్యించుకున్నారు …" (9:81)

"… వారు **అల్లాహ్ మార్గంలో పోరాడి** చంపుతారు మరియు చంప బడతారు …" (9:111)

"… ఎందుకంటే **అల్లాహ్ మార్గంలో** వారు ఆకలి దప్పులు, కష్టాలు సహిస్తే, శత్రువుల భూమిలోకి దూరి సత్య తిరస్కారుల కోపాన్ని రేకెత్తిస్తే, మరియు శత్రువుల నుండి ఏదైనా సాధిస్తే, …." (9:120)

పై ఆయత్‌లలో 'అల్లాహ్ మార్గంలో' ఉన్నవారు 3 రకాల వ్యక్తులు.

1. ధర్మ పోరాటం (యుద్ధం) చేసేవారు
2. అణిచివేతలకు, హింసకు గురై సర్వం వదిలేసుకుని, అల్లాహ్ కోసం వలస (హిజ్రత్) చేసినవారు
3. ధర్మ పోరాటం కోసం సంపదను ఖర్చు చేసేవారు.

పై మూడు రకాల వ్యక్తులలో ఖర్చుపెట్టేవారికి జకాత్ ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే వారి దగ్గర ధనం ఉంది. వారు ఖర్చు పెడుతున్నారు.

అన్నీ వదులుకుని వలస వచ్చిన వారికి ఇవ్వవచ్చు. ఎందుకంటే వారి దగ్గర ఏమీ లేదు కాబట్టి వారు పేదవారి కేటగిరిలోకే వస్తారు.

ఇక మిగిలింది 'ధర్మ పోరాటం చేసే ముజాహిద్‌లు'. వీరికి **'అల్లాహ్ మార్గంలో'** కేటగిరి ప్రకారం జకాత్ ఇవ్వాలి.

**మేము చెప్పింది కూడా ఇదే కదా!**

ఇంత చెప్పినా కూడా వితండవాదులు సత్యాన్ని స్వీకరించక పోవచ్చు. అందుకని ఖుర్‌ఆన్ మొత్తంలో **'ఫీ సబీలిల్లాహ్'** అనే పదాలు ఏయే సూరహ్‌లలో ఉన్నాయో వెతికి దిగువున అందిస్తున్నాము.

పూర్తి ఖుర్‌ఆన్‌లో మేము 43 ఆయత్‌లలో 'ఫీ సబీలిల్లాహ్' అనే పదాలను గమనించాము. వాటిలోని 9 ఆయత్‌లను ఇప్పటికే తెలియజేశాము. మిగిలిన 34 ఆయత్‌లు (క్లుప్తంగా) :

"మరియు **అల్లాహ్ మార్గంలో** చంపబడిన వారిని 'మృతులు' అనకండి!" (2:154)

"మరియు మీతో, పోరాడేవారితో, మీరు **అల్లాహ్ మార్గంలో పోరాడండి**" (2:190)

"మరియు **అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి.**" (2:195)

"... మరియు **అల్లాహ్ మార్గంలో ధర్మపోరాటం చేసేవారు.**" (2:218)

"మరియు మీరు **అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి.**" (2:244)

"... అలాంటప్పుడు మేము **అల్లాహ్ మార్గంలో ఎందుకు యుద్ధం చేయము** అని జవాబిచ్చారు." (2:246)

"**అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసేవారి** ఉపమానం ..." (2:261)

"ఎవరైతే **అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయం చేసి** ..." (2:262)

"... ఒక వర్గం **అల్లాహ్ మార్గంలో పోరాడేది**" (3:13)

"... **అల్లాహ్ మార్గంలో** ఎదురైన కష్టాలకు వారు ధైర్యం విడువ లేదు" (3:146)

"మరియు మీరు **అల్లాహ్ మార్గంలో చంపబడినా లేదా మరణించినా** మీకు లభించే అల్లాహ్ క్షమాభిక్ష మరియు కారుణ్యం నిశ్చయంగా మీరు కూడబెట్టిన వాటన్నింటికంటే ఎంతో ఉత్తమమైనది" (3:157)

"రండి **అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి...**" (3:167)

"మరియు **అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులుగా భావించకండి**" (3:169)

"కావున ఇహలోక జీవితాన్ని పరలోక జీవితానికి బదులుగా అమ్మినవారు, **అల్లాహ్ మార్గంలో పోరాడాలి**. అల్లాహ్ మార్గంలో పోరాడినవాడు, చంపబడినా లేదా విజేయుడైనా, మేము తప్పకుండా అతనికి గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదించగలము. (4:74)

"మరియు మీకేమయింది, మీరెందుకు **అల్లాహ్ మార్గంలో** మరియు అస్సహాయులై అణచివేయబడిన పురుషుల, స్త్రీల మరియు పిల్లల కొరకు పోరాటడం లేదు? (4:75)

"విశ్వసించినవారు **అల్లాహ్ మార్గంలో పోరాడుతారు...**" (4:76)

"కావున నీవు **అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యి**" (4:84)

"కావున **అల్లాహ్ మార్గంలో వారు వలసపోయేంత వరకు**" (4:89)

"ఓ విశ్వాసులారా! మీరు **అల్లాహ్ మార్గంలో** బయలుదేరినప్పుడు వివేచనతో వ్యవహరించండి." (4:94)

"**అల్లాహ్ మార్గంలో** తమ ధనాన్ని మరియు తమ ప్రాణాన్ని వినియోగించి ధర్మ యుద్ధం చేసే విశ్వాసులతో సరిసమానులు కాజాలరు." (4:95)

"మరియు **అల్లాహ్ మార్గంలో వలస పోయేవాడు**" (4:100)

"మరియు మీరు మీ శక్తి మేరకు బలసామాగ్రిని, యుద్ధపు గుర్రాలను సిద్ధపరచుకుని, దాని ద్వారా అల్లాహ్‌కు శత్రువులైన మీ శత్రువులను మరియు అల్లాహ్‌కు తెలిసి, మీకు తెలియని ఇతరులను కూడా భయ కంపితులుగా చేయండి. మరియు **అల్లాహ్ మార్గంలో మీరు ఏమి ఖర్చు చేసినా దాని ఫలితం** మీకు పూర్తిగా చెల్లించబడుతుంది. మరియు మీకెలాంటి అన్యాయం జరుగదు." (8:60)

"**నిశ్చయంగా, విశ్వసించి వలసపోయే వారూ మరియు తమ సంపద మరియు ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారూ ...**" (8:72)

"మరియు ఎవరైతే విశ్వసించి వలసపోయి **అల్లాహ్ మార్గంలో పోరాడారో** వారూ ..." (8:74)

"ఎవరు **అల్లాహ్ మార్గంలో** తమ ఇండ్లను వదలిపోయి, ఆ తరువాత చంపబడతారో లేదా మరణిస్తారో, ...." (22:58)

"మరియు మీలో (అల్లాహ్) అనుగ్రహం మరియు సమృద్ధిగా (సంపదలు) గలవారు, తమ బంధువులకు, పేదలకు, **అల్లాహ్ మార్గంలో వలస (హిజ్రత్) పోయేవారికి** ..." (24:22)

"... మరియు ఎవరైతే **అల్లాహ్ మార్గంలో చంపబడ్డారో,** అలాంటి వారి కర్మలను ఆయన వ్యర్థం చేయడు." (47:4)

"ఇదిగో చూడండి! వారు మీరే! **అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండని పిలువబడుతున్నవారు** ..." (47:38)

"వాస్తవానికి, ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించి, ఆ తరువాత ఏ అనుమానానికీ లోనుకాకుండా, **అల్లాహ్ మార్గంలో, తమ సిరిసంపదలతో మరియు ప్రాణాలతో పోరాడుతారో!**" (49:15)

"మరియు మీకేమయింది? మీరెందుకు **అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం లేదు?** ఆకాశాలు మరియు భూమి యొక్క వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. (మక్కా) విజయానికి ముందు ఖర్చు పెట్టిన వారితో మరియు పోరాడిన వారితో ..." (57:10)

"మీరు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించడం మరియు **అల్లాహ్ మార్గంలో మీ సంపదలను మరియు మీ ప్రాణాలను వినియోగించి పోరాడటం**, మీరు తెలుసుకుంటే! ఇదే మీకు ఎంతో మేలైనది" (61:11)

"... మరికొందరు **అల్లాహ్ మార్గంలో ధర్మయుద్ధం చేస్తూ** ఉండవచ్చు." (73:20)

**అల్లాహ్ మార్గానికి సంబంధించి మరో 2 ఆయత్‌లు మిగిలి ఉన్నాయి. ఈ రెండింటిని ప్రత్యేకంగా చెప్పవలసి ఉంది.**

**"అల్లాహ్ మార్గంలో నిమగ్నులైన కారణంగా భూమిలో తిరిగే అవకాశం లేక లేమికి గురిఅయ్యే పేదవారు ..."** (2:273)

'అల్లాహ్ మార్గంలో' అంటే ఎవరో ఇప్పటికే స్పష్టం అయింది. ఈ ఆయత్‌లో కూడా 'అల్లాహ్ మార్గంలో' నిమగ్నులైనవారు కూడా ముజాహిద్‌లే. ఈ సందర్భంగా అబూజర్(రజి)వారి జీవితంలోని ఓ సంఘటన ఒకటి ఇక్కడ గుర్తు చేస్తున్నాము.

ఇస్లామీయ సామ్రాజ్యం ఉత్తరం వైపునున్న రోమన్ల నుండి ముస్లిములకు ప్రమాదముంది. అది వేసవికాలం. ఎడారి ప్రాంతాలలో వేసవి కాలం ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంటిలో నుండి బయటకు రావాలంటే చాలా కష్టమైన విషయం.

ప్రవక్త(స)వారు తన అనుచరులను తబూక్ ప్రయాణానికి సిద్ధం కమ్మన్నారు. అది చాలామందికి కష్టమైన పని. రోమన్లను నిరుత్సాహ పరచడానికి సైన్యం అంతా సిద్ధం చేసుకుంటుంది. ఆ సంవత్సరం పంటల దిగుబడి లేదు. వనరులు విపత్కరమైన పరిస్థితులలో ఉన్నాయి. అయినప్పటికీ ముస్లిములు తమ శాయశక్తులా ప్రయాణానికి సిద్ధపడుతున్నారు.

అబూజర్(రజి) చాలా పేదవారు. సైన్యంతో పాటు వెళ్ళడానికి ఆయన దగ్గర ఓ గుఱ్ఱంగాని ఒంటెగాని లేదు. అబూజర్(రజి)వారి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. సైన్యంతోపాటు వెళ్ళడానికి తనకు ఓ గుఱ్ఱాన్ని గాని లేదా ఒంటెనుగాని కలుగజేయమని ప్రవక్త(స)వారిని అడిగారు.

ఈయనకు ఇవ్వడానికి గుఱ్ఱంగాని, ఒంటెగాని ప్రవక్త(స)వారి దగ్గర అదనంగా లేదు. ఏమి చేయాలో అబూజర్(రజి)వారికి తోచలేదు. సైన్యం మదీనాను వదిలి వెళ్ళిపోయింది. అబూజర్(రజి) వెనుకే ఉండిపోయారు.

సైన్యంతోపాటు వెళ్ళలేకపోయినందుకు అబూజర్ చాలా విచారంగా ఉన్నారు. కాస్సేపటికి ఎలాగైనా సైన్యాన్ని చేరుకోవాలని నిశ్చయించు కున్నారు.

ఆయన తన కత్తిని, డాలును తీసుకుని కాలి నడకన బయలుదేరారు. ఆ మండుటెండలో ఎడారిలో కాలినడకన వెళ్ళడానికి ఎవరైనా సాహసించ గలరా? నిజమే! అందరూ ఆ విధంగా సాహసించ లేరు. అల్లాహ్ ఆయన హృదయంలో అమోఘమైన 'ఈమాన్'ను ఉంచారు. ఆ విశ్వాసమే ఆయనను ఆ సాహసానికి పురిగొల్పింది. అబూజర్ విశ్వాసం ముందు ఎడారి వేడి పోటీ పడలేకపోయింది. విశ్వాసిదే విజయం అయింది.

తబూక్‌కు వెళుతున్న సైన్యం దారిలో ఓ చోట విశ్రాంతి కొరకు ఆగింది. ఆ వేడి ఎడారిలో ఎవరో వ్యక్తి తమవైపు వస్తున్నట్లు కొందరు ఆశ్చర్యంతో గమనించారు. దూరంలో ఎవరో తమను అనుసరిస్తున్నారని వారు ప్రవక్త(స)కి చెప్పారు. ప్రవక్త(స)వారికి అబూజర్(రజి) ప్రియమైనవారు.

ఇస్లామ్ కొరకు జరిగే ఏ కృషిలోనైనా తన భాగాన్ని అబూజర్(రజి) ఎన్నడూ వదులుకోరని, ఆయన తన విశ్వాసాన్ని స్వచ్ఛంగా ఉంచు కుంటారని ముహమ్మద్(స)వారికి తెలుసు.

ప్రవక్త(స)వారు అటు వైపు చూసి చెప్పారు : **'అది అబూజర్'.**

ప్రవక్త(స)వారి చుట్టూ ఉన్నవారు ఆశ్చర్యపోయారు. **సైన్యాన్ని చేరుకోవడానికి ఇంత దూరం ఎలా రాగలిగాడాయన!** ఆ వ్యక్తి సైన్యానికి చాలా సమీపంగా వచ్చారు. ఔను! ఆ వ్యక్తి మరెవరో కాదు అబూజర్ (రజి).

ఇస్లామ్ మరియు ముస్లిములకు మద్దతుగా ఆయన ఒంటరిగా నడిచి వచ్చారు. ఆయన పట్టుదలని మెచ్చుకొని ఆయనను నరకాగ్ని వేడి నుండి రక్షించమని ప్రవక్త(స)వారు అల్లాహ్‌ను వేడుకున్నారు.

**ఆయన పేదవారు కనుకనే అంతటి వేడిలో ఎడారిలో నడుచుకుని వెళ్ళారు. ఓ వాహనాన్ని కూడా కొనలేకపోయారు. ఆయన వెళ్ళింది పోరాటానికి మాత్రమే. తన స్వంతానికి కూడా కాదు. అటువంటి విశ్వాసికి తన జీవనోపాధి కోసం తిరగడానికి సమయం ఎక్కడుంది?**

అంతేకాకుండా ఆయన కానుకలను స్వీకరించలేదు. ఆత్మాభిమానం గల మనిషి ఆయన.

సల్మాన్ ఫార్సీ(రజి)వారు ఓ పెద్ద భూభాగానికి గవర్నర్‌గా ఉంటూ, తనకు లభించే జీతాన్ని పేదలకు పంచి, బుట్టలు, చాపలు అల్లి బజారులో అమ్ముకుని, ఆ వచ్చిన సంపాదన ద్వారా బ్రతికేవారు. ఆయన జ్ఞాని అని ప్రశంసించబడ్డారు. ఆయన కూడా ధర్మబోధ చేశారు.

దాయీలు ఈ పై ఆయత్(2:273)ను తమకు అన్వయించు కుంటున్నారు. ఆ విధంగా అన్వయించుకుని మాకు ఫోన్లు కూడా చేశారు. ఈ దాయీలకు **భూమిలో తిరిగే అవకాశం లేదా?**

ఉదయం నుండి సాయంత్రం వరకూ ఎవరి పనులలో వారుండి కష్టపడి పనిచేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎవరిని బలవంతంగా ఆపి చెబుతారు?

అటువంటప్పుడు, ఆ పగటి సమయం అంతా ఈ దాయీలు కూడా కష్టపడి పని చేయవచ్చు కదా! చేయరు! ఈజీ మనీకి అలవాటు పడిపోయారు. కష్టపడలేరు.

**వీరెవరూ కూడా 'సల్మాన్ ఫార్సీ(రజి)' వంటి జ్ఞానులతో పోల్చదగిన అర్హత కలవారు కాదు.** ఆయనలా ఉన్నత పదవిలో ఉన్నవారు కూడా కాదు. అటువంటి ఆయనే బుట్టలు, చాపలు అల్లి బజారులో అమ్మారు కదా, ఈ దాయీలు కూడా ఏదో చేతిపని చేసి సంపాదించుకోవచ్చు. కష్టపడి పనిచేయకుండా, అడుక్కునేవారు పునరుత్థాన దినమున ముఖంపై చర్మం లేకుండా లేపబడతారని తెలియదా?

ఇప్పుడు నిజం తెలిసింది కదా! **'అల్లాహ్ మార్గంలో' పోయేవారు ఎవరో ఖుర్'ఆన్ స్పష్టంగా తెలిపింది.** రమదాన్ నెలలో తరావీ నమాజ్‌లో ఖుర్'ఆన్ పఠనాన్ని పూర్తి చేయిస్తారు. అలా చేయించేటప్పుడు 'ఫీ సబీలిల్లాహ్' అనే పదాలు ఎన్ని సార్లు విని ఉంటారు? కనీసం రమదాన్ నెలలోనైనా కొద్దిమంది ఖుర్'ఆన్ చదువుతారు. వారు 4వ సూరహ్ పూర్తి చేసేటప్పటికే 'ఫీ సబీలిల్లాహ్' పదాలను కలిగిన 22 ఆయత్‌లు చదివి ఉంటారు. అప్పుడు కూడా ఆలోచన రాలేదా?

ఖుర్'ఆన్‌ను కంఠస్థం చేసిన హాఫిజ్‌లకు తెలుసు, రోజూ ఖుర్'ఆన్ పఠించేవారికి తెలుసు, ఆలిమ్‌లకు కూడా తెలుసు. వీరు అంతా ఎందుకు మౌనం వహించారు? సత్యాన్ని ఎందుకు దాస్తున్నారు?

**సత్యాన్ని దాచితే ఎవరికీ తెలియకుండా ఉండిపోతుందా?**

**ఓ విశ్వాసులారా! మీలో ఎవడైనా తన ధర్మం (ఇస్లామ్) నుండి వైదొలగితే, అల్లాహ్ త్వరలోనే ఇతర ప్రజలను తేగలడు. వారు ఆయనకు ప్రియులైన వారై ఉంటారు మరియు ఆయనను ప్రేమిస్తారు. వారు విశ్వాసుల పట్ల మృదువుగా, సత్య తిరస్కారులపట్ల కఠినంగా ప్రవర్తించే వారునూ, అల్లాహ్ మార్గంలో ధర్మ పోరాటం చేసేవారునూ మరియు నిందించే వారి నిందలకు భయపడని వారునూ అయి ఉంటారు. ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ (అపారుడు) సర్వోపగతుడు, సర్వజ్ఞుడు.** (ఖుర్'ఆన్ 5:54)

**నిజం తెలిసింది కదా! ఇక నిర్ణయం మీదే!**

ఎవరి హక్కు వారికి ఇవ్వాలి. ఇది అల్లాహ్ ఆదేశం. 'అల్లాహ్ ఆదేశాన్ని' మేము తెలియజేశాం. మీకు ఇష్టం లేకపోతే మానివెయ్యండి. తిరస్కరించేవారికి అల్లాహ్‌యే సమాధానం చెబుతారు.

మమ్మల్ని ఆ విధంగా వ్రాయవద్దు అని కొందరన్నారు. మేము వారికి చెప్పే సమాధానం ఒక్కటే -

**"ఇప్పటికైనా సిగ్గుపడండి"**. అల్లాహ్‌ను క్షమాభిక్ష కొరకు వేడుకోండి.

## మదరసాలపై ప్రేమను ఒలకబోస్తున్నారు

జకాత్ మదరసాలకు ఇవ్వాలని, అందులో అనాథ పిల్లలు, పేదవారి పిల్లలు చదువుకుంటున్నారని సానుభూతి కురిపించేవారికి మేము సూటిగా అడిగే ప్రశ్న ఏమిటంటే, **'మదరసాలలో చదివే పిల్లలకు అంత ప్రాధాన్యం మీరు నిజంగా ఇస్తే, ఆ మదరసా నుండి చదువుకుని బయటకి వచ్చిన ఆలిమ్‌లను మీరు ఎందుకు గౌరవించడం లేదు?**

కాన్వెంట్‌లో చదువుకున్నవారికి ఎక్కువ గౌరవమిచ్చి, ఆలిమ్ కోర్సు చదువుకున్న వారికి తక్కువ గౌరవం ఇచ్చేది ఎవరు?

దేశంలోనే పేరున్న ఓ పెద్ద మదరసాలో చదువుకున్న ఓ ఆలిమ్‌కు ఓ చోట మదరసాలో పాఠం చెబుతూ, మదరసాను నిర్వహిస్తున్నందుకు ఏర్పాటు చేసిన జీతం కేవలం 2,500/- రూపాయలు మాత్రమే. అక్కడ డబ్బు లేక కాదు, కేవలం ఆలిమ్‌ల మీద గౌరవం లేకనే.

అరబీ భాష, ఖుర్'ఆన్, హదీస్‌లను నేర్చుకున్నవారికి అంత తక్కువ స్థాయిలో జీతాలు అందితే తెలుగు భాష, హిందీభాషలు నేర్చుకున్న పండిట్‌లకు మంచి జీతం అందుతుంది.

ఓ 1000 సంవత్సరాలకు పూర్వమే ఆనాటి మదరసాలలోనే ఆల్‌జీబ్రా, ట్రిగొనోమెట్రీ, ఖగోళశాస్త్రం వంటి విషయాలు కూడా ఆలిమ్ కోర్సుతో పాటు బోధించారు. మరి 1000 సంవత్సరాల తరువాత నేటి మదరసాలు **అంతకంటే గొప్పగా ఆధునిక విద్యను అందించగలగాలి.** కాని అలా ఎందుకు జరగడం లేదు? ఇల్మ్ (జ్ఞానం) లేక.

నేటి ఆధునిక సైన్స్‌కు పునాదులు వేసినవారు అప్పటి మదరసాలలో చదివిన వారే! వారిని ప్రపంచమంతా గౌరవిస్తుంది. నేటి మదరసాలలో చదివిన వారిని కనీసం ముస్లిములైనా గౌరవించే స్థితిలో ఉన్నారా?

- ఏయే జిల్లాలో మదరసాలు ఎన్ని ఉన్నాయి?
- ఏ మదరసాలు ఏ జమాత్ అధీనంలో ఉన్నాయి?
- ఒక్కొక్క మదరసాలో విద్యార్థులు ఎందరు? టీచర్లు ఎందరు?
- ఆదాయం ఎంత? ఖర్చు ఎంత?
- మదరసా నుండి బయటికి వచ్చినవారికి ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు ఉంటున్నాయా?
- విద్యార్థుల్లో అనాథలు ఎంతమంది? పేదవారు ఎందరు?

**ఈ వివరాల గురించి మీకు ఏమైనా తెలుసా?**

మనదేశం లౌకిక దేశం. పేదవారికి, అనాథలకు వారు ఏ మతానికి చెందినవారైనా, వారికి సహాయం అందిస్తుంది. ప్రతీ జమాత్ లేదా అన్ని జమాత్‌లు కలిసి ఓ మదరసా బోర్డు ఏర్పాటు చేసుకుని, మదరసాలను పటిష్ఠం చేయవచ్చు కదా!

## జకాత్ ఇవ్వకపోతే మదరసాలు నడపలేరా?

ఉదాహరణకు ఒక వ్యక్తి దగ్గర లక్ష రూపాయలున్నాయి. దాని నుండి 2,500 రు॥లు జకాత్ చెల్లించాడు. ఇంకా అతని దగ్గర 97వేల 500 రు॥లు ఉన్నాయి. వాటి నుండి అతను 100 రు॥లో, 200 రు॥లో లేదా తనకు నచ్చినంత సొమ్ము దానంగా ఇవ్వగలడు. అటువంటి నఫిల్

సదఖాను అవసరమైతే మదరసా కొరకు ఉపయోగించుకోండి.

మదరసాల కోసం చందా వసూలు చేసే వ్యక్తి ఓ 50,000/- రూ॥లు సేకరించాడనుకుందాము. ఈ 50 వేల రూపాయలు ఆ మదరసాకు అందుతాయా? **అందాయా? లేదా?** అని మీలో ఎవరైనా ఆ మదరసా వారిని ఎప్పుడైనా అడిగారా? ఈసారి ఆ మదరసాకు వెళ్ళి అడిగి చూడండి. అతను ఊర్లు అన్నీ తిరగడానికి ఆ చందాలో నుండే ఖర్చు చేస్తాడు. అతని రోజు ఖర్చులు దానిలో నుండే. ఆ తరువాత ఆ చందా సేకరించినందుకు అతను అందులో వాటా తీసుకుంటాడు. అన్ని ఖర్చులు, వాటా పోగా, చివరికి ఆ మదరసాకు ఆ 50వేల రూపాయలలో కనీసం 20వేల రూపాయలైనా అందుతాయా?

ఈ విధంగా కాకుండా రాష్ట్రమంతా మదరసాల కొరకు వేరే నాన్ జకాత్ ఫండ్ కలెక్ట్ చేసి, ఏ మదరసాకు ఎంత ఇవ్వాలో లెక్కలు గట్టి, డైరక్టుగా ఆ మదరసాకే పంపిస్తే, ఏ మదరసాలకూ లోటు ఉండదు. ఆలోచించండి!

## జకాత్ లేకుండా నడపలేకపోతే మదరసాలను మూసివేయండి

**మీ బ్యాంక్ ఎకౌంట్‌లో డబ్బు లేకపోతే పక్కవాడి ఎకౌంట్‌లో నుండి దొంగతనంగా డబ్బు డ్రా చేసేసి వాడేసుకుంటే ఏమవుతుంది? జైలుకి పోతారు. అలాగే జకాత్ పేదవారి హక్కు. ఆ హక్కును కాజేస్తే అల్లాహ్ ఊరుకుంటారా?**

మదరసాలో చదువుకుని బయటకి వచ్చాక, ఆలిమ్‌లకు ఉపాధి అవకాశాలు లేవు. ముస్లిమ్ సమాజంలో వారిని లోక్లాస్ వ్యక్తులుగా చూస్తారు. **అటువంటప్పుడు మదరసాలను ఎందుకు నడపడం?** జకాత్‌ను స్వీకరించకుండా ఏ మదరసాలు నడపబడతాయో అవి ఉంటే చాలు.

మదరసాలో పేదవారి పిల్లలు చదువుకుంటున్నారట, అందుకని మదరసాకు జకాత్ ఇవ్వవచ్చుట. పేదవాడు కదా అని ఆ కుర్రవాని తండ్రికి ఇస్తే, ఆ డబ్బుతో ఫీజు కట్టి మదరసాలో చదివిస్తాడో లేక చదివించడోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. **అతని సొమ్ము అతని ఇష్టం.** అల్లాహ్ పేదవానికి జకాత్ ఇవ్వమన్నారు. ఇవ్వాలి. అంతే! ఆ సొమ్మును పేదవాడు తన అవసరాలకు తన ఇష్టప్రకారం వాడుకుంటాడు. అతడు దేనికొరకు ఉపయోగించు కుంటాడో మీ కనవసరం. అతడు ఫలానా విధంగా ఖర్చు చెయ్యాలని ఆదేశించే **హక్కు ఎవరికీ లేదు.**

ఆ డబ్బును స్వంతానికి ఉపయోగించుకుని, తన పిల్లలను గవర్నమెంట్ స్కూళ్లలో ఉచితంగా చదివించుకుంటాడు. మస్జిద్‌లో ఇమామ్ దగ్గర కనీస జ్ఞానాన్ని తమ పిల్లలకు నేర్పించుకుంటాడు. గవర్నమెంట్ స్కూల్లో పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నారు. మస్జిద్‌లో ఇమామ్ ఉచితంగా బోధిస్తాడు. అది చాలదా?

ఏ పేదతండ్రి అయినా సరే కనీసం తన కొడుకైనా పేదరికం లేకుండా బ్రతకాలని, ఒకరిముందు చేయిచాచకుండా, కావలిసినవి పొందగలిగే స్థాయిలో ఉండాలని కోరుకుంటాడు. అటువంటి పేదవాని పిల్లలను మదరసాలలో చదివించి వారికి భవిష్యత్తు లేకుండా చేయాలను కుంటే, మీరు **ఆ పేదవానికి సహాయం చేసినట్లా? లేక ద్రోహం చేసినట్లా?**

మదరసాలో చదివిన వారికే ఉపాధి అవకాశం ఇవ్వడానికి మీరు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన రోజున, ఒక పేదవాని కుమారుడు మదరసాలో చదవడం గురించి ఆలోచించండి.

**పేదవారికి అల్లాహ్ జకాత్ ఇవ్వమన్నారు. ఇవ్వాలి. అది అల్లాహ్ ఆదేశం అంతే!** ఇబ్లీస్‌ను ఆదమ్(అ)కు సజ్దా చెయ్యమన్నారు. అది అల్లాహ్ ఆదేశం. చేయాలి. కాని ఇబ్లీస్ చేయలేదు. అల్లాహ్ శాపానికి గురై షైతానుగా మనల్ని మార్గభ్రష్టులను చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

అల్లాహ్ ఆజ్ఞను తిరస్కరిస్తే ఏమవుతుందో తెలియజేయడానికి షైతాన్ మనకొక ఉదాహరణ. **మరి అల్లాహ్ ఆదేశాన్ని తిరస్కరించడమా? లేక ఆచరించడమా? నిర్ణయం మీదే!**

**ముజాహిద్‌లకు ఇవ్వాలని హదీస్‌లలో చెప్పబడింది అని చెబితే, 'అంటే మేము డబ్బు తీసుకుని వెళ్ళి తాలిబన్లకు ఇవ్వాలా?' అని వ్యంగ్యంగా కొందరు మాట్లాడారు. వారు వెక్కిరించింది మమ్మల్ని కాదు. తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకుని తమను తామే వెక్కిరించు కుంటున్నారు.**

జీహద్ అంటే పవిత్రయుద్ధం అని అనుకునేవారు మూర్ఖులు. న్యూస్ పేపర్లలో జీహద్ పేరుతో వ్రాసే ఛండాళాన్ని వంటికి అంటించుకున్న వారు వెక్కిరించడం కాక మరేమి చేస్తారు? ఇస్లామ్‌లో పవిత్రయుద్ధం అనే పదమే లేదు. ***జీహద్* అంటే ధర్మపోరాటం.** ధర్మాన్ని వ్యతిరేకించి నప్పుడు, లేదా అధర్మం సమాజంలో పెరిగిపోయినప్పుడు, ధర్మపోరాటం తప్పదు.

జకాత్ చెల్లించని వారిపై అబూబకర్ సిద్దీఖ్(రజి)వారు యుద్ధం చేయడానికి సిద్ధపడ్డారు. ఎందుకంటే అది పేదవారి హక్కు కాబట్టి.

శాంతిబాటలో సహాబాల జీవిత విశేషాలను 'నవముస్లిములకు ప్రత్యేకం' శీర్షికలో అందిస్తున్నాము. అవి చదవండి. అప్పుడు తెలుస్తుంది ధర్మపోరాటం అంటే ఏమిటో? ధర్మపోరాటం చేసేవారు ఎటువంటి వారో! వారి సంకల్పమేమిటో!

ధర్మం అంటే ఏమిటో అసలేమీ తెలియనివారికి ధర్మపోరాటం అంటే ఏమి తెలుస్తుంది? మీరు జకాత్ సొమ్మును ఎక్కడికో తీసుకెళ్ళి ఇవ్వనవసరం లేదు. **ముందు మీ ఏరియాలోని పేదవారికివ్వాలి.** మీ ఏరియాలోని పేదరికాన్ని ముందుగా పోగొట్టండి. ఆ తరువాత ఇతర ప్రాంతాలకు ఇవ్వండి. ఇది సున్నత్! అల్లాహ్ ఆదేశాన్ని చెబితేనే, వ్యంగ్యంగా మాట్లాడినవారు ఇక సున్నత్ కు విలువేమిస్తారు?

## జోక్స్

- హజ్జ్ చేసే పేదవారికి జకాత్ ద్వారా ధన సహాయం చేయవచ్చని మదీనాలో చదివిన కొందరు ఆలిమ్‌లకు తెలియదట.
- 'అహలె సుఫ్ఫా' వారికి ముహమ్మద్(స)వారు జకాత్ ఇచ్చారట. కాబట్టి మదరసాలకు ఇవ్వవచ్చుట. ఇది ఎలా ఉందంటే **మోకాలికి బోడి గుండుకి** లింక్ పెట్టినట్లుంది. అహలె సుఫ్ఫా అంటే అరుగుమీద

ఉండేవారు. వారికి ఉండడానికి ఇల్లు లేదు. వారు పేదవారు. జకాత్‌ను పేదవారికే ఇవ్వాలి. 'అహలె సుఫ్ఫా' పేదవారు కాబట్టి వారికిచ్చారు. అహలె సుఫ్ఫా జీవితాంతం అలాగే ఉండిపోలేదండి. వారందరూ తమ తమ జీవనాధారాలను వెతుక్కునే వరకే అరుగు మీద ఉండి ఇస్లామీయ జ్ఞానం పొందారు. అబూహురైరా(రజి) దీనికి మంచి ఉదాహరణ.

## జకాత్ చెల్లింపుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన పెద్దలకు శాంతిబాట టీమ్ ఇచ్చే సలహా

ఇప్పటి నుండి మీరు ఇన్‌కమ్ టాక్స్‌గాని, మున్సిపాలిటీ టాక్స్‌గాని, కరెంట్ బిల్, వాటర్ బిల్ మొదలైన అన్నింటిని ఆయా ఆఫీస్‌లలో కాకుండా దాయీలకు, దావా సంస్థలకు, మదరసాలకు చెల్లిస్తుండండి.

ఒకవేళ ఎలక్ట్రిసిటీ ఆఫీస్‌నుండి ఎవరైనా వచ్చి కరెంట్ బిల్ కట్టలేదు కాబట్టి, ఫ్యూజ్ తీసివేయబోతే అతనితో **"అల్లాహ్ ఎవరికైతే జకాత్ ఇవ్వమన్నారో వారికి ఇవ్వకుండా మాకు ఇష్టమైనవారికి ఇచ్చుకుంటున్నాము. అల్లాహ్ ఆదేశాన్నే లెక్కచేయని మేము, అఫ్టాల్ మీ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారి ఆదేశాన్ని లెక్క చేయాలా? మీకు దిక్కున్న చోటుకి చెప్పుకో ఫో!"** అనండి.

అప్పుడు మీ ఇంట్లో లైటు ఆరిపోతుంది.
మీ బుర్రలో బల్బు వెలుగుతుంది.

ఖుర్‌ఆన్ విషయంలో వాదించకండి. మీకు అర్థం కాకపోతే మంచి ఆలిమ్‌ని అడిగి తెలుసుకోండి. లేకపోతే నిశ్శబ్దంగా ఉండండి.

## శాంతిబాటకు న్యూస్‌పేపర్ రిజిస్ట్రేషన్ ఉంది

'శాంతిబాట'ను నడిపేది కేవలం అల్లాహ్ అనుగ్రహమే! దానికోసం పనిచేసే గొప్ప అవకాశం అల్లాహ్ మాకిచ్చారు. ఎవరో వేసే నిందలకు భయపడి మేము **సత్యాన్ని చెప్పడం ఆపే ప్రసక్తి లేదు, ఇన్షా అల్లాహ్.** ఇది వ్యాపార పత్రిక కాదు. సత్యాన్ని తెలుపుతున్న కారణంగా, చందాదారులు తగ్గవచ్చేమో! అటువంటివి మేము పట్టించుకోము. అల్లాహ్ కోరిన వారికే శాంతిబాట అందుతుంది. 'శాంతిబాట' కోసం అందరూ స్వచ్ఛందంగా పనిచేసేవారే! శాంతిబాట కొరకు ఉద్యోగులు లేరు.

మాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిని సూటిగా ఒక విషయం అడుగుతున్నాము. 'సత్యాన్ని వ్రాస్తుంటే' వ్రాయవద్దని చెప్పిన పెద్దలు, ఏనాడు అయినా ఏ న్యూస్‌పేపర్ ఎడిటర్‌కైనా ఫోన్ చేసి, **''ఇస్లామిక్ తీవ్రవాదం' అని మీ పేపర్లో వ్రాస్తున్నారు. అది తప్పు. అలా వ్రాయకండి. ఇస్లామ్ అంటే శాంతి"** అని చెప్పారా? ఆ విధంగా ఓ న్యూస్ పేపర్ ఎడిటర్‌ని అడిగే ధైర్యం మీకు ఉందా?

'శాంతిబాట' కూడా న్యూస్‌పేపర్‌గా ఢిల్లీలో రిజిష్టర్ కాబడింది. మిగతా న్యూస్‌పేపర్లకు ఏవైతే హక్కులు ఉన్నాయో, అవి మాకు కూడా ఉన్నాయి.

'అసత్యాన్ని' ఖండించి మాట్లాడటానికి ధైర్యం లేనివారికి, 'సత్యాన్ని' తెలిపేవారి మాటలను ఖండించి మాట్లాడటానికి ధైర్యం ఎలా వచ్చింది?

ఓ దుర్మార్గుడు ముస్లిమ్ ముసుగులో వేరే మతధర్మం వారితో కలిసి, ముహమ్మద్(స)వారిని అవమానిస్తూ, ఖుర్‌ఆన్ వాక్యాలను వక్రీకరిస్తుంటే, ఆ విషయం తెలిసి కూడా అతనిని నిలదీసి అడిగే ధైర్యం ఎవరికీ లేదు. అంతేకాకుండా అటువంటి దుర్మార్గులకు ధన సహాయం కూడా అందిస్తున్నారు.

చేస్తున్న దానికి, మాట్లాడుతున్నదానికి సిగ్గుపడండి!

అల్లాహ్‌కు భయపడండి.

మేము కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడ్డాము. ఇక ఎవరికీ భయపడే అవసరం మాకు లేదు.

మమ్మల్ని అవమానించడానికి చేసే ప్రయత్నంలో **ఖుర్‌ఆన్‌ను అవమానించడానికి ప్రయత్నించకండి.**

సత్యాన్ని స్వీకరించగలిగితే స్వీకరించండి! లేకపోతే మానివేయండి!

ఖుర్‌ఆన్‌లో చెప్పిన విషయాలను, ముహమ్మద్(స)వారి బోధనలను తిరస్కరించే వారి గురించి ఇక ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**చేసే ప్రతీ పనికి, చెప్పే ప్రతీ మాటకు అల్లాహ్‌కు సమాధానం చెప్పు కోవలసిన ఆ తీర్పుదినాన్ని గుర్తుచేసుకుని భయపడండి.**

## వాస్తవాన్ని తెలుసుకోండి

ఏ దావా సంస్థ అయినా సరే జకాత్‌ను అడిగినా, లేదా స్వీకరించినా ఆ సంస్థకు ఇస్లామ్‌లోని అతి ముఖ్య అంశమైన జకాత్ గురించి వారికి తెలియనట్లే! వారిలో ధర్మం అనేది నేతి బీరకాయలో నెయ్యి ఉన్నంత ఉంటుందని తెలుసుకోండి.

'శాంతిబాట' ముద్రణ కోసం గాని, మా సొసైటీ కోసంగాని, **'జకాత్ స్వీకరించము'** అని క్రిందటి సంవత్సరం రమదాన్ నెలలో శాంతిబాటలో ప్రకటించాము.

**మేము ప్రకటించినట్లు 'జకాత్ తీసుకోవడానికి తమకు హక్కు లేదంటూ' ఏదైనా సంస్థగాని, ఏదైనా పత్రికగాని ప్రకటించిందా?**

మా కొద్ది మందికి ఎంత శక్తి ఉందో, అంతవరకే శాంతిబాట ద్వారా సత్యాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తాము. ఆలిమ్ పర్యవేక్షణలో ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల వెలుగులో ప్రతీ విషయం బాగా చర్చించిన తరువాతే పత్రిక ముద్రణకు వెళుతుంది.

శాంతిబాట లోని విషయాలు ఎవరో వ్యక్తిగతంగా వ్రాస్తున్నవి కావు. ఎవరు గౌరవించినా, గౌరవించకపోయినా మేము మాత్రం ఆలిమ్‌లను గౌరవిస్తాము. ఇల్మ్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తాము.

ఖుర్‌ఆన్‌లోని ఒక వాక్యం అర్థం కాకపోతే, ఆ గ్రంథంలోనే మరో వాక్యం దానిని స్పష్టంగా వివరిస్తుంది. కాబట్టి ఏదైనా విషయం అర్థం కాకపోతే ముందుగా ఖుర్‌ఆన్‌లో వెతకాలి. అందులో దొరకకపోతే హదీస్‌లలో వెతకాలి. 'అల్లాహ్ మార్గంలో' (పోయేవారు) అంటే ఎవరో **43 ఖుర్‌ఆన్ ఆయత్‌లతో వివరించాము.** క్రిందటి సంచికలో **హదీస్‌ల ఆధారంతో** వివరించాము.

తఫ్సీర్ గ్రంథాల ఆధారాలను కూడా ప్రక్క పేజీలో అందిస్తున్నాము.

# తఫ్సీర్ గ్రంథాలలో 'ఫీ సబీలిల్లాహ్' (అల్లాహ్ మార్గంలో) జకాత్ తీసుకోవడానికి అర్హులెవరు?

సది. (1) నిఱుపేదలు (ఫుఖరా) బొత్తిగా నేమియు లేనివారు. (2) అక్కఱగలవారు (మసాకీన్) వారివద్ద కొంత ధనముగలదు. కాని అది వారి యక్కఱలకు పూర్తికాదు. (3) ముసల్మాను రాజు, ముసల్మానులలో జకాతు వసూలు చేయుటకు కొందఱిని నియమించును. వారు ఆమిలీన్. (4) ఎవరు ఇస్లాము స్వీకరింతురని ఆశయమున్నదో లేదా ఎవరికింకను ఇస్లాములో స్థిరత్వముగలుగలేదో వారు ముఅల్లఫతుల్ ఖులూబ్. అట్టివారిని ఆకర్షించుటకై జకాతులో కొంత ధనమియ్యవలెను. (5) బానిసలను, ఖైదీలను విడిపించుటకును, (6) అప్పులపాలై బాధపడువారి కష్టమును తీర్చుటకును, (7) దేవుని మార్గమందు శత్రువులతో యుద్ధముచేయువారికిని. ధనసహాయము చేయవలెను. (8) బాటసారులు ప్రయాణములో వారియొద్ద ధనము లేనిచో వారికి జకాతు దానమునుండి సహాయముచేయవలెను. పైనెనిమిది విధములుగ జకాతుదానము పంచిపెట్టవలెను. అది దేవుఁడు విధించిన ధర్మము. దేవుఁడు సర్వము తెలిసినవాఁడు. వివేచనాపరుఁడు. కావున ఎవరెవరు దానము గ్రహించుటకు అర్హులో తగినట్లుగ నియమించును. దేవుని విధానము భక్తులు అనుసరింపవలెను.

**మౌల్వీ అబ్దుల్ గఫూర్** గారు **1916**లో వ్యాఖ్యాన సహిత ఖుర్ఆన్ తెలుగు అనువాదాన్ని మొదలుపెట్టారు. **1941**లో మొదటి అనువాదం ముద్రించబడింది. 3 సంపుటాలుగా వెలువడిన ఈ ఖుర్ఆన్ తఫ్సీర్ గ్రంథంలో మొదటి సంపుటి, సూరహ్ ఫాతిహా నుండి 9వ సూరహ్ యైన 'తౌబా' వరకూ ఉంది. మొదటి సంపుటిలోని 517వ పేజీలో 9:60 ఆయత్ కొరకు చేసిన వ్యాఖ్యానాన్ని స్కాన్ చేసి ఇక్కడ అందించాము. ఈ తఫ్సీర్ ప్రకారం ఫీ సబీలిల్లాహ్ కేటగిరి అర్హులు :

**దేవుని (అల్లాహ్) మార్గమందు శత్రువులతో యుద్ధము చేయువారికిని ధనసహాయము చేయవలెను.**

---

تفسیر ابن کثیر اردو — دسواں پارہ — ۷۲ — سورۂ توبہ — واعلموا

اب وہ توبہ کرلے پس انھیں مالِ زکوٰۃ دیا جائے گا کہ یہ قرض ادا کردیں، اس مسئلے کی اصل قبیصہ بن مخارق ہلالی کی یہ روایت ہے کہ میں نے دوسرے کا حوالہ اپنی طرف لیا تھا پھر میں حضورؐ کی خدمت میں حاضر ہوا تو آپؐ نے فرمایا تم ٹھہرو ہمارے پاس مالِ صدقہ آئیگا تو ہم اس میں سے تمہیں دیں گے پھر فرمایا قبیصہ سُن تین قسم کے لوگوں کو ہی سوال حلال ہے ایک تو وہ ضامن پڑے پس اس رقم کے پورا ہونے تک اُسے سوال جائز ہے پھر سوال نہ کرے، دوسرا وہ جس کا مال کسی آفت ناگہانی سے ضائع ہوجائے اُسے بھی سوال کرنا درست ہے یہاں تک کہ پیٹ بھرائی ہوجائے، تیسرا وہ شخص جس پر فاقہ گزرنے لگے اور اس کی قوم کے تین ذی ہوش لوگ اس کی شہادت کیلئے کھڑے ہوجائیں کہ ہاں بے شک فلاں شخص پر فاقے گزرنے لگے ہیں اسے بھی مانگ لینا جائز ہے تاوقتیکہ اس کا سہارا ہوجائے

اللہ تبارک وتعالیٰ اُسے اپنے فضل و رحمت سے جنت میں لے جائے گا (مسند احمد) راہِ خدا، میں وہ مجاہدین غازی داخل ہیں جن کا دفتر میں کوئی حق نہیں ہوتا۔ حج بھی راہِ خدا میں داخل ہے۔ مسافر، جو سفر میں بے سروسامان رہ گیا ہو اُسے بھی مالِ زکوٰۃ سے اتنی رقم دی جائے جس سے وہ اپنے شہر پہنچ سکے۔ گو وہ اپنے ہاں مالدار ہی ہو، یہی حکم ان کا بھی ہے جو اپنے شہر سے سفر کو جانے کا قصد رکھتے ہوں لیکن مال نہ ہو تو اُسے بھی سفر خرچ مالِ زکوٰۃ سے دینا جائز ہے جو اُسے آمدورفت کے لئے کافی ہو۔ آیت کے اس لفظ کی دلیل کے علاوہ ابوداؤد وغیرہ کی یہ حدیث بھی اس کی دلیل ہے کہ حضورؐ نے فرمایا مالدار پر زکوٰۃ حرام ہے بجز پانچ قسم کے مالداروں کے ایک تو وہ جو زکوٰۃ وصول کرنے پر مقرر ہو دوسرا وہ جو مال زکوٰۃ کی کسی چیز کو اپنے مال سے خرید لے تیسرا قرضدار چوتھا راہِ خدا

### తఫ్సీర్ ఇబ్నె కసీర్ (ఉర్దూ)


واعلموا — سورۂ توبہ — ۷۲

اللہ تبارک وتعالیٰ اُسے اپنے فضل و رحمت سے جنت میں لے جائے گا (مسند احمد) راہِ خدا، میں وہ مجاہدین غازی داخل ہیں جن کا دفتر میں کوئی حق نہیں ہوتا۔ حج بھی راہِ خدا میں داخل ہے۔ مسافر، جو سفر میں بے سروسامان رہ گیا ہو اُسے


---

458 — *Tafsīr Ibn Kathīr*

*illegally devours.*

Muslim collected this *Ḥadīth*.[1]

Abu Sa'id said, "During the time of the Messenger of Allāh ﷺ, a man was struck by disaster because of fruits that he bought, causing him extensive debts. The Prophet ﷺ said,

«تَصَدَّقُوا عَلَيْهِ»

*«Give him charity.»*

The people did that but the amount collected did not cover his debts. The Prophet ﷺ said to the man's debtors,

«خُذُوا مَا وَجَدْتُمْ وَلَيْسَ لَكُمْ إِلَّا ذَلِكَ»

*«Take what was collected, you will have nothing beyond that.»"*

Muslim collected this *Ḥadīth*.[2]

**In the Cause of Allāh**

In the cause of Allāh is exclusive for the benefit of the fighters in *Jihād*, who do not receive compensation from the Muslim Treasury.

***Ibn As-Sabīl* (Wayfarer)**

*Ibn As-Sabīl* is a term used for the needy traveler in a land where he does not have what helps him continue his trip. This type has a share in the *Zakāh* for what suffices him to reach his destination, even if he had money there. The same is true for whoever intends to travel from his area but does not have enough money. This type also has a share in the *Zakāh* money to suffice for his trip and back. This is proven in the *Āyah* as well as the following *Ḥadīth*. Imāms Abu Dāwud and Ibn Mājah recorded that Ma'mar said that Zayd bin Aslam said that 'Aṭā' bin Yasār said that Abu Sa'īd Al-Khudri said that the Messenger of Allāh ﷺ said,

«لَا تَحِلُّ الصَّدَقَةُ لِغَنِيٍّ إِلَّا لِخَمْسَةٍ: لِعَامِلٍ عَلَيْهَا، أَوْ رَجُلٍ اشْتَرَاهَا بِمَالِهِ، أَوْ غَارِمٍ، أَوْ غَازٍ فِي سَبِيلِ اللهِ، أَوْ مِسْكِينٍ تُصُدِّقَ عَلَيْهِ مِنْهَا فَأَهْدَى لِغَنِيٍّ»

*«Ṣadaqah is not rightful for a wealthy person except in five*

[1] Muslim 2:722.
[2] Muslim 3:1161.

(పేజీ 458, తఫ్సీర్ ఇబ్నె కసీర్ (ఇంగ్లీష్), సంపుటి 4)

### తఫ్సీర్ ఇబ్నె కసీర్ (ఇంగ్లీష్)

**ఇబ్నె కసీర్‌గారు హిజ్రీ శకం 701లో జన్మించారు.** ఈయన అరబీలో వ్రాసిన ఒరిజినల్ తఫ్సీర్ చాలా పెద్దది. దానిని సంక్షిప్తంగా చాలా భాషలలో అనువదించారు. ఇంగ్లీష్‌లో దారుస్సలామ్, రియాద్ వారు 10 సంపుటాలుగా ముద్రించారు. ఖుర్ఆన్‌పై కనీస అవగాహన కలిగిన వారు ఈ తఫ్సీర్ గురించి వినే ఉంటారు. ఇప్పుడు హిజ్రీ శకం 1432 నడుస్తుంది. దాదాపు 700 సంవత్సరాల క్రితం వ్రాయబడిన తఫ్సీర్ ఇది. దీనిలో 'ఫీ సబీలిల్లాహ్'(అల్లాహ్ మార్గంలో) జకాత్ తీసుకోవడానికి అర్హులు ఎవరో, పైన ఇవ్వబడిన ఉర్దూ అనువాదంలో ఉంది. ఇంగ్లీష్ అనువాదం కొరకు ప్రక్కనే ఉన్న స్కాన్ చేయబడిన పేజీలో చూడండి.

**In the Cause of Allah is exclusive for the benefit of the fighters in Jihad, who do not receive compensation from the Muslim Treasury. (అల్లాహ్ మార్గంలో అంటే కేవలం బైతుల్‌మాల్ నుండి పరిహారం అందని ముజాహిదీన్ (ధర్మ పోరాట యోధుల) ప్రయోజనం కొరకు మాత్రమే)**

# మారిఫుల్ ఖుర్‌ఆన్ (ఇంగ్లీష్)



not have a share in this head too – except that his present holdings may be insufficient for the needs of Jihād or Ḥajj he is going to undertake. Call him rich because he has property above the *niṣāb*. In fact, such a person has been called rich in Ḥadīth. But, in the final analysis, he too turns out to be a poor and needy person in terms of the amount of funds he needs for Jihād or Ḥajj – and this he does not have with him! Shaykh ibn Humām has said in Fatḥ al-Qadīr: The words used to describe recipients mentioned in the verse of Ṣadaqāt prove that they deserve what they do on the basis of poverty and need. The words for the poor and the needy are obvious by themselves. Other words used for freeing of slaves, releasing from debt, in the way of Allah and for the wayfarer also suggest that they receive shares to alleviate their needs. However, those employed to collect Ṣadaqāt receive their share in return for the services rendered by them. Therefore, in that, the rich and the poor are equal. This is similar to what has been briefly mentioned earlier under the category of 'those in debt.' A person owes a debt of Rupees ten thousand.[1] He has Rupees five thousand with him. He can be given Zakāh up to Rs. Five thousand, because the funds he has with him will be taken as not with him due to the debt.

**A word of Caution**

The literal meaning of *fī sabīlillāh* is very general and very common. Anything done for the good pleasure of Allah is included under *fī sabīlillāh* in the light of this popular sense. Unfortunately, there are people who wish to understand the Qur'ān through a literal translation alone. They would skip the explanations and statements of the Holy Prophet صلى الله عليه وسلم and ignore the sayings of major commentators. As a result, they fall into error. One such error shows up when they look at *fī sabīlillāh* and find it spacious enough to accommodate everything they fancy. Under this head of Zakāh, they have included everything that is considered to be good or religious. Under this umbrella, they have included the building of mosques, religious schools, hospitals, inns, even the provision of public services like wells, bridges and roads. Then, they do not seem to forget the salaries and contingent expenses of the institutions of public service. All these, they include under *fī sabīlillāh* and declare them to be worth receiving Zakāh funds. This is absolutely wrong and very much against the consensus **1**

1. Approximately a little less than $200.



**2** of the Muslim Ummah. This is something already decided clearly and categorically. There are statements of the noble Ṣaḥābah, the direct disciples of the Holy Prophet صلى الله عليه وسلم. They had learnt and understood the Qur'ān from him. Then, there are explanations of this expression passed on to us from the most learned authorities from among the Tābi'īn. All of them restrict the expression to Ḥujjāj and Mujāhidīn.

It appears in a Ḥadīth that someone had given a camel as religious endowment in the way of Allah (*fī sabīlillāh*). For it, the Holy Prophet صلى الله عليه وسلم said: 'Use this camel to carry Ḥujjāj (Ḥajj pilgrims) on their journey.' (Al-Mabsūṭ, Al-Sarakhsī, p. 10, v. 3)

Imāms Ibn Jarīr and Ibn Kathīr are known exegetes who limit themselves to explaining the Qur'ān through Ḥadīth reports only. They both have particularized *fī sabīlillāh* with *mujāhidīn* and *ḥujjāj* who do not have the wherewithal necessary for Jihād or Ḥajj. As for jurists who have included students in religion or servants of good causes in this category, they have done so subject to the condition that they should be poor and needy. And it is obvious that the poor and the needy are in themselves the first among the recipients of Zakāh. Even if they were not included under the sense of *fī sabīlillāh*, still they would have deserved receiving Zakāh. But, no one from among the four Imāms and jurists of Muslim Ummah ever said that expenditures on institutions of public welfare, building of mosques and religious schools and the rest of their functional needs are included under the head of Zakāh disbursements. In fact, they have made it very clear that spending Zakāh funds for this purpose is impermissible. Jurists from different schools of Islāmic jurisprudence have written about it in great details. The names of some of them are being given as follows: Ḥanafī jurist Al-Sarakhṣī in al-Mabsūṭ [p. 202,v. 2] and Sharḥ al-Siyar [p. 244, v. 4], Shāfi'ī jurist Abū 'Ubayd in Kitāb al-Amwāl, Mālikī jurist Dardīr in Sharḥ Mukhtaṣar al-Khalīl [p.161, v. 1] and Al-muwaffaq in al-Mughnī.

**3** Other than the clarifications from authorities of Tafsīr and jurists of Islām referred to earlier, a little thought over this matter will help us understand the problem quickly. Let us think for a moment. If this field of Zakāh was so all-embracing that it could accommodate spending on every act of worship and virtue, then, the identification of these



eight recipients in the Qur'ān becomes (God forbid) totally redundant. So does the statement of the Holy Prophet صلى الله عليه وسلم cited earlier where he said that Allah Ta'ālā has not delegated the authority to determine the recipients of Ṣadaqāt even to a prophet, in fact, He has Himself determined the eight categories of its recipients. This tells us that the element of universal application visible to an unaware person from a literal translation of *fī sabīlillāh* (in the way of Allah) is not what Allah means. Instead, it means what stands proved from the words of the Holy Prophet صلى الله عليه وسلم and the related clarifications of the Ṣaḥābah and the Ṭābi'īn. **4**

**మౌలానా ముఫ్తీ ముహమ్మద్ షఫీ** గారు 1964లో ఈ తఫ్సీర్‌ను ప్రారంభించారు. 1969లో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వీరు ఆ స్థితిలోనే తిరిగి ప్రారంభించి సూరహ్ బఖరాను పూర్తి చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరే, 5 సంవత్సరాలలో దాదాపు 7000 పేజీలున్న తఫ్సీర్ గ్రంథాన్ని పూర్తి చేశారు. ఈ తఫ్సీర్ ఉర్దూలో 8 సంపుటాలుగా ముద్రించ బడింది. ఇంగ్లీష్ అనువాదం కూడా 8 సంపుటాలుగా ముద్రించబడింది. ఈ గ్రంథపు 4 వ సంపుటిలోని 3 పేజీలను పైన ఇచ్చాము.

## పై 3 పేజీలలో సెలెక్ట్ చేసిన విషయానికి తెలుగు అనువాదం:

'ఫీ సబీలిల్లాహ్'కు భాషాపరమైన అర్థం చాలా సాధారణమైనది. దాని కున్న ప్రముఖమైన భావన దృష్ట్యా అల్లాహ్ కోసం ఏ పనిచేసినా దానిని ఇందులో కలిపేశారు. దురదృష్టవశాత్తు కొంతమంది ఉన్నారు, వారు ఖుర్‌ఆన్‌ను కేవలం భాషాపరమైన అనువాదాన్నే అర్థం చేసుకోవాలను కుంటారు. ప్రవక్త(స)వారి వచనాలు మరియు వివరణలను వదిలేస్తారు. ముఖ్య వ్యాఖ్యాతలు చెప్పినవాటిని నిర్లక్ష్యం చేస్తారు. దాని ఫలితంగా వారు దోషంలో పడ్డారు. అటువంటి ఓ దోషమేమిటంటే 'ఫీ సబీలిల్లాహ్'ని చాలా విశాలంగా తీసుకుని వారు ఊహించుకున్న ప్రతీ దానికి దానిలో చోటు కల్పించారు.

జకాత్‌లో ధార్మికమైన ప్రతీ దానిని మరియు ప్రతీ మంచిపనిని కలిపేశారు. (వ్యాఖ్యాత గారు నివజంచే ప్రాంతంలో ఉన్న విషయాలను ఇక్కడ ఉదాహరించారు) మస్‌జిద్‌ల నిర్మాణాలు, మదరసాలు, హాస్పిటల్స్, సత్రాలు, నూతుల నిర్మాణాలు, వంతెనలు, రోడ్డులు వంటి ప్రజాసేవలను కూడా కలిపారు. తరువాత ప్రభుత్వ సేవా సంస్థలకు సంబంధించి జీతాలు మరియు ఇతర ఖర్చులను కూడా మర్చిపోలేదని అనిపిస్తుంది. ఇది పూర్తిగా తప్పు మరియు ముస్లిమ్ ఉమ్మత్ యొక్క

ఏకాభిప్రాయానికి ఇది మిక్కిలి వ్యతిరేకం.

జకాత్ అప్పటికే స్పష్టంగా నిర్ణయించ బడింది మరియు కేటగిరులుగా వర్గీకరించబడింది. ప్రవక్త(స)వారి ప్రధాన సహచరుల ఉల్లేఖనాలున్నాయి. వారు ఆయన(స)నుండి ఖుర్ఆన్‌ను నేర్చుకున్నారు మరియు అర్థం చేసుకున్నారు.


తరువాత 'ఫీ సబీలిల్లాహ్'కి సంబంధించి ఎన్నో వివరణలు మనకు వారి నుండి అందాయి. మంచిజ్ఞానం గల తాబిఈన్‌ల నుండి కూడా అందాయి. వారంతా 'ఫీ సబీలిల్లాహ్' హుజ్జాజ్ మరియు ముజాహిదీన్‌లకే పరిమితం చేశారు. హదీస్‌లో కనిపిస్తుంది, ఎవరో ఒక ఒంటెను అల్లాహ్ మార్గంలో (ఫీ సబీలిల్లాహ్) ఇచ్చారు. దాని గురించి ప్రవక్త(స)వారు చెప్పారు : 'ఈ ఒంటెను హుజ్జాజ్ (హజ్జ్ యాత్రికులకు) వారి ప్రయాణంలో ఉపయోగించండి' (అల్-మబ్‌సూత్, అల్-సరక్షీ, పేజి 10, సంపుటి 3)

ముందుగా వివరించిన తఫ్సీర్ నిపుణుల నుండి మరియు ఇస్లామ్ యొక్క న్యాయశాస్త్ర నిపుణుల నుండి స్పష్టీకరణలే కాకుండా, **ఈ విషయంపై చేసే ఓ చిన్న ఆలోచన సమస్యను అర్థం చేసుకోవడానికి సహకరిస్తుంది.**

**ఓ క్షణం ఆలోచిద్దాం!** ఒకవేళ ఈ జకాత్ ఆరాధనకు సంబంధించిన ప్రతీ పనిని కలిగి ఉంటే, 8 రకాల గ్రహీతలని గుర్తించడం పూర్తిగా అనవసరం. (అల్లాహ్ క్షమించుగాక!). కాబట్టి ముందుగా చెప్పుకున్న బోధనల ప్రకారం అల్లాహుతాలా జకాత్ గ్రహీతలను నిర్ణయించే అధికారం ప్రవక్త(స)వారికి సైతం ఇవ్వలేదు. వాస్తవానికి, ఆయనే (అల్లాహ్‌యే) స్వయంగా 8 కేటగిరుల గ్రహీతలను నిర్ణయించారు.

ఇది మనకు ఏమి తెలియజేస్తున్నదంటే, అవగాహన లేని వ్యక్తికి 'ఫీ సబీలిల్లాహ్'కుండే భాషాపరమైన అర్థాన్ని బట్టి కనిపించే ప్రతీదానికి వర్తించే విధానం ఏదైతే అల్లాహ్ చెప్పారో అది కాదు. దానికి బదులుగా దాని అర్థం ఏమిటంటే ఏదైతే ప్రవక్త(స)వారి వచనాల నుండి మరియు సహాబా మరియు తాబిఈన్‌ల వివరణల నుండి రుజువు చేయబడిందో అది.

## అహ్‌సనుల్ బయాన్ (ఇంగ్లీష్)


Sūrah 9. At-Taubah Part 10 الجزء ١٠ سورة التوبة ٩

وَرَسُولُهُۥٓ إِنَّآ إِلَى ٱللَّهِ رَٰغِبُونَ ﴿٥٩﴾ ۞ إِنَّمَا ٱلصَّدَقَٰتُ لِلْفُقَرَآءِ وَٱلْمَسَٰكِينِ وَٱلْعَٰمِلِينَ عَلَيْهَا وَٱلْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِى ٱلرِّقَابِ وَٱلْغَٰرِمِينَ وَفِى سَبِيلِ ٱللَّهِ وَٱبْنِ ٱلسَّبِيلِ ۖ فَرِيضَةً مِّنَ ٱللَّهِ ۗ وَٱللَّهُ عَلِيمٌ حَكِيمٌ ﴿٦٠﴾

His Messenger (ﷺ) (from alms). We implore Allāh (to enrich us)."


**60.** *As-Sadaqāt* (here it means *Zakāt* – obligatory charity) are only for the *Fuqarā'*[1] (needy), and *Al-Masākin* (the poor) and those employed to collect (the funds); and to attract the hearts of those who have been inclined (towards Islām); and to free the captives; and for those in debt; and for Allāh's Cause (i.e. for *Mujahidūn* — those fighting in a holy battle), and for the wayfarer[2] (a traveller who is cut off from everything); a duty imposed by Allāh. And Allāh is All-Knower, All-Wise.

Commentary

[1] To forestall any likely objection or wrangling over the distribution of charity, this verse specifies the categories of men who deserve charity. Charity here means the legally prescribed charity (i.e. *zakah*). The charity shall be spent on the eight categories mentioned here. It is not right to spend it in any other avenue except those eight mentioned here.

[2] Here is a brief explanation of the eight categories: 1. *fuqara'* (the poor). The poor (*fuqara'*) and needy (*miskeen*) are similar

370


Sūrah 9. At-Taubah Part 10 الجزء ١٠ سورة التوبة ٩

to one another. 2. A *hadeeth explains the needy* (*miskeen*, pl. *masakeen*). The Messenger of Allah ﷺ, said: "A *miskeen* is not the one who goes around asking for a morsel or two, or a date, but a person who has neither enough to make him independent of help from others nor is he considered destitute enough to be given charity, nor does he ask others for help." - (*Saheeh-ul-Bukhari*, *hadeeth 1479 and Saheeh Muslim, hadeeth* 101-(1039)). But a narration of Ibn 'Abbas defines *miskeen* as a mendicant, a beggar, who presses others, asking importunately for alms, while a *faqeer* is he who, despite his penury, refrains from asking others for help. - (Ibn Katheer). 3. *Wal-'amileen* means state officials who collect, distribute and keep account of *zakah* contributions. 4. *Wal-mu'allifati qulubuhum*: this category refers to disbelievers who are inclined to Islam, and if helped, may hopefully convert to Islam, new Muslims who need support to keep steady in faith, and people who, in case they are helped, can hold in check the people of their area from launching attacks on Muslims and thus provide shelter to the weak Muslims living in their neighborhood. This wealth may be spent on them even if they are well-to-do. 5. Freeing the captives, meaning to pay the price for a slave, partially or wholly, so that he shall be free. 6. *Wal-gharimeen*: under this category come the debtors who borrowed money to support their families but have neither enough money nor enough goods to sell them away to pay off their loans, those who stood surety for other borrowers who have defaulted but are now unable to pay off the loans, or those who ran into debt through loss of business or harvest. For the cause of Allah means *jihad*. *Zakah* may be spent to buy weapons and help a fighter (even if he is wealthy). According to *hadeeths*, *hajj* and *'umrah* also fall under the cause of Allah. 8. *Wabnis-sabeel* means wayfarers. A traveler, though well-off in his own land, deserves *zakah* funds if case he runs into difficulties while away from home.

371

**అహ్సనుల్ బయాన్** గ్రంథానికి హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్‌గారు వ్యాఖ్యానం చేశారు. దీని ఇంగ్లీష్ అనువాదాన్ని దారుస్సలామ్, రియాద్ వారు 2010లో ప్రచురించారు. ఆ అనువాదంలోని రెండు పేజీలు, 370 మరియు 371 పేజీలను ఇక్కడ అందించాము. 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరికి అర్హులు ఎవరని చెప్పబడిందో ఆ విషయాలను 371వ పేజీలో మార్క్ చేయడం జరిగింది. ఆ భాగానికి తెలుగు అనువాదం :

**అల్లాహ్ మార్గమంటే జిహాద్. ఆయుధాల కొనుగోలుకు జకాత్ ఖర్చుపెట్టవచ్చు మరియు ఓ యుద్ధ సైనికునికి సహాయం చెయ్యవచ్చు (అతడు ధనవంతుడైనప్పటికీ). హదీస్‌ల ప్రకారం హజ్జ్ మరియు ఉమ్రా కూడా 'ఫీ సబీలిల్లాహ్' క్రిందికే వస్తుంది.**

ఈ అహ్సనుల్ బయాన్‌ను తెలుగులో ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారిచే అనువాదం చేయించి, శాంతిమార్గం పబ్లికేషన్ ట్రస్ట్ (హైదరాబాద్)వారు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ తెలుగు అనువాదాన్ని ఇక్కడ అందిస్తున్నాము.

**దైవమార్గంలో (ఫీ సబీలిల్లాహ్) : అంటే ధర్మ యుద్ధం కోసం అన్నమాట. యుద్ధ సామాగ్రిని సమకూర్చు కోవడానికి, యోధుల అవసరాలను తీర్చడానికి జకాత్‌ను వెచ్చించటం సమ్మతమే. హజ్జ్, ఉమ్‌రాలు కూడా దైవమార్గం (ఫీ సబీలిల్లాహ్) పద్దు క్రిందకే వస్తాయని హదీస్‌ల ద్వారా రూఢీ అవుతుంది.**

అలాగే దైవధర్మ ప్రచారం కోసం కూడా ఈ మొత్తాన్ని వెచ్చించ వచ్చని కొంతమంది విద్వాంసులు భావించారు. ఎందుకంటే ఇది కూడా జిహాద్ మాదిరిగానే సత్యధర్మ ఉన్నతికై జరిగే కృషి అని వారు సూత్రీకరించారు. (పేజీ 851)

**హదీస్‌ల ద్వారా రూఢీ అయ్యాక విద్వాంసుల భావనలకు విలువ లేదు.** ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చెబితే, వారి మాటలను స్వీకరించ వలసిన అవసరం మనకు ఎంత మాత్రం లేదు.

ఎందుకంటే ఏదైనా ఓ విషయం అర్థం కానప్పుడు, దాని కొరకు వివరణకై ఖుర్‌ఆన్‌లో వెతకాలి. ఒకవేళ ఆ వివరణ ఖుర్‌ఆన్‌లో లభించక పోతే హదీస్‌లలో వెతకాలి. అక్కడ కూడా లభించకపోతే సహాబీల వివరణలు, ఆ తరువాత తాబిఈన్‌ల వివరణలలో వెతకాలి. వీటిలో కూడా లభ్యం కాని పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే విద్వాంసుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలి.

జకాత్ విషయంలో చెప్పిన 'అల్లాహ్ మార్గంలో' అంటే ఏమిటో తెలియనప్పుడు, మేము వెతికినట్లు 'ఫీ సబీలిల్లాహ్' అని ఖుర్‌ఆన్‌లో ఎక్కడెక్కడ చెప్పబడిందో చూడాలి. 43 ఆయత్‌లలో 'ఫీ సబీలిల్లాహ్' ఉంది. **'ఫీ సబీలిల్లాహ్' అంటే ఏమిటో ఖుర్‌ఆన్‌లోనే స్పష్టం అయిపోయింది.**

హదీస్‌లలో హజ్జ్ చేయాలనుకునే పేదవారికి 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరి క్రింద సహకరించవచ్చు అని తెలుస్తుంది.

ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా స్పష్టం అయిన తరువాత ఆ స్పష్టమైన విషయాలతో సంబంధం లేని విద్వాంసుల అభిప్రాయాలను కొట్టి పారేయాలి.

అది కూడా జిహాదే, ఇది కూడా జిహాదే అని సంబంధం లేకుండా చెప్పడం సరికాదు. ఖుర్‌ఆన్‌లో 'ఫీ సబీలిల్లాహ్' వ్యక్తం చేసే జిహాద్ ఇది కాదు.

### తఫ్సీర్ ఇబ్నె అబ్బాస్

" ..... for the fighters for the cause of Allah ....."

**(అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసేవారి కొరకు)**

ఇంగ్లీష్ అనువాదం : Mokrane Guezzou

### తఫ్సీర్ అల్-జలాలైన్

**"..... for the way of God, that is, [for] those who are engaged in the struggle, of those for whom there is no [share of the] booty (fay), even if they be wealthy ....."**

**"అల్లాహ్ మార్గంలో అంటే యుద్ధంలో నిమగ్నమైనవారి కొరకు, ఎవరికైతే యుద్ధప్రాప్తి (లో భాగం) లేదో వారికి, వారు ఐశ్వర్య వంతులైనప్పటికీ"**

ఇంగ్లీష్ అనువాదం : Feras Hamza

పై రెండు తఫ్సీర్‌ల మూలం కొరకు క్రింది వెబ్‌సైట్‌లో చూడండి.

www.altafsir.com

2011 Royal Aal al-Bayt Institute for Islamic Thought, Amman, Jordan.

### ధర్మపోరాటం అంటే ...

ఎవరికి ఇష్టం వచ్చినట్లు, ఎవరిపైన కావాలనుకుంటే వారిపై యుద్ధం చేయడం కాదు ధర్మ యుద్ధం అంటే. **యుద్ధ రంగానికి కూడా మానవీయత నేర్పింది ఇస్లామ్.** ఇదే సంచికలో తిరిగి గూటికి శీర్షికలో అందించిన 'సాద్ బిన్ అబీ వఖ్ఖాస్'(రజి)వారి గురించి చదివి ఉంటారు. ఆయన ఎందుకు పర్షియన్లపై ధర్మయుద్ధం చేయవలసి వచ్చిందో కారణాలు తెలిపాము. ప్రవక్త(స)వారు జీవించిన కాలం నుండి సన్మార్గంలో ఉన్న ఖలీఫాల కాలం వరకూ జరిగిన యుద్ధాల గురించి తెలుసుకోండి.

**ఈ యుద్ధాలలో ధర్మం ఉంటుంది. ఈ యుద్ధంలో శత్రువు శాంతిని కోరితే, అతనిని వదిలివేయడమే కాకుండా, అతనిని సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్ళి వదలాలి. 'జిహాద్' అనే పేరుతో ఎవరు ఏ పనిచేసినా అది ధర్మ పోరాటం కాదు. ఇస్లామ్‌లో పవిత్ర యుద్ధం అనే విషయమే లేదు.**

ఇస్లామ్‌పై విషం కక్కే అమెరికా వంటి దేశాలు తమ స్వార్థం కోసం కొందరి చేత 'లష్కరె తైబా', 'అల్-ఖైదా' వంటి సంస్థలను ఏర్పాటు చేయించి 'జిహాద్' అనే పదానికి చెడ్డపేరు తీసుకురావడానికి, మత దురభిమానంతో తమ కనుసన్నలలో నడిచే మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం ఏనాడో ప్రారంభించాయి.

ఇస్లామ్‌పై కనీస అవగాహన లేనివారు ఈ దుష్ప్రచారాన్ని ఒంట బట్టించుకుని, విషం కక్కుతూ ఉన్నారు. 'జిహాద్' అంటే ఏమిటో, దాని

ఔన్నత్యమేమిటో తెలియజేసే వాస్తవాలను ఇన్షా అల్లాహ్ రాబోయే సంచికలలో అందిస్తాము.

జకాత్ సొమ్మును అధర్మంగా మింగేయడానికి తహతహ లాడుతున్నవారు 'ధర్మపోరాటం చేసిన వారిని' అవహేళన చేస్తూ మాట్లాడారు. వారు ఇప్పటికైనా పశ్చాత్తాప పడితే వారికే మేలు.

సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి)వారు ఈ ధర్మయుద్ధంతో ఇరాన్ ఆక్రమణలో అణగారిన ప్రజలను ఏ స్థాయికి తీసుకువచ్చారో ఇప్పటికే మీరు చదివి ఉంటారు. అశాశ్వతమైన డబ్బుకోసం అవహేళన చేయడం మానుకోండి. లేకపోతే అందరిచేత మీరే అవహేళన చేయబడతారు, ఇన్షా అల్లాహ్!

## శాంతిబాట పాఠకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు

మేము తెలియజేసిన సత్యాన్ని అర్థం చేసుకుని మీరంతా కొందరు ఆలిమ్‌లను, పెద్దలను నిలదీసి అడగడంతో, వారు దిక్కు తోచక మాతో అభ్యంతరకర పదజాలంతో మాట్లాడారు. మరుగున పడిపోయిన ఓ సున్నత్‌ని తిరిగి ఆచరణలో పెట్టేలా చేస్తే, దాని వలన లభించే పుణ్యం అపారం.

మరి అల్లాహ్ ఆదేశాన్నే ఆచరణలో పెట్టేలా చేస్తే ఇక ఆ పుణ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**ఈ వ్యాసంలో ఇచ్చిన ఆధారాలతో సంబంధిత వ్యక్తులను ఇంతకాలం వాస్తవాన్ని ఎందుకు దాచారో నిలదీసి అడగండి.**

'శాంతిబాట' సత్యాన్ని చెబుతున్నప్పుడు, దానిని నిషేధించాలని ప్రగల్భాలు పలికే వారికి మేము చెప్పేది ఒక్కటే -

**"మీకంత ధైర్యం లేదు. కేవలం అల్లాహ్ అనుగ్రహంతో మాత్రమే నడిచే పత్రికను మీరు ఆపలేరు, ఇన్షా అల్లాహ్! మీకంత సత్తా ఉంటే ముస్లిముల ముసుగులో, మరో మత ధర్మం వారితో కలిసి పనిచేసే మునాఫిక్ సంస్థలను మూయించేవారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరకు వేడుకోండి".**

**మేము బయట పెట్టిన సత్యాన్ని వైజాగ్‌లో స్వీకరించారు. మరో రెండు ఊర్లలో కూడా ఆచరణలో పెట్టారు. ఎందరో సోదరులు స్వాగతించారు. వచ్చే సంవత్సరం రమదాన్‌కి ఇన్షాఅల్లాహ్ ఇంకా ఎక్కువ మంది అల్లాహ్ చెప్పిన విధంగా జకాత్ చెల్లిస్తారని మా నమ్మకం".**

## అందరూ ఖచ్చితంగా జకాత్ ఇస్తే పేదరికం ఉండదు.

మేము ప్రచురించే వ్యాసాలలో ఏదైనా విషయం అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవచ్చు. కాని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడానికి, వాదనలు పెట్టుకోవడానికి ప్రయత్నించకండి.

ప్రవక్త(స)వారికి విధేయత చూపనివారే ఖుర్'ఆన్ విషయంలో వాదిస్తారు.

**వచ్చే సంవత్సరం మనదేశంలో అల్లాహ్ చెప్పినట్లు ఖచ్చితంగా జకాత్ చెల్లించే రాష్ట్రం 'ఆంధ్రప్రదేశ్' కావాలని అల్లాహ్‌ను హృదయపూర్వకంగా వేడుకుంటున్నాము (ఆమీన్)**

సత్యానికి తోడుగా ఉన్న మా పాఠకులకు మరొక్కసారి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.

**(25వ పేజీ తరువాయి భాగం)**

**ఆకాశాలలోని కాబా అంటే బైతుల్ మ'మూర్.**

కాబా నిర్మాణంలో ఉపయోగించిన రాళ్ళను ఇప్పటి వరకూ మార్చలేదు. అంటే ఇబ్రాహీమ్(అ) పునర్నిర్మించినపుడు ఏ రాళ్ళను ఉంచారో, అవే రాళ్ళను ఇప్పటికీ కాబా కలిగి ఉంది.

ఆదమ్(అ)వారు 'హజ్రె అస్వద్'ను స్వర్గం నుండి తీసుకువచ్చిన విషయాన్ని శాంతిబాటలో 'బాలబాలికల ప్రత్యేకం' శీర్షికలో ఆదమ్(అ) వారి గురించి తెలియజేసినప్పుడు చెప్పుకున్నాం.

బహుశా ఆ నల్లటి రాయి నుండే రేడియేషన్ బైతుల్ మ'మూర్‌కి చేరుతుందేమోనని మేము భావిస్తున్నాము. ఇది మా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. నిజం అల్లాహ్‌కే తెలుసు.

ఈ సందర్భంగా ఓ విషయం చెప్పాలి. కాబా మస్జిద్ బయట గోడలో ఉండే ఈ నల్లటి రాయిని ముస్లిములు పూజిస్తారని చాలా మంది ఇతర మతస్థులు అపోహ సృష్టిస్తున్నారు. అల్లాహ్‌ను పోలినది ఈ విశ్వంలోనే ఏదీ లేదని ఖుర్'ఆన్ స్పష్టం చేసేసింది. ఆయనకు బదులుగా వేరే ఏ సృష్టించబడిన దానినైనా ప్రార్థించడం మహా పాపంతో సమానమని ఇస్లామ్ స్పష్టం చేసింది. కాబట్టి ఆ నల్లరాయిని అల్లాహ్‌కు ప్రతినిధిగా ఏ ముస్లిమ్ కూడా భావించరని వారికి తెలియదు.

అది కేవలం రాయి మాత్రమే. దానిని ముహమ్మద్(స)వారు ముద్దు పెట్టుకున్నారు కాబట్టి, ముస్లిములు దానిని సున్నత్‌గా పాటిస్తున్నారు అంతే! అదే విధంగా కాలాన్ని లెక్కగట్టడానికి చంద్రుని కదలికల ఆధారంగా ఉండే చంద్రమానాన్ని ముస్లిములు అనుసరిస్తారు. అంతేగాని ముస్లిములు నెలవంకను ఆరాధించరు. ఈ అపోహను కూడా సృష్టించారు. సృష్టికర్తయైన అల్లాహ్‌ను తప్ప దేనినీ ముస్లిమ్‌లు ఆరాధించరు.

ఇంటర్‌నెట్‌లో మాయమైన సమాచారం ఉండి ఉంటే మరింత వివరంగా చెప్పుకునే అవకాశం ఉండేది. ఇటువంటి విషయాలపై వాదనలు, ప్రతివాదనలు చేయవద్దని మనవి.

ఈ వ్యాసం సందర్భంగా ఒకసారి బైతుల్ మ'మూర్ గురించి రమదాన్ నెలలో గుర్తు చేసుకునే అవకాశం కలుగుతుందని ఈ శీర్షికలో ఈ వ్యాసాన్ని అందించాము.

ఈ విషయంపై పరిశోధించి మరింత సమాచారాన్ని సేకరించడానికి ప్రయత్నిస్తాము. అందరికీ అర్థం అయ్యేవిధంగా అందించగలమనే నమ్మకం మాకు కలిగినప్పుడు, ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

ఈ వ్యాసంలో చెప్పిన విషయాన్ని మీరు ధృవీకరిస్తున్నారా?అని మమ్మల్ని ఎవరైనా అడిగితే, తక్కువ సమాచారంతో మేము ఏ విషయమూ చెప్పగలిగే స్థితిలో లేము. కొందరు ఇంటర్‌నెట్‌లో ఈ విషయమై చర్చిస్తున్నారు. అటువంటి చర్చల నుండి మా పాఠకులను దూరంగా ఉంచాలనేది మా ప్రయత్నం. మరో ముఖ్యమైన విషయంపై ఇదే శీర్షికలో ఇన్షా అల్లాహ్ మరో వ్యాసాన్ని అందిస్తాము.

## సంవత్సర చందా చెల్లించని వారికి

# చివరి విజ్ఞప్తి

క్రిందటి సంవత్సరం (జూలై, 2010)తో చందా పూర్తయిన వారందరికీ ఫోన్ చేసి 'శాంతిబాట' పంపడాన్ని కొనసాగించ మంటారా? లేక ఆపివేయమంటారా? అని అడిగితే దాదాపు అందరూ కంటిన్యూ చేయమన్నారు. వారు వీలు చూసుకుని మనియార్డర్ చేయడంగాని బ్యాంక్‌లో డిపాజిట్ చేయడం గాని చేస్తామన్నారు. దాదాపు సంవత్సరం పాటు నిరీక్షించాము. కాని ఇంత వరకూ వారి నుండి చందా అందలేదు. రాబోయే సంచికతో 2వ సంవత్సరం కూడా పూర్తవుతుంది.

కాబట్టి వారిని వీలు చూసుకుని చందా పంపమని కోరుతున్నాము.

వారు 3వ సంవత్సరం కూడా పత్రిక కావాలనుకుంటే **400 రు॥లు** చందా పంపవలసి ఉంది.

ఒకవేళ 2వ సంవత్సరంతో ఆపివేయమని కోరేవారు **200 రు॥లు** పంపవలసిందిగా కోరుతున్నాము.

**గత సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే నెలలో జాయిన్ అయినవారి చందా కూడా పూర్తయింది.**

**ఎవరికైనా ఇబ్బందిగా ఉంటే ఫోన్ ద్వారా మాకు తెలియజేయండి. పంపడం ఆపివేస్తాము.**

మీ ఎడ్రస్ కవర్‌పై చిన్న బాక్స్‌లో సబ్‌స్క్రిప్షన్ నంబర్ ఉంటుంది.

మాకు ఫోన్ చేసినప్పుడు ఆ నంబర్ తెలపండి.

సకాలంలో చందాదారులు చందా చెల్లించకపోవడం వలన
ఆర్థికంగా భారీ మొత్తంలో మాపై భారం పడింది.

**సెప్టెంబర్ 2011 నుండి చందా కట్టినవారికి మాత్రమే 'శాంతిబాట' పత్రికను పంపగలము.**

### మనియార్డర్ ద్వారా

మనియార్డర్ ఎలా చేయాలో తెలియని వారు మీకు దగ్గరగా ఉన్న పోస్టాఫీసులో సంప్రదించండి. ఈ పేజీ తీసుకువెళ్లి చూపించండి. మనియార్డర్ చేసిన తరువాత మాకు ఫోన్ చేసి తెలియజేయండి. మనియార్డర్ ఫారమ్‌పై మీ పూర్తి ఎడ్రస్, సెల్ నంబర్‌తో సహా వ్రాయండి. మనియార్డర్ పంపవలసిన చిరునామా:

వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ
2-8-31, కోట బజార్, సామర్లకోట - 533 440

### బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ ద్వారా

బ్యాంకులో డిపాజిట్ చేయగోరువారు, వారు కట్టే మొత్తానికి 25 రు॥లు (బ్యాంక్ కమీషన్) అదనంగా కలిపి డిపాజిట్ చేయాలని కోరుతున్నాము. బ్యాంకులో ఎలా డిపాజిట్ చేయాలో తెలియకపోతే, ఈ పేజీలోని వివరాలను మీకు దగ్గరలో ఉన్న బ్యాంకులో చూపిస్తే, వారు మీకు సహకరిస్తారు. ఎకౌంట్ వివరాలు :

**State Bank of India, A/c No. 10428633092**
**Andhra University Campus, Waltair**
**Visakhapatnam, Code: SBIN0000772**
**Nagireddi Srinivasa Rao**

చందా విషయంలో సంప్రదించవలసిన నంబర్లు : 9491103017 (అబ్దుల్ కరీమ్), 9493102212 (జాకిర్)

ప్రతీ నెలా చివరి వారంలో పత్రిక ఇన్హా అల్లాహ్ పోస్ట్ చేయబడుతుంది. జనవరి 2012 నుండి ఇన్హా అల్లాహ్ మొదటి వారంలోనే పత్రికను అందించడానికి అల్లాహ్ పేరుతో కృషి చేస్తున్నాము.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ఫాతిమా(రజి) ప్రవక్త(స)వారి వద్దకు ఓ నౌకరు కోసం అడగడానికి వచ్చారు, మరియు ఆయన(స) చెప్పారు : "నీకు ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదు". కాబట్టి ఆమె వెళ్ళిపోయారు. కాని ఆ తరువాత ఆమె దగ్గరకు ఆయన(స) వచ్చి అడిగారు : 'నీవడిగినదే కావాలా? దీనికంటే మేలైనదా? ' అలీ(రజి) ఆమెకు చెప్పారు, 'అడుగు, దానికంటే మేలైన దానిని'. కాబట్టి ఆమె దానిని చెప్పారు.

ఆయన(స) చెప్పారు : "చెప్పు : అల్లాహుమ్మ రబ్బస్ - సమావాతిస్ - సబ్'ఇ వ రబ్బల్ 'అర్షిల్ అజీమ్ రబ్బనా వ రబ్బ కుల్లి షయ్ఇన్ మున్జిలత్ తౌరాతి వల్ ఇంజీలి వల్ ఖుర్'ఆనిల్ అజీమ్ అంతల్ అవ్వలు ఫలైస ఖబ్లక షయ్ఉన్ వ అంతల్ ఆఖిరు ఫలైస బాదక షయ్ఉన్ వ అంతజ్ జాహిరు ఫలైస ఫౌఖక షైఉన్ వ అంతల్ బాతిను ఫలైస దూనక షయ్ఉన్ ఇక్జి అన్నా అద్దైన వ అ'గ్ నినా మినల్ ఫఖ్రి"

(ఓ అల్లాహ్! ఏడు ఆకాశాలకు ప్రభువు మరియు సర్వోన్నత సింహాసనానికి ప్రభువు, మా ప్రభువు మరియు ప్రతీదాని యొక్క ప్రభువు, తౌరాత్, ఇంజీల్ మరియు మహోన్నత ఖుర్'ఆన్‌ను అవతరింప జేసినవాడవు. మీరే మొదటి వారు మరియు మీకు పూర్వం ఏదీ లేదు. మీరే చివరివారు మరియు మీ తరువాత ఏదీ లేదు. మీరే స్పష్టం మరియు మీపైన ఏదీ లేదు. మరియు మీరు పరోక్షులు మరియు మీ కంటే దగ్గరగా ఏదీ లేదు. మా అప్పులు పరిష్కరించండి. మరియు పేదరికం నుండి మాకు స్వేచ్ఛ నివ్వండి" (ఇబ్నెమాజా, సహీహ్, 3831, పుస్తకం 34, అధ్యా.1, సంపుటి 5)

اللَّهُمَّ! رَبَّ السَّمٰوَاتِ السَّبْعِ وَرَبَّ الْعَرْشِ الْعَظِيمِ. رَبَّنَا وَرَبَّ كُلِّ شَيْءٍ. مُنْزِلَ التَّوْرَاةِ وَالإِنْجِيلِ وَالْقُرْآنِ الْعَظِيمِ. أَنْتَ الأَوَّلُ فَلَيْسَ قَبْلَكَ شَيْءٌ. وَأَنْتَ الآخِرُ فَلَيْسَ بَعْدَكَ شَيْءٌ. وَأَنْتَ الظَّاهِرُ فَلَيْسَ فَوْقَكَ شَيْءٌ. وَأَنْتَ الْبَاطِنُ فَلَيْسَ دُونَكَ شَيْءٌ. اقْضِ عَنَّا الدَّيْنَ وَأَغْنِنَا مِنَ الْفَقْرِ.

**SAANTHIBAATA MONTHLY** **August, 2011** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India** **RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

ఏమీ వారికి తెలియదా? అల్లాహ్ తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ఇస్తాడని మరియు (తాను కోరిన వారికి) మితంగా ఇస్తాడని? నిశ్చయంగా, ఇందులో విశ్వసించే వారికి ఎన్నో సూచనలున్నాయి.

కావున నీవు నీ బంధువుకు అతని హక్కు ఇవ్వు మరియు యాచించని పేదవానికి మరియు బాటసారికి (కూడా). ఇది అల్లాహ్ ప్రసన్నతను కోరే వారికి ఎంతో ఉత్తమమైనది. మరియు ఇలాంటి వారే సాఫల్యము పొందేవారు.

మరియు మీరు ప్రజలకు - రిబా ఇచ్చి దాని ద్వారా వారి సంపద నుండి వృద్ధి పొందాలని - ఇచ్చే ధనం, అల్లాహ్ దృష్టిలో ఏ మాత్రం వృద్ధి పొందదు. మరియు మీరు అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో ఏదైనా జకాత్ (విధి దానం) చేస్తే అలాంటివారి (సంపద) ఎన్నో రెట్లు అధికమవుతుంది. (ఖుర్'ఆన్ 30:37-39)

(రిబా అంటే వడ్డీ మీద డబ్బు/కానుకలు)

మరియు బంధువులకు, పేదలకు మరియు బాటసారులకు, వారి హక్కు ఇవ్వు. మరియు వృథా ఖర్చులలో వ్యర్థం చేయకు.

నిశ్చయంగా, వ్యర్థమైన ఖర్చులు చేసేవారు షైతానుల సోదరులు. మరియు షైతాన్ తన ప్రభువు పట్ల కృతఘ్నుడైన వాడు.

(ఖుర్'ఆన్ 17:26-27)

# ఈద్ ముబారక్

జకాత్ చెల్లింపుపై వచ్చిన అభ్యంతరకర వ్యాఖ్యలు

43 ఖుర్'ఆన్ ఆయత్‌లతో వాటికి సమాధానం

Visit

www.saanthibaata.net

19 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్